అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 6-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 166 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

విజయవంతంగా జాబిల్లి కక్ష్యలోకి...

చంద్రయాన్-3 కీలక ఘట్టం పూర్తి



బెంగళూరు : చంద్రునిపై పరిశోధనల కోసం ఇస్రో పంపిన చంద్రయాన్-3ను శనివారం రాత్రి 7గంటల సమయంలో చంద్రుని కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇక్కడి మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్ (ఎంఓఎక్స్) నుంచి ఈ మేరకు ఆదేశాలను పంపినట్టు ఇస్రో తెలిపింది. ఈ మేరకు ఎక్స్ ...9లో

ఆర్టీసీ హైడ్రామా

- ప్రభుత్వమే కారణమన్న గవర్నర్
- కార్మిక సంఘాల జేఏసీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్
- తేలని పంచాయతీ...బిల్ పెండింగే...

రాజ్‌భవన్ ముట్టడించిన కార్మికులు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే విషయంలో హైడ్రామా చోటుచేసుకుంది. తాము పంపిన బిల్లును గవర్నర్ ఆమోదించలేదంటూ ప్రభుత్వం చేసిన ఆరోపణలకు గవర్నర్ కూడా ధీటుగానే సమాధానం చెప్పారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య బిల్లుపై మరిన్ని సందేహాలను వ్యక్తంచేస్తూ గవర్నర్ ప్రభుత్వానికి మరో లేఖ రాసారు. అంతకుముందు విలీన బిల్లును తక్షణం ఆమోదించాలంటూ శనివారం ఆర్టీసీ కార్మికులు అంబేద్కర్ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. దీనికి టీఎమ్‌యూ (చీలికవర్గం) ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి నేతృత్వం వహించారు. గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాజ్‌భవన్ వద్ద బైఠాయించారు. అయితే గవర్నర్ పుదుచ్చేరిలో ఉండటంతో అక్కడి నుంచి టీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జేఏసీ చైర్మెన్ అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ కే హన్మంతు ముదిరాజ్, కో కన్వీనర్ పీ కమాల్‌రెడ్డి సహా ఆరుగురు ప్రతినిధులు గవర్నర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. థామస్‌రెడ్డి, టీఆర్‌ఎస్ కేవీ రాష్ట్ర అధ్యక్షులు జి రాంబాబు సహా మరికొందరు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల గోసను అశ్వత్థామరెడ్డి గవర్నర్‌కు వినిపించారు. ప్రభుత్వం మరోసారి ఆర్టీసీ కార్మికుల భుజాలపై తుపాకీ పెట్టి గవర్నర్‌కు గురిపెట్టిస్తున్నదని చెప్పారు. దీనిపై గవర్నర్ స్పందించారు. తనకు బిల్లును ఆలస్యంగా పంపి, పరిశీలన చేయకముందే... సంతకం పెట్టలేదంటూ రాజ్‌భవన్‌ను ముట్టడించడం ఏంటని ప్రశ్నించారు. 2019 సమ్మె సందర్భంగా ఆర్టీసీ ...9లో

ఇవీ గవర్నర్ ప్రశ్నలు

- 1958 నుంచి ఆర్టీసీలో కేంద్ర గ్రాంట్‌లు, వాటాలు, లోన్లు, ఇతర సహాయం గురించి బిల్లులో ఎలాంటి వివరాలు లేవు.
- రాష్ట్ర విభజన చట్టం 9వ షెడ్యూల్ ప్రకారం ఆర్టీసీ స్థితిని మార్చడంపై సమగ్ర వివరాలు లేవు.
- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పరిగణిస్తామని చెబుతున్న ప్రభుత్వం... వారి సమస్యలకు ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ చట్టం, కార్మిక చట్టాలు వర్తిస్తాయా, వారి ప్రయోజనాలు ఎలా కాపాడబడతాయో స్పష్టత ఇవ్వలేదు.
- విలీనం డ్రాఫ్ట్ బిల్లులో ఆర్టీసీ ఉద్యోగులు అందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ ఇస్తారా?
- ప్రభుత్వ ఉద్యోగుల్లో కండక్టర్, కంట్రోలర్ వంటి పోస్టులు లేనందున వారి ప్రమోషన్లు, క్యాడర్ నార్మలైజేషన్ ఇతర ప్రయోజనాలు ఏ విధంగా అందుతాయి?

సర్కారు సమాధానాలు

- ఆర్టీసీ కార్మికులకు కార్పొరేషన్ కంటే మెరుగైన జీతాలు ఉంటాయి.
- విలీనమైన తర్వాత రూపొందించే గైడ్‌లైన్స్‌లో అన్ని అంశాలు ఉంటాయి.
- కేంద్ర ప్రభుత్వ వాటా, 9వ షెడ్యూల్ సమస్యలను ఆంధ్రప్రదేశ్ తరహాలోనే పరిష్కరిస్తాం.

ఈ వివరణలు వచ్చాక, కార్మిక సంఘాలతో భేటీ అనంతరం గవర్నర్ మరిన్ని సందేహాలను లేవనెత్తుతూ ప్రభుత్వానికి మరో లేఖ రాసారు.

- ఆర్టీసీలో కేంద్ర ప్రభుత్వ వాటా 30 శాతం ఉంది. విలీనానికి కేంద్రం సమ్మతించిందా...సమ్మతిస్తే సదరు లేఖను ఇవ్వండి.
- శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య, డిపోల వారీగా వర్గీకరించబడిన కేటగిరీల వివరాలతో మొత్తం శాశ్వత ఉద్యోగుల సంఖ్య ఎంతో చెప్పాలి.
- కాంట్రాక్ట్, క్యాజువల్, ఇతర ప్రాతిపదికలపై పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్యనూ చెప్పాలి.
- కార్పొరేషన్ ఆస్తుల నిర్వహణపై వివరణ ఇవ్వాలి. ఆస్తుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందా? లేక కార్పొరేషన్‌లోనే కొనసాగుతాయా?
- బస్సులు నడిపే అధికారానికి సంబంధించిన వివరాలు కావాలి.
- ఉద్యోగులు ప్రభుత్వ సర్వీసులోకి ప్రవేశించాక డిప్యుటేషన్ లేదా ఇతర ఏర్పాట్లపై స్పష్టత ఇవ్వాలి.
- ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు ఇవ్వాల్సి ఉంది. ఆదివారం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు ఈ అంశాలపై స్పందించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాల్సిందే..

అధికార, ప్రతిపక్ష సభ్యులందరి నోట ఒకటే మాట...



మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాల్సిందేనని అసెంబ్లీలో పలువురు అధికార, ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇదే తరహాలో ఐకేపీ వీవోఏల కొలువులను సైతం క్రమబద్ధీకరించాలని వారు కోరారు. వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసే రూలింగ్, అపోజీషన్ సభ్యులందరి నోట... ఈ రెండు అంశాలపై మాత్రం ఒకే మాట వెలువడటం గమనార్హం. శనివారం శాసనసభ జీరో అవర్‌లో 14 మంది సభ్యులు పంచాయతీ కార్మికుల సమ్మె, వారి పర్మినెంట్ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఐకేపీ వీవోఏల సమస్యలను కూడా ఎక్కువ మంది సభ్యులు ఏకరువు పెట్టారు. పల్లె ప్రగతిపై లఘు చర్చ సందర్భంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు... ఆ పార్టీని ఇరకాటంలో పెట్టాయి. ఆయన్ను, పీసీసీ చీఫ్ రేవంత్‌ను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాగా మొత్తం ఐదు బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది. మరోవైపు శాసన మండలిలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి... ఐటీడీఏలు, పోడు భూముల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. మణిపూర్‌లో ప్రభుత్వ ప్రాయోజిత హింస కొనసాగుతోందంటూ బీఆర్‌ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు శాసనసభ, అటు మండలి... ఆదివారానికి వాయిదాపడ్డాయి. 2లో..

అవసరమైన మేరకు ఐటీడీఏలను ఏర్పాటు చేయాలి

- ఆదివాసీల పోడు సమస్యలు తీర్చండి : మండలిలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో అవసరమున్న మేరకు మరిన్ని ఐటీడీఏలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు.రాష్ట్రంలో గిరిజన సంక్షేమం -పోడు భూముల పట్టాల పంపిణీ అనే అంశంపై శనివారం శాసనమండలిలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను 33కు పెంచినా ఐటీడీఏలు ఇప్పటికీ మూడుకే పరిమితమయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో అవసరం మేరకు ఐటీడీఏల సంఖ్యను మరిన్ని ...9లో

విభజించి... పాలించి ఓట్లు దండుకునే యత్నం

- బ్రిటీష్ వాళ్లు చెప్పిందే పాటిస్తున్న బీజేపీ
- ప్రభుత్వ ప్రోత్సాహంతోనే మణిపూర్‌లో హింస: మండలిలో బీఆర్‌ఎస్ సభ్యురాలు కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మణిపూర్‌లో రెండు తెగల మధ్య చిచ్చు పెట్టటం ద్వారా వారిని విభజించు పాలించు అన్నట్టుగా బీజేపీ వ్యవహరిస్తోందని బీఆర్‌ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా ఓట్లను దండుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆమె విమర్శించారు. బ్రిటీష్ వాళ్లు మొదలుపెట్టిన విభజించు పాలించు సిద్ధాంతాన్ని బీజేపీ పాటిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే ...9లో

మణిపూర్‌లో మళ్లీ హింస

ఉగ్రవాదుల దాడిలో ముగ్గురు మృతి

- ఇంఫాల్ లోయ సహా పలు ప్రాంతాల్లో 24 గంటల సమ్మె



బిష్ణుపూర్ (మణిపూర్) : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. శనివారం తెల్లవారుజామున బిష్ణుపూర్ జిల్లాలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో ముగ్గురు మరణించారని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లా క్వాక్తా సమీపంలోని ఉఖా తంపఖ్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఉగ్రవాదులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఉగ్రవాదులు తండ్రీకొడుకులిద్దరు, మరో వ్యక్తిని దారుణంగా హత్య చేసి చంపారని పోలీసులు శనివారం తెలిపారు. హత్యకు గురైన ...9లో

గుజరాత్ బీజేపీలో అసమ్మతి

పార్టీ పదవికి ప్రదీప్‌సింగ్ వాఘేలా గుడ్‌బై



అహ్మదాబాద్ : సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోడీ ఇలాకాలోనే బీజేపీలో అసమ్మతి స్వరాలు వినిపిస్తున్నాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాటిల్‌పై తిరుగుబాటు చేస్తున్న నాయకులను ఒక్కొక్కరినే బయటికి సాగనంపుతున్నారు. తాజాగా పార్టీ ఆదేశానుసారం బీజేపీ గుజరాత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ వాఘేలా తన పదవికి రాజీనామా చేశారు. ఆయనను రాజీనామా చేయాల్సిందిగా పార్టీ ఆదేశించిందని డెక్కన్ హెరాల్డ్ పత్రిక తెలిపింది. 'పార్టీ పదవికి రాజీనామా చేయాల్సిందిగా వాఘేలాను గత నెలలోనే ఆదేశించారు. గాంధీనగర్‌లోని పార్టీ కార్యాలయానికి రావద్దని కూడా చెప్పారు' అని పేరు ...9లో

మీడియా..నీ దారెటు?

అసత్యాలు, కట్టు కథలతో మత విద్వేషాలకు ఆజ్యం

నియంత్రణలో సర్కారు వైఫల్యం



న్యూఢిల్లీ : దేశంలోని వివిధ ప్రాంతాలలో ఇటీవలి కాలంలో చెలరేగిన హింసాకాండ ప్రజాస్వామ్య వాదులను, శాంతి కాముకులను ఆందోళనకు గురిచేస్తోంది. మతాలు, జాతుల మధ్య చిచ్చుపెట్టి తద్వారా రాజకీయ ప్రయోజనాలను పొందేందుకు కొన్ని శక్తులు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ఈ తరుణంలో సంయమనం పాటించి, మత సామరస్యానికి కృషి చేయాల్సిన కార్పొరేట్ మీడియా సంస్థలు అగ్నికి ఆజ్యం పోస్తూ విద్వేషాలను మరింతగా రెచ్చగొడుతున్నాయి. కొద్ది రోజుల క్రితం హర్యానాలో ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉన్న మేవాట్‌లో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ సంస్థలు నిర్వహించిన ప్రదర్శన ఘర్షణలకు దారి తీసిన విషయం తెలిసిందే. అంతకుముందు మణిపూర్‌లో కుకీలు, మైతీల మధ్య ప్రారంభమైన హింసాకాండ ఎన్నో అకృత్యాలకు, అఘాయిత్యాలకు, అమానవీయ ఘటనలకు దారి తీసింది. మణిపూర్ మంటలు ఇప్పటికీ చల్లారనే లేదు. ఆ దారుణాలపై దేశంలోనే కాదు... ప్రపంచ దేశాలలో సైతం నిరసన ధ్వనులు విన్పించాయి. ఇక ముంబయిలో కదులుతున్న రైలులో గత నెల 31న జరిగిన హత్య కూడా మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. ఆ ఘటనలో చేతన్ కుమార్ సింగ్ అనే ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ తన అధికారిని కాల్చి చంపి, ఆ తర్వాత ముగ్గురు ముస్లిం ప్రయాణికులను కూడా పొట్టన పెట్టుకున్నాడు. ఆ సందర్భంగా కొన్ని అభ్యంతరమైన వ్యాఖ్యలు ...9లో

ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించిన సుప్రీం



టెలివిజన్ ఛానల్స్‌లో వచ్చిన విద్వేషపూరిత ప్రసంగాలపై దాఖలైన పిటిషన్లను జస్టిస్ కేఎం జోసఫ్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఆ సందర్భంగా గత సంవత్సరం సెప్టెంబర్ 22న కీలక వ్యాఖ్యలు చేసింది. టీవీ ఛానల్స్ మత విద్వేషాలకు ఆజ్యం పోస్తుంటే ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఓ మతాన్ని లక్ష్యంగా చేసుకొని టీవీ ఛానల్స్‌లో వచ్చిన కథనాలు విధ్వంసానికి కారణమయ్యా యని తెలిపింది. ఇలాంటి ద్వేషపూరిత ప్రసంగాలను ప్రోత్సహిస్తుం టే దేశం ఎటుపోతుందని ప్రశ్నించారు. ఇలాంటి కథనాలు, ప్రసంగాలు టీవీ ఛానల్స్ టీఆర్‌పీ రేటింగులను, లాభాలను పెంచుతాయని అంటూ టెలివిజన్ కార్యక్రమాలను నియంత్రించేందుకు చట్టాన్ని రూపొందిం చాలని ప్రభుత్వానికి సూచించింది. చట్టాన్ని తీసుకొచ్చే వరకూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేయాలని తెలిపింది.



జాతిపిత ఆవేదన

మీడియాలో అసత్యాలు, అర్ధ సత్యాలు ప్రచారం కావడం ఇది మొదటిసారి కాదు. పత్రికలో వచ్చిన ఒక తప్పుడు వార్తను చదివి 1926 డిసెంబర్‌లో అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి స్వామి శ్రద్ధానంద్‌ను హత్య చేశాడు. దీనిపై గాంధీజీ స్పందిస్తూ రషీద్‌ను హత్యకు పురిగొల్పిన కారణాన్ని ప్రస్తావించారు. కొన్ని పత్రికలు, కొందరు పాత్రికేయులు అవాస్తవ సమాచారాన్ని మీడియా ద్వారా వ్యాపింపజేస్తున్నారని విమర్శించారు. అంతేకాదు... స్వామి శ్రద్ధానందకు నివాళి అర్పించేందుకు గౌహతిలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ విద్వేషాలను వ్యాపింపజేసే వార్తా పత్రికలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. హిందూ పత్రికలు ముస్లింలను, ముస్లిం పత్రికలు హిందువులను ద్వేషిస్తూ కాలం గడుపుతున్నాయని గాంధీజీ ఆవేదన వ్యక్తం చేశారు.

అవినీతి కేసులో పాక్ మాజీ ప్రధాని

ఇమ్రాన్ అరెస్టు



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తోషాఖానా అవినీతి కేసులో ఇస్లామాబాద్ జిల్లా, సెషన్స్ కోర్టు ఇమ్రాన్‌ను దోషిగా తేల్చుతూ తీర్పునిచ్చింది. ఈ అవినీతి కేసుపై సెషన్స్ కోర్టు న్యాయమూర్తి హుమయూన్ దిలావర్ ఇమ్రాన్‌ఖాన్‌కు మూడేండ్లపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే ఐదేండ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేశారు. ఈ కేసులో కోర్టు తీర్పు అనంతరం ఇమ్రాన్ శనివారం అరెస్టయ్యారు. అయితే కోర్టు తీర్పును ఇమ్రాన్‌ఖాన్ ఖండించారు. ఈ కేసులో అతని తరపున వాదించే న్యాయవాద బృందం వెంటనే అప్పీల్ దాఖలు చేయనున్నట్టు ఇమ్రాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తరపున వాదించిన న్యాయవా ది ఒకరు మాట్లాడుతూ.. 'ఈ కేసులో సాక్షులను హాజరుపరచడానికి మాకు అవకాశం ఇవ్వలేదు. వాదనలను పూర్తి చేయడానికి సమయం కేటాయించలేదు. మావైపు వాదనల్ని వినకుండానే కోర్టు తీర్పునిచ్చింది' అని ఆయన అన్నారు. కాగా, ఇమ్రాన్ ప్రధానిగా ఉన్న సమయంలో విదేశీ ప్రముఖుల నుంచి తాను పొందిన విలువైన బహుమతులను తోషిఖానాలో జమ చేయకుండా.. వాటిని అక్రమంగా విక్రయించారని మాజీ ప్రధాని షెహబాజ్ ఆరోపించారు. ఈ తోషిఖానా అవినీతి కేసులో ఈ ఏడాది మే నెలలో ఇమ్రాన్ అరెస్టయిన సంగతి తెలిసిందే.

ఘాటెక్కనున్న ఉల్లి

వచ్చే నెలలో కిలో రూ.60-70కి చేరే అవకాశం



న్యూఢిల్లీ : నిన్న టమాటా...రేపు ఉల్లి. టమాటా ధర ఇప్పటికే కొండెక్కి కూర్చోగా ఉల్లిగడ్డలు ఈ నెలాఖరు నుండి మరింత ఘాటెక్కబో తున్నాయి. సెప్టెంబర్ నాటికి ఉల్లి ధర కిలో రూ.60 నుండి 70 వరకూ చేరుతుందని అంటున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాలు లేకపోవడంతో ధరలు పెరుగుతాయని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. అయితే 2020 నాటి పరిస్థితి తలెత్తకపోవచ్చునని వారు చెప్పారు. 'సరఫరా-డిమాండ్ అసమానతలు ఆగస్ట్ చివరి నాటికి ఉల్లి ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రిటైల్ మార్కెట్‌లో సెప్టెంబర్ ప్రారంభం నుండే ధరలు గణనీయంగా పెరగవచ్చు. కిలో రేటు రూ.60-70 పలకవచ్చు. అయితే 2020లో పెరిగినంతగా ఉండదు' అని క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ అండ్ అనలిటిక్స్ సంస్థ వివరించింది. బహిరంగ మార్కెట్‌లో రబీ పంట నిల్వలు ...9లో

గురుకులాల్లో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

ఏకరూప పాలన అమలు చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ మహా ధర్నాలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉన్నత ప్రమాణాలతో అత్యున్నత ఫలితాలు సాధిస్తున్న గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని, శ్రమకు తగ్గ వేతనాలు ఇవ్వాలని, అన్ని గురుకులాల్లో ఏకరూప పాలన అమలు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులతోనే గురుకులాలకు మంచి పేరు వచ్చిందన్నారు. శనివారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య అధ్యక్షతన అన్ని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయులు హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సిరెడ్డి, రంగారెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు సంతోషంగా పని చేయగలిగితేనే విద్యార్థులకు సంతృప్తికరంగా బోధించగలుగుతారన్నారు. సామాజిక అంతరం పోవాలంటే గురుకులాలన్నీ ఒక్కటి కావాలన్నారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, తాత్కాలిక ఉపాధ్యాయులకు బేసిక్ పే ఇవ్వాలనీ, బీసీ గురుకుల పాఠశాలల సమయాలను ఇతర సొసైటీలతో సమానంగా మార్చాలని డిమాండ్ చేశారు. కేర్ టేకర్ నియామకం వంటి ఆర్థిక భారం లేని సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయుల మన్ననలను పొందాలన్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ...2లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.





పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాల్సిందే..

- జాతీయ అవార్డుల వెనుక పంచాయతీ కార్మికుల కష్టం : బాజిరెడ్డి
- ఐకేపీ వీఓఏల సమస్యలనూ పరిష్కరించాలని సభ్యుల వేడుకోలు
- వీఓఏ, జీపీ కార్మికుల సమస్యను సీరియస్‌గా తీసుకుంటున్నాం :మంత్రి ఎర్రబెల్లి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

అసెంబ్లీలో శనివారం జీరో అవర్ ఆసాంతం గ్రామ పంచాయతీ కార్మికుల పర్మినెంట్, ఐకేపీ వీఓఏల సమస్య పరిష్కారం చుట్టే తిరిగింది. గంట సమయంలో 46 మంది సభ్యులు మాట్లాడగా...అందులో 20 మందికిపైగా ఈ రెండు అంశాలనూ ప్రస్తావించారు. పల్లెప్రగతి సక్సెస్‌లో, జాతీయ అవార్డులను సాధించిపెట్టడంలో పంచాయతీ కార్మికుల కష్టాన్నీ సభ ముందుంచారు. దీనిని బట్టే క్షేత్రస్థాయిలో వారిపై ఎంత ఒత్తిడి ఉందో..గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లతో ఎంత న్యాయముందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సభ్యులంతా ఒకే మాట ఎత్తుకోవడంతో.. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందిస్తూ.. ఐకేపీ వీఓఏలు, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు తమ దృష్టిలో ఉన్నాయనీ, పరిష్కరించే దిశగా ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తున్నదని చెప్పారు. మిషన్‌భగీరథ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, సెకండ్ ఏఎన్ఎమ్, హోంగార్డులు, పశుమిత్రల సమస్యలనూ సభ్యులు ఏకరువు పెట్టారు. దీంతో చివరిరోజైనా తమ పట్ల సానుకూల నిర్ణయం తీసుకుంటుందన్న కొండంత ఆశతో వారు ఎదురుచూస్తున్నారు.

జీపీ కార్మికుల సమ్మెలో న్యాయం ఉంది : ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్

రాష్ట్రంలో 25 రోజులకు పైగా జీపీ కార్మికులు సమ్మె చేస్తున్నారనీ, అందులో న్యాయముందని ఆర్టీసీ చైర్మెన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జీఆరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ..ఇప్పుడు పనిచేస్తున్న జీపీ కార్మికులు 50, 100 రూపాయల దగ్గర నుంచి పనిచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. 2014లో వారి వేతనాన్ని తమ ప్రభుత్వం రూ.3వేలకు, ప్రస్తుతం దాన్ని రూ.9,500కి పెంచిన విషయాన్ని ప్రస్తావించారు. పల్లెప్రగతి కార్యక్రమం నుంచి వారి కష్టం పెరిగిందన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారన్నారు. జీపీ కార్మికుల కష్టం వల్లనే తన నియోజకవర్గంలోని రెండు పంచాయతీలకు జాతీయస్థాయిలో అవార్డులు దక్కాయని సగర్వంగా చెప్పారు. పర్మినెంట్, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ వంటి వారి డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

వీఓఏలు, జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి : సీతక్క

పెరిగిన నిత్యావసర ధరలరీత్యా రూ.3,900 వేతనంతో బతకలేక ఐకేపీ వీఓఏలు బతకడం కష్టంగా మారిందనీ, వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కాంగ్రెస్ సభ్యులు సీతక్క సభను కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల పోరాటాన్ని చూస్తుంటే ఆవేదన కలుగుతోందని చెప్పారు. నెల రోజుల నుంచి సమ్మె చేస్తుంటే పట్టదా? అని ప్రశ్నించారు. వారికి న్యాయం చేయాలని కోరారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : రఘునందన్‌రావు

మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న 662 మంది కార్మికులను తొలగించడం బాధాకరమని బీజేపీ సభ్యులు రఘునందన్‌రావు అన్నారు. వారిని ఉద్యోగాల్లో కొనసాగించాలని కోరారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మిషన్‌భగీరథ, జీపీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

గ్రూప్–2 పరీక్షల తేదీలను మార్చండి : దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

గ్రూపు–2 పరీక్షను ఆరున్నర లక్షల మంది అభ్యర్థులు రాయబోతున్నారనీ, వారందరికీ న్యాయం చేసేందుకు పరీక్ష తేదీలను టీఎస్‌పీఎస్సీ మార్చేలా చూడాలని కాంగ్రెస్ సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. అన్ని పరీక్షలు దగ్గరి తేదీల్లో నిర్వహిస్తుండటం వల్ల వారిపై భారం పడుతున్నదని చెప్పారు. వెంటనే తేదీలను రీషెడ్యూల్ చేయాలని విన్నవించారు. జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, వారికి జీవో 60 ప్రకారం వేతనాలివ్వాలనీ, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలనీ, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు పదోన్నతులు కల్పించాలని సభ దృష్టికి తీసుకొచ్చారు.

మిర్యాలగూడను జిల్లా చేయాలి : భాస్కర్‌రావు

బీఆర్ఎస్ సభ్యులు భాస్కర్‌రావు మాట్లాడుతూ..మిర్యాలగూడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. హోంగార్డులు, ఆశాలు, జీపీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. నాగార్జున సాగర్ నుంచి పంటలకు వెంటనే నీళ్లను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గొంగిడి సునీత మాట్లాడుతూ..ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని కోరారు. చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ..హోంగార్డులను పర్మినెంట్ చేయాలని విన్నవించారు.

ముంబాయిలో ఇండియా కూటమి మూడో భేటీ

జూలై 31, సెప్టెంబర్ 1 తేదీల్లో సమావేశం

- అతిథ్యం ఇవ్వనున్న శివసేన ఠాక్రే

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ఏర్పడిన ప్రతిపక్ష కూటమి ఇండియా మూడో సమావేశానికి ముంబాయి ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం తమ పార్టీ ఆధ్వర్యంలో జరుగనున్నట్టు ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన నేత, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు. ఈనెల 31 సాయంత్రం సమావేశం ప్రారంభమవుతుందని, సెప్టెంబర్ 1న 10 గంటలకు తిరిగి సమావేశం కొనసాగుతుందని చెప్పారు. మహా వికాస్ అఘాడి కూటమి శనివారం సమావేశమైన అనంతరం మీడియాతో సంజయ్ రౌత్ మాట్లాడుతూ, ముంబాయిలో జరిగే సమావేశానికి ఉద్ధవ్ ఠాక్రే ఆతిథ్యం ఇవ్వనున్నట్టు చెప్పారు. ప్రతిపక్ష నేతలతో పాటు ఐదుగురు సీఎంలు ఆగస్టు 31న ఇచ్చే డిన్నర్‌లో పాల్గొంటారని, అనంతరం పాత్రికేయులతో సమావేశం ఉంటుందని అన్నారు. ముంబాయి సమావేశంపై చర్చించేందుకు మహా వికాస్ అఘాడి నేతలంతా శనివారం నాడు సమావేశమయ్యారని, సమావేశాల విజయవంతానికి నేతలందరూ ఒక్కో బాధ్యత చొప్పున తీసుకోనున్నారని చెప్పారు. ాగా, మహా వికాస్ అఘాడి సమవేశంలో ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, ఆ పార్టీ రాష్ట్ర విభాగం చీఫ్ జయంత్ పాటిల్, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే, శివసేన (ఠాక్రే) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, సుభాష్ దేశాయ్, సంజయ్ రౌత్, కాంగ్రెస్ నేతలు, మాజీ ముఖ్యమంత్రులు పృథ్వీరాజ్ చవాన్, అశోక్ చవాన్, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ చీఫ్ బాలాసాహెబ్ థరోట్, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత విజయ్ వాడెట్టివార్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే హాజరయ్యారు. 26 పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి తొలి సమావేశం పాట్నాలో, రెండో సమావేశం బెంగళూరులో జరుగగా, మూడో సమావేశం ముంబాయిలో జరుగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

లోక్‌సభ సెక్రటేరియట్‌కు సుప్రీంకోర్టు తీర్పు కాపీ

అందజేసిన కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి

సభ్యత్వం రద్దు చేసినప్పుడు ఉన్న స్పీడ్ ఇప్పుడేమైంది?

న్యూఢిల్లీ : పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి విధించిన శిక్షపై స్టే విధించిన సుప్రీంకోర్టు తీర్పు కాపీని అధికారికంగా లోక్‌సభ సెక్రటేరియట్‌కు కాంగ్రెస్ అందజేసింది. ఈ మేరకు శనివారం ఆ పార్టీ లోక్‌సభ పక్షనేత అధిర్ రంజన్ చౌదరి అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని పునరుద్ధరించే విషయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని ఆయన తప్పు పట్టారు. రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చూసినప్పుడు చూపించిన స్పీడు.. సభ్యత్వం పునరుద్ధరించే విషయంలో ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి జాప్యపు ఎత్తుగడలు సరికాదని అధీర్ రంజన్ చౌదరి పేర్కొన్నారు. "రాహుల్ గాంధీకి విధించిన శిక్షపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. దాని అర్థం ఏమిటి? పార్లమెంట్ కార్యక్రమాల్లో ఆయనకు తిరిగి పాల్గొనే అవకాశం కల్పించినట్టే. రాహుల్‌పై అనర్హత వేటు వేసేందుకు చూపించిన స్పీడునే ఇప్పుడు సభ్యత్వం పునరుద్ధరించే విషయంలోనూ చూపించాల్సి ఉంటుంది" అని అన్నారు. స్పీకర్‌ను తాను శుక్రవారం రాత్రి కలుసుకున్నానని, ఆయన శనివారం రమ్మన్నారని, ఇవాళ కలిసినప్పుడు ఈ అంశాన్ని ఆయన సెక్రటరీ జనరల్‌కు రిఫర్ చేసి సంబంధిత డాక్యుమెంట్లను కార్యాలయంలో సమర్పించాలని చెప్పారని తెలిపారు. తాను సెక్రరటరీ జనరల్‌ను కలిశానని, తన కార్యాలయానికి సెలవు అయినందున స్పీకర్‌కు లెటర్ సమర్పించమని ఆయన చెప్పారని, లెటర్‌పై వాళ్ల సంతకం చేసినప్పటికీ స్టాంప్ వేయలేదని అధీర్ రంజన్ తెలిపారు. సభ సజావుగా సాగేందుకు, రాహుల్ తిరిగి సభకు వచ్చేందుకు స్పీకర్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాహుల్‌కు కోర్టు స్టే ఇచ్చినప్పుడు, ఆయన తిరిగి సభలోకి అడుగుపెట్టేందుకు ఎలాంటి అవరోధాలు లేకుండా చూడాలని స్పీకర్‌కు అధీర్ రంజన్ విజ్ఞప్తి చేశారు. రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడంలో జరిగిన "ఆలస్యం" గురించి ప్రశ్నిస్తూ కాంగ్రెస్ కమ్యూనికేషన్ చీఫ్ జైరామ్ రమేష్ "అవిశ్వాస తీర్మానంలో పాల్గొనడానికి ప్రధాని నరేంద్ర మోడీ భయపడుతున్నారా?" అని ప్రశ్నించారు. "సుప్రీం కోర్టు అన్యాయమైన నేరారోపణపై స్టే విధించి 26 గంటలు గడిచింది. ఆయన ఎంపి పదవిని ఇంకా ఎందుకు పునరుద్ధరించలేదు? అవిశ్వాస తీర్మానంలో పాల్గొనేందుకు ప్రధాని భయపడుతున్నారా?" అని ప్రశ్నించారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ–ముషీరాబాద్



అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. పద్మ అధ్యక్షతన శనివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి సమస్యలు పరిష్కారం కాక అంగన్వాడీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 45 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్నా వీరికి నేటికీ కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత లేదన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే పోరాటాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అనేక యాప్స్‌ను తీసుకొచ్చి పని భారాన్ని పెంచిందని, 2018లో కేంద్రం పెంచిన వేతనం ఇంకా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని, 2017 నుంచి టీఏడీఏ అందజేయలేదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిర్ణయం చేయకపోవడం వల్ల 60 సంవత్సరాలు వయసు పైబడ్డవాళ్ళు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. ఈశ్వర్ రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అంగన్వాడీ ఉద్యోగులు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కోశాధికారి కే సునీత ,రాష్ట్ర ఈ వెంకటమ్మ, జీ పద్మ, జీ జ్యోతి, స్వప్న, డీ సునీత, మంగ, స్వర్ణ ,నరసమ్మ, పార్వతి ,శారద, ఏమెలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రికి లేఖ రాస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే గురుకుల ఉపాధ్యాయులను చర్చలకు పిలిచి, శాసనసభలో ప్రకటన చేయాలని, లేదంటే సీపీఐ(ఎం) నుంచి బలమైన ఒత్తిడి తీసుకొస్తామని జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ అన్ని గురుకులాలకు కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, జీఓ 317 అమలుపై వివాదాలను, అభ్యంతరాలను సానుకూలంగా పరిష్కరించాలని, బదిలీలు, పదోన్నతులను చేపట్టాలని డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ రెసిడెన్షియల్ స్కూల్ పెంచడం బాగానే ఉన్నా. అందులో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పోస్టుల్లో కాంట్రాక్టు విధానం ఉండొద్దన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం ప్రభుత్వానికి క్షేమం కాదని హెచ్చరించారు.

టీఎస్‌యూటీఎఫ్ కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, కార్యదర్శి సింహాచలం, సీనియర్ నాయకులు పి.మాణిక్‌రెడ్డి, గురుకులాల ప్రతినిధులు ఎస్.శ్రీజన, డి.ఎల్లయ్య, జి.రాం బాబు, వి.హరీందర్‌రెడ్డి, ఎస్.రాజశ్రీ, బి.ప్రతిభ, లివిన్ స్టన్, మహేష్, దామోదర్, వేదాంతాచారి, డా.సత్యం, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నాయకులు వై.సైదులు, వి.అశోక్, గోపాల్ నాయక్, రమేష్ కుమార్, వలీ అహ్మద్, యాదగిరి, శ్యాంసుందర్, తదితరులు మాట్లాడారు. అనంతరం నెల రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని వారు ప్రకటించారు. ఈ మహాధర్నాకు వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో గురుకుల ఉపాధ్యాయులు హాజరయ్యారు.

టెట్‌కు 69,899 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు ఇప్పటి వరకు 69,899 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 73,938 మంది ఫీజు చెల్లించారని తెలిపారు. వారిలో 69,899 మంది దరఖాస్తు చేశారని వివరించారు. ఇందులో పేపర్–1కు24,294 మంది, పేపర్–2కు 3,243 మంది, రెండింటికీ కలిపి 42,362 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు ఈనెల 16 వరకు ఉన్న విషయం తెలిసిందే. వచ్చేనెల 15న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పేపర్–2 టెట్ రాతపరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోనూ నిర్వహిస్తారు. ఇతర వివరాలకు https://tstet.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఒకేషనల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

షార్ట్‌టర్మ్ ఒకేషనల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఇంటర్ విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు ఇంటర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం లక్ష్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ (ఎస్ఐవీఈ) ఆధ్వర్యంలో గతనెలలో ఈ పరీక్షలను నిర్వహించామని పేర్కొన్నారు. 1,322 మంది పరీక్షలకు హాజరుకాగా, 971 (84.24 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. 351 (15.76 శాతం) మంది ఫెయిలయ్యారని తెలిపారు. ఫలితాల కోసం sive.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

భాషాపండితులకు న్యాయం చేయండి

- మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితకు ఆర్‌యూపీపీటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భాషాపండితులకు న్యాయం చేయాలని ఆర్‌యూపీపీటీఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ, శాసనమండలిలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సింహులు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. భాషా పండితుల అప్‌గ్రెడేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలనీ, అందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారు. డీఎస్సీ–2002 ద్వారా ఎంపికైన హిందీ భాషాపండితులకు జరిగిన అన్యాయాన్ని పరిశీలించాలనీ, పాత పెన్షన్‌ను వర్తింపజేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులలో భాషా పండితులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఇశ్రాయేలు, నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలి : టీటీయూ

రాష్ట్రంలో మొదటి పీఆర్సీ గడువు జూన్ 30తో ముగిసిందనీ, గతనెల ఒకటి నుంచి కొత్త వేతనాలను అమలు చేసేందుకు రెండో పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలని టీటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రులు కేటీఆర్, పి సబితా ఇంద్రారెడ్డిని శనివారం ఆ సంఘం అధ్యక్షులు ఎం మణిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహస్వామి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఐఆర్ ప్రకటించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని సూచించారు.

జరిమానా సొమ్ముతో ఖజానా నింపుతారట

- బాధితుడికి మాత్రం పైసా ఇవ్వరట
- డీపీడీపీ బిల్లులో

ప్రజా వ్యతిరేక నిబంధనలు

న్యూఢిల్లీ : ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేసే కంపెనీలు, సంస్థలు, వేదికలపై జరిమానాలు వడ్డించి, వచ్చిన ఆ డబ్బుతో ప్రభుత్వం తన ఖజానాను నింపుకుంటుండట. బాధిత వ్యక్తులకు మాత్రం మొండిచెయ్యి చూపుతుందట. డిజిటల్ పర్సనల్ డేటా బిల్లు (డీపీడీపీ) ప్రకారం... చట్టాన్ని ఉల్లంఘించే కంపెనీలకు డేటా ప్రొటెక్షన్ బోర్డు జరిమానాలు విధించవచ్చు. వసూలైన ఆ మొత్తాన్ని కన్సాలిడేటెడ్ నిధిలో జమ చేస్తారు. అయితే ఎవరి సమాచారం చౌర్యానికి గురైందో ఆ బాధితుడికి మాత్రం ఎలాంటి నష్టపరిహారం లభించదు.

ఫిర్యాదు చేయాలంటేనే భయం

వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేసే ఏ సంస్థ పైన అయినా డేటా ప్రొటెక్షన్ బోర్డు 250 కోట్ల రూపాయల వరకూ జరిమానా విధించవచ్చు. అయితే ఇందులో ఒక్క రూపాయి కూడా బాధితుడికి చేరదు. గతంలో బాధితుడికి ఐటీ చట్టంలోని సెక్షన్ 43–ఏ కింద నష్టపరిహారం లభించేది. ఇప్పుడు తీసుకొచ్చిన బిల్లులో ఆ సెక్షన్‌ను తొలగించారు. పైగా వినియోగదారులు తమ విధులను నిర్వర్తించడంలో విఫలమైతే రూ. 10 వేల వరకూ జరిమానా విధిస్తారు. ఉదాహరణకు వినియోగదారుడు తప్పుడు లేదా పనికిమాలిన ఫిర్యాదు చేశాడనుకోండి. అతనికి జరిమానా విధించే అవకాశం ఉంది. దీనివల్ల ఫిర్యాదు చేయాలంటేనే వినియోగదారులు భయపడే పరిస్థితి నెలకొంటుంది. వినియోగదారుల సమాచార గోప్యత హక్కును పరిరక్షించడానికి బదులు వారి పైనే జరిమానాలు విధించడం సరికాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదీకాక ఫిర్యాదు చేసినా బాధితుడికి ఒరిగేదేమీ ఉండదు. అతనికి ఒక్క రూపాయి కూడా పరిహారం లభించదు. పైగా తప్పుడు ఫిర్యాదు చేశారన్న సాకుతో జరిమానా విధిస్తారేమోనన్న భయం. ఇక ఎవరు మాత్రం ఫిర్యాదు చేస్తారు?

మొండిగా వ్యవహరించిన కేంద్రం

ప్రపంచంలోని అనేక దేశాలలో అమలులో ఉన్న డేటా ప్రొటెక్షన్ చట్టాల ప్రకారం బాధితులకు నష్టపరిహారం అందజేస్తారని, మన దేశంలో మాత్రం తాజా బిల్లుతో ఆ అవకాశమే లేకుండా పోయిందని ఖైతాన్ అండ్ కంపెనీ భాగస్వామి సుప్రతిమ్ చక్రవర్తి చెప్పారు. ఆర్థిక నేరాల విషయంలో వ్యవహరించిన విధంగానే బిల్లులోని నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తారని శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కంపెనీ ఓ ప్రకటనలో తెలియజేసింది. కాగా ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని పరిరక్షించుకునే హక్కును, అదే సమయంలో ఆ సమాచారాన్ని చట్టపరమైన ఉద్దేశాల కోసం వినియోగించుకునే అవకాశాన్ని... ఈ రెండింటినీ డేటా ప్రొటెక్షన్ బిల్లు గుర్తిస్తోందని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ చెబుతోంది. బిల్లును పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం దానిని పట్టించుకోకుండా గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. బాధితులకు నష్టపరిహారం అందజేయకపోవడంపై కాంగ్రెస్ సభ్యుడు అధిర్ రంజన్ చౌదరి, ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే ఆందోళన వ్యక్తం చేశారు.

ఉర్దూ భాష అభివృద్ధికి కృషి చేసిన వారికి అవార్డులు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఉర్దూ భాష అభివృద్ధికి కషి చేసిన ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ అవార్డులను ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన 213 మంది ఉపాధ్యాయులకు ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మోతి గల్లీలోని చౌమహల్లా ప్యాలస్ ఎదురుగా గల ఉర్దూ మస్కాన్ హాల్‌లో అవార్డులను అందించనున్నట్టు ఉర్దూ అకాడమీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖా మంత్రి కొప్పులఈశ్వర్, ఉర్దూ అకాడమీ అధ్యక్షులు ఖాజా ముజీవుద్దీన్, డైరెక్టర్ షఫీఉల్లా హాజరుకానున్నట్టు తెలిపారు.

జేఏసీ నేతల నిరసన



నవతెలంగాణ–హైదరాబాద్‌బ్యూరో

గవర్నర్‌తో చర్చలకు సెలెక్టెడ్‌గా కొన్ని కార్మిక సంఘాల నేతల్నే పిలవడంపై టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. గవర్నర్ చర్చలకు రమ్మన్నారని తెలిసిన జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి (ఎంప్లాయీస్ యూనియన్), కో కన్వీనర్ కత్తుల యాదయ్య (బీకేయూ), జేఏసీ నాయకులు పీ రవీందర్‌రెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్–ఎస్‌డబ్ల్యూఎఫ్) తదితరులు రాజ్‌భవన్‌కు వెళ్లారు. అక్కడ పోలీసులు వీరిని అడ్డుకున్నారు. తమ వద్ద ఉన్న లిస్ట్‌లో వారి పేర్లు లేవని బయటే నిలిపేశారు. తాము జేఏసీ ప్రతినిధులమని చెప్పినా లోనికి అనుమతించలేదు. దీనితో పై నాయకులంతా రాజ్‌భవన్ గేటు ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చర్చల్లో కార్మిక సంఘాల పట్ల వివక్ష తగదని నినాదాలు చేశారు.

జైపూర్ ఎక్స్‌ప్రెస్ మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం

నవతెలంగాణ–సిటీబ్యూరో

జైపూర్–ముంబయి ఎక్స్‌ప్రెస్ రైలులో ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ జరిపిన కాల్పుల్లో మృతి చెందిన హైదరాబాద్ వాసి సయ్యద్ సైఫుద్దీన్ భార్య అంజుమ్ షాహీనకు రాష్ట్ర ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పించింది. కులీ కుతుబ్ షా పట్టణాభివృద్ధి సంస్థలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ ఆ సంస్థ పరిపాలనాధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జియాగూడలో డబుల్ బెడ్ రూం ఇల్లు, ఆసరా పథకం కింద వితంతు పింఛన్‌ను మంజూరు చేస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జీవో విడుదల చేశారు.

అదేవిధంగా నగరంలోని దారుస్సలాంలో మజ్లిస్ పార్టీ పక్షాన మృతుడి ముగ్గురు కుమార్తెల పేరిట రూ.1లక్ష చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు చెక్కులను బాధిత కుటుంబానికి ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అందించారు. మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ అసెంబ్లీలో ప్రస్తావించడంతో సర్కారు స్పందించి ఈ మేరకు ఉద్యోగం, ఇల్లు, పెన్షన్ ఆదేశాలు జారీ చేసింది.

గ్రామపంచాయతీ కార్మికులపై సభలో మాట్లాడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు

- సీఎం తన ప్రసంగంలో కీలక నిర్ణయం ప్రకటిస్తారని ఆశిస్తున్నాం
- గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై శాసనసభ, మండలిలో మాట్లాడిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగుల జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. ఆదివారం నాడు సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో కీలక నిర్ణయం ప్రకటిస్తున్నారని ఆశిస్తున్నామని పేర్కొంది. శనివారం ఈ మేరకు జేఏసీ చైర్మెన్ పాలడుగు భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యజ్ఞనారాయణ, కన్వీనర్లు వెంకటరాజం, పి.అరుణ్‌కుమార్, శివబాబు, ఎస్.దాసు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. శాసనసభ, మండలి సమావేశాల్లో 20 మందికిపైగా అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతుగా మాట్లాడటాన్ని స్వాగతించారు. 30 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె కు విశాల మద్దతు మద్దతు దక్కుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించి సమ్మెను నివారించాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ మాట్లాడే సందర్భంలోనైనా గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల పెంపు, కారోబార్, బిల్ కలెక్టర్లకు పదోన్నతులు, ఆరోగ్య ప్రమాద బీమా, మల్టీ పర్పస్ విధానం రద్దు తదితర అంశాల పరిష్కారం దిశగా అడుగులు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

టెక్స్‌టైల్ అస్తవ్యస్తం

● సబ్సిడీ అందక.. ట్రయల్ రన్ కాక.. ● మడికొండలో సూరత్ నేతన్నల దుస్థితి ● రూ.10.40 కోట్ల సబ్సిడీ కోసం ఎదురుచూపులు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం పిలుపునందుకొని సూరత్‌కు వలసెళ్లిన చేనేత కార్మికులు ఎంతో ఆశతో తిరిగి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హామీతో వారంతా హన్మకొండ జిల్లా కేంద్రంలోని మడికొండ కాకతీయ టెక్స్‌టైల్స్ పార్క్‌లో యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ యూనిట్లకు నేటికీ సబ్సిడీ విడుదల కాకపోవడంతో కేవలం 26 పవర్‌ల్యూమ్ యూనిట్లు మినహా ఉత్పత్తికి సిద్ధమైన మరో 140 యూనిట్లు ట్రయల్ రన్ చేయక నిలిచి ఉన్నాయి. సబ్సిడీ ఇవ్వకపోవడంతో యంత్రాలను అమర్చినా ట్రయల్ రన్ చేయకపోవడంతో సేల్‌డీడ్‌లు రూపొందించలేదు. దీంతో పార్క్ అస్తవ్యస్తంగా మారింది. 364 యూనిట్లకుగాను కేవలం 26 యూనిట్లు మాత్రమే ఉత్పత్తిని ప్రారంభించాయి. సబ్సిడీ ఇస్తేనే ట్రయల్ రన్ చేస్తామని సూరత్ నుండి వచ్చిన నేత కార్మికులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు 25 శాతం సబ్సిడీ, బ్యాంక్ ఆఫ్ ఇంట్రెస్ట్ 7.5 శాతం ఇవ్వాల్సి వుంది. వీటి కోసం చేనేత కార్మికులు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేదు. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ.2 కోట్ల మేరకు పెట్టుబడి పెట్టగా ఇందులో 25 శాతం లెక్కన రూ.25 లక్షలు సబ్సిడీగా, బ్యాంక్ ఇంట్రెస్ట్ రూపంలో మరో రూ.15 లక్షలు మొత్తంగా ఒక్కో యూనిట్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షలు చెల్లించాల్సి వుంది. ఈ మొత్తం విడుదల చేయకపోవడంతో మిగతా యూనిట్‌ల యజమానులు ముందుకు పోలేకపోతున్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా కేసీఆర్ ఆనాడు అనేకమార్లు ఇక్కడ పనులు లేక మన నేతన్నలు కడుపు పట్టుకొని సూరత్, బీవండి, సోలాపూర్‌లకు తరలి వెళ్లారని, రాష్ట్రం ఏర్పడగానే వాళ్లందరినీ తిరిగి తీసుకొచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. ఈ మేరకు సూరత్ నుండి 364 మంది చేనేత కార్మికులు తిరిగి వరంగల్‌కు రావడానికి సిద్ధపడ్డారు. దీంతో కార్మికులంతా కాకతీయ టెక్స్‌టైల్స్ మరియు వీవర్స్ వెల్ఫేర్ మ్యాక్ సొసైటీగా ఏర్పడ్డారు. 2019లో సీడీటీఎంఎస్ పథకం కింద టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు అనుమతి తెచ్చుకున్నారు. ఈ పథకం కింద ఒక్కో యూనిట్‌కు రూ.1 కోటి ఇచ్చారు. మిగతా పెట్టుబడిని బ్యాంకుల ద్వారా రుణంగా తీసుకున్నారు. సగటున ఒక్కో యూనిట్‌కు రూ.2 కోట్ల పెట్టుబడి పెట్టారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌళిక వసతుల కల్పన కార్పొరేషన్ మడికొండ ప్రాంతంలో 364 ప్లాట్లు చేసి నేత కార్మికులకు పంపిణీ చేశారు. ఇందులో షెడ్‌ల నిర్మాణం పూర్తి చేసి యంత్రాలను అమర్చారు. ఇందులో ఇప్పటికే 26 యూనిట్‌లు ఉత్పత్తిని ప్రారంభించాయి. నియమ, నిబంధనల మేరకు ఒక్కో యూనిట్‌కు 25 శాతం సబ్సిడీతోపాటు బ్యాంక్ ఆఫ్ ఇంట్రెస్ట్ 7.5 శాతం యూనిట్ యాజమాన్యానికి చెల్లించాల్సి వుంది. ఇప్పటి వరకు సబ్సిడీ చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తితో వున్నారు.

అధికారులు, కార్మికుల మధ్య నలుగుతున్న పార్క్

అధికారుల వాదన, కార్మికుల వాదనలు పరస్పరం భిన్నంగా వున్నాయి. సబ్సిడీ ఇచ్చే విషయంలోనూ భిన్నాభిప్రాయా లున్నాయి. హన్మకొండ జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు నడుస్తున్న యూనిట్‌లకు సంబంధించి దస్త్రాలు ప్రభుత్వానికి పంపామని, సబ్సిడీ విడుదల చేయాల్సి వుందని చెబుతున్నారు.

సర్కార్ సహకరించాలి : దర్గా స్వామి, ఛైర్మన్

మడికొండ టెక్స్‌టైల్స్ పార్క్‌లో ఏర్పాటు చేసిన పవర్ ల్యూమ్ యూనిట్‌లకు సబ్సిడీని విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కాకతీయ టెక్స్‌టైల్స్ మరియు వీవర్స్ వెల్ఫేర్ మ్యాక్ సొసైటీ చైర్మెన్ దర్గా స్వామి కోరారు. 166 యూనిట్లకు సబ్సిడీ విడుదల చేయకుండానే ఇఎంఐ చెల్లించమంటున్నారన్నారు. సబ్సిడీ విడుదల చేస్తే యంత్రాలు అమర్చిన యూనిట్స్‌ను కూడా రన్ చేస్తామన్నారు. కరోనాతో తీవ్రంగా నష్టపోయామని రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

రూ.10.40 కోట్ల సబ్సిడీ కోసం ఎదురుచూపులు

సూరత్ నుండి ఎంతో ఆశతో వచ్చిన నేత కార్మికులు మడికొండ పార్క్‌లో యూనిట్‌లను ఏర్పాటు చేసినా, సకాలంలో సబ్సిడీ ఇవ్వకపోవ డంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ మ్యాక్ సొసైటీ కార్మికులు మొత్తం 166 యూనిట్లకు సబ్సిడీ రావాలంటున్నారు. అధికారులు మాత్రం 26 యూనిట్లకే సబ్సిడీ రావాలంటున్నారు. ఈ మేరకు ఆ యూనిట్‌లకు సంబంధించిన దస్త్రాలను ప్రభుత్వానికి పంపినట్టు చెబుతున్నారు.

సమన్వయలోపం కార్మికులకు శాపం..

ఒకవైపు బ్యాంకు అధికారులు, ఇచ్చిన రుణానికి ఇఎంఐ చెల్లించాలని పట్టుపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తాం, మీరు ఇక్కడే పనిచేసుకోండని ప్రకటిస్తుందే తప్పా నిధులను విడుదల చేయదు. దీంతో పవర్‌ల్యూం కార్మికులు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. యంత్రాలను ట్రయల్ రన్ చేయకపోతే సేల్ డీడ్ చేయమని టీఎస్ఐఐసీ అధికారులు చెబుతుండగా, సేల్ డీడ్ చేయకుండా జాప్యం చేస్తే సిక్ ఇండస్ట్రీల కింద ప్రకటించి వేలం వేసే పరిస్థితి ఉత్పన్నమవుతుందని బ్యాంకు అధికారులు హెచ్చరిస్తున్నారు. యంత్రాలను నడిపి ఉత్పత్తి ప్రారంభించి మార్కెటింగ్ చేసి సేల్స్ ట్యాక్స్ కడితేనే యూనిట్‌లు పద్ధతి ప్రకారం పనిచేస్తున్నట్టు అని అని బ్యాంకర్లు చెబుతున్నారు.



సభాపర్వం


సారు స్పీచ్‌పై సర్వత్రా ఆసక్తి...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ ఆదివారం శాసనసభలో చేయబోయే ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అసెంబ్లీ సమావేశాల మొదటి రోజైన గురువారం ఆయన సభకు విచ్చేశారు. ఆ తర్వాత శుక్ర, శనివారాల్లో సభ జరిగినప్పటికీ సీఎం రాలేదు. సమావేశాలకు ఆఖరి రోజుగా భావిస్తున్న ఆదివారం ఆయన కచ్చితంగా సభకు రానున్నారు. సుదీర్ఘంగా ప్రసంగించనున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పీఆర్‌సీ, ఐఆర్, గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె, ఐకేపీ వీవోల సమస్యలు, ఆర్టీసీ విలీనం, జర్నలిస్టుల ఇండ్ల సమస్యలు తదితరాంశాలపై ముఖ్యమంత్రి స్పందన కోసం ఆయా వర్గాలు ఆశగా ఎదురు చూస్తున్నాయి. ఇదే సమయంలో ప్రస్తుత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఇవే చివరి అసెంబ్లీ సమావేశాలు కానున్నాయి. ఈ క్రమంలో గత ఐదేండ్లలో తాము చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు తదితరాంశాలపై సీఎం... సుదీర్ఘంగా ప్రసంగించే అవకాశాలున్నాయి. వచ్చే శాసనసభ ఎన్నికల దృష్ట్యా కూడా అధికార పక్షానికి ఈ సమావేశాలు చాలా కీలకమైనవి. ఈ నేపథ్యంలో కేసీఆర్ వివిధ అంశాలపై ఎలా స్పందిస్తారు..? ఏం మాట్లాడతారనేది వేచి చూడాల్సిన అంశంగా మారింది.

సర్కారుకు ఆ రెండే ఆదాయ మార్గాలు..

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎద్దేవా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మద్యంతో పాటు భూముల అమ్మకాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రభుత్వం భావిస్తున్నదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి తెలిపారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు ఆ రెండేనని ఎద్దేవా చేశారు. ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ వాటా 44 శాతం అని చెబుతున్నారు.. కానీ ఆయా కంపెనీల్లో తెలంగాణ ఉద్యోగుల వాటా ఎంతని ప్రశ్నించారు. రాష్ట్రం వచ్చిన తర్వాత పాలకులు మారారు తప్ప... ప్రజల జీవన స్థితగతుల్లో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకు అవకాశాలు కల్పిస్తున్నారనీ, తెలంగాణలో మాత్రం అలాంటి పరిస్థితి లేదని చెప్పారు.

మిగిలిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి : మండలిలో నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులనూ రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన కింద ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. జీవోనెంబర్ 16 ప్రకారం కాంట్రాక్టు అధ్యాపకులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసిందన్నారు. జూనియర్ కాలేజీల్లో 470 మంది, డిగ్రీ కాలేజీల్లో 600 మంది ఇంకా రెగ్యులరైజ్ కాకుండా మిగిలిపోయారని వివరించారు. వారు అర్హతలు కలిగి ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో 1,339 మంది కాంట్రాక్టు అధ్యాపకులను కూడా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఎక్కువ మంది విద్యాశాఖకు చెందిన వారే ఉన్నారని చెప్పారు. మిగిలిన వారిని రెగ్యులరైజ్ చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టాలి : ఏవీఎన్ రెడ్డి

రాష్ట్రంలో స్పౌజ్ టీచర్లకు బదిలీలను చేపట్టాలని బీజేపీ సభ్యుడు ఏవీఎన్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. భార్య ఒక చోట, భర్త మరోచోట విధులు నిర్వహించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారిని ఒకే జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ల స్పౌజ్ బదిలీలు చేశారని వివరించారు. మిగిలిన ఎస్జీటీలు, భాషాపండితులు, పీఈటీలకు సంబంధించిన స్పౌజ్ బదిలీలు చేపట్టాలని సూచించారు. దీనిపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ సీఎం కేసీఆర్ సహకారంతో మూడు వేల మంది స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టామని గుర్తు చేశారు. మిగిలిన వారికి సంబంధించి ఆయా జిల్లాల్లో ఖాళీ పోస్టులను బట్టి స్పౌజ్ బదిలీలు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తామని హామీనిచ్చారు.

గవర్నర్ వెనక్కి పంపిన బిల్లులకు మండలి మరోసారి ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ వెనక్కి పంపించిన నాలుగు బిల్లులను శాసనమండలి శనివారం మరోసారి ఆమోదించింది. తెలంగాణ మున్సిపల్ లా (సవరణ) బిల్లు -2022ను, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (సవరణ) బిల్లు-2022ను రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు మండలిలో ప్రవేశపెట్టారు. తెలంగాణ ప్రయివేటు యూనివర్సిటీ సవరణ బిల్లు-2022ను విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మరోసారి ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది.

మండలిని సందర్శించిన సర్కారు బడి పిల్లలు

స్వాగతం పలికిన ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు శనివారం శాసన మండలిని సందర్శించారు. ఎమ్మెల్సీలు కవిత, వాణీదేవి వారికి స్వాగతం పలికారు. మండలి పనితీరు, సభా కార్యకలాపాలు జరిగే పద్ధతి గురించి ఎమ్మెల్సీ కవిత వారికి వివరించారు. మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆయా విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం అందరూ కలిసి చైర్మెన్ ఛాంబర్‌లో ఫొటో దిగారు. విద్యార్థులు మండలి పనితీరు తెలుసుకోవడంతో ప్రజాసేవపై వారికి ఆసక్తి పెరుగుతుందని కవిత వ్యాఖ్యానించారు.

ఆర్టీసీ విలీనానికి బీజేపీ వ్యతిరేకం కాదు..: ఎమ్మెల్యే ఈటల



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి బీజేపీ ఎంత మాత్రం వ్యతిరేకం కాదని ఆ పార్టీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... ఈ విషయంలో ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. గవర్నర్ లేని సమయంలో బిల్లు పంపి ఆమోదించడంలేదంటూ విమర్శించటమేంటని ప్రశ్నించారు. ఈ రకంగా బట్ట కాల్చి మీద వేస్తున్నారని వాపోయారు. ఆర్టీసీ కార్మికులకు రెండు పీఆర్సీలు ఇవ్వలేదని తెలిపారు. వారి గుండెల్లోని బాధను మర్చిపోలేమన్నారు. మహిళా కండక్టర్లకు ఇష్టం లేకపోయినా రాజ్‌భవన్ వద్ద ధర్నాకు పంపుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహిస్తున్నదని విమర్శించారు. ప్రజల కోసం సమావేశాలు జరగడం లేదని.. తమ వైపు స్పీకర్ కన్నెత్తి చూడటం లేదని చెప్పారు. తాము మాట్లాడితే ఒక వైపు హరీష్‌రావు, కేటీఆర్ దాడి చేస్తున్నారని విమర్శించారు. గ్రామ పంచాయితీ సిబ్బంది జీతాలు రాక ఆందోళన చేస్తున్నారని గుర్తుచేశారు.

రైల్ కాల్పుల ఘటనలో మరణించిన సైపుద్దీన్ కుటుంబానికి కేటిఆర్ అండ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీలో హామీ ఇచ్చిన ప్రకారం, జూలై 31న జైపూర్-ముంబై రైలు ఘటనలో మరణించిన హైదరాబాద్ నివాసి సయ్యద్ సైపుద్దీన్ కుటుంబానికి మంత్రి కేటీ రామారావు రామారావు అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. మరణించిన సైపుద్దీన్ భార్య అంజుమ్ షాహీన్‌ను శనివారం అసెంబ్లీ ఆవరణలోని మంత్రి కార్యాలయంలో కలిసారు. తెలంగాణ ప్రభుత్వం వారి కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. షాహీన్‌కు కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో ఆఫీస్ సబార్డినేట్‌గా నిమించిన ఉత్తర్వులను ఆమెకు అందజేశారు. దీంతో పాటు ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్ ఫ్లాట్ మంజూరు, కేటాయింపు పత్రాన్ని అందజేశారు. సైపుద్దీన్ ముగ్గురు పిల్లలకు... ఒక్కొక్కరి కోసం రూ.రెండు లక్షల చొప్పున బీఆర్ఎస్ పార్టీ తరపున అందించారు.

చారిత్రాత్మక కట్టడాల పునరుద్ధరణకు చర్యలు

● జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

● ఆరు పురాతన కట్టడాల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

చారిత్రాత్మక కట్టడాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. శనివారం హైదరాబాద్ పాతబస్తీలోని ఆరు పురాతన కట్టడాలను ఆయన సందర్శించారు. చెత్త బజార్ కమాన్, హుస్సేనీ ఆలం కమాన్, షేక్ ఫాయిజ్ కమాన్, దేవన్ దేవిడి కమాన్, డబీర్ పుర కమాన్, రాణిగంజ్ కమాన్‌ల పునరుద్ధరణ పనులను చేపట్టేందుకు ఇ.ఎన్.సీ జియాఉద్దీన్‌తో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో గల చారిత్రాత్మక కట్టడాలు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. గతంలో చార్మినార్ పెడెస్ట్రియన్ ప్రాజెక్ట్ ద్వారా సుమారు రూ. 60 కోట్లతో 13 పనులు చేపట్టామని, అందులో ఆరు పనులు పూర్తి కాగా మిగతావి వివిధ అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. హైదరాబాద్ వారసత్వ సంపదను భావితరాల వారికి అందించాలనే నేపథ్యంలో మూడు పురాతన హెరిటేజ్ భవనాల పునర్నిర్మాణం, పరిరక్షణకు రూ. 18 కోట్ల వ్యయంతో మోజంజాహి మార్కెట్, మౌలాలి కమాన్, క్లాక్ టవర్ పనులు ప్రారంభించామన్నారు. అదేవిధంగా రూ. 30 కోట్ల వ్యయంతో చేపట్టిన ముర్గీ చౌక్ పునర్నిర్మాణ పనులు, రూ. 30 కోట్ల వ్యయంతో చేపట్టిన సర్దార్ మహల్ పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ నాయక్, చార్మినార్ జోన్ ఎస్.ఇ మహేశ్వర్ రెడ్డి, కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఇ.ఇ శంకర్, మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోడేపూడి స్ఫూర్తితో ఉద్యమాలు : తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బోడేపూడి వెంకటేశ్వరరావు సీపీఐ(ఎం)శాసన సభాపక్ష నాయకుడిగా పనిచేస్తూనే రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేశారని తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బోడెపుడి 26వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమానికి ఆకర్షితులైన బోడెపుడి పూర్తికాలం కార్యకర్తగా ఖమ్మం జిల్లాల్లో పని చేశారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని వదులుకుని ప్రజా సేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ ఏ సమస్య ఉత్పన్నమైనా.. అక్కడ ప్రత్యక్షమై సమస్యను పరిష్కరించడానికి కృషి చేశారని చెప్పారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల, కార్మికుల సమస్యలతోపాటు రైతాంగ సమస్యలను కూడా ప్రభుత్వ దృష్టికి తేవడమేగాక ఉద్యమాల్లో ప్రత్యక్ష పాత్ర పోషించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కరువు, వరదలు ఏర్పడి తీవ్ర నష్టం జరిగినప్పుడు ఆయా ప్రాంతాలకు వెళ్ళి నష్టపోయిన వారికి ధైర్యం చెప్పడమేగాక ప్రభుత్వంతో పోరాడి పరిహారం ఇప్పించారని తెలిపారు. నేటి ప్రభుత్వాలు వాగ్దానాలు చేయడమే తప్ప ఆచరణలో పరిహారాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ క్రమంలో బోడెపుడి పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమాన్ని విస్తరించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, రాష్ట్ర నాయకులు ఆర్. అంజనేయులు, రైతు సంఘం నాయకులు ఆర్. రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నాన్‌మైనార్టీ వైద్య కళాశాలల్లో ఏ కేటగిరీ సీట్లను 60 శాతానికి పెంచాలి

ప్రశ్నోత్తరాల్లో అక్బరుద్దీన్, భట్టి

● కమిటీ వేస్తాం : మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని మైనార్టీ మెడికల్ కాలేజీల్లో మాదిరిగానే నాన్‌మైనార్టీ కళాశాలల్లోనూ ఏ కేటగిరీ సీట్లను 60 శాతానికి పెంచాలని ప్రతిపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పట్టుబట్టారు. మైనార్టీ కళాశాలల్లో 60 శాతం ఏ కేటగిరీ సీట్లున్నాయని తెలిపారు. నాన్‌మైనార్టీ కాలేజీల్లోనూ ఏ కేటగిరీ కోటాను పెంచడం వల్ల ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు న్యాయం చేకూరుతుందని నొక్కి చెప్పారు. దీనిపై మంత్రి హరీశ్‌రావు వివరణ ఇస్తూ పరిశీలించి కమిటీ వేస్తామని హామీనిచ్చారు. దీనిపై అక్బరుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ..'పేద విద్యార్థులకు నష్టం జరుగుతుంటే కమిటీలేంటి? కౌన్సిలింగ్‌ను ఆపేయండి' అంటూ అరిచారు. రాష్ట్రంలో నూతన వైద్య కళాశాలల ఏర్పాటుపై శనివారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో బీఆర్ఎస్ సభ్యులు గాదరి కిశోర్, డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ మెతుకు ఆనంద్, ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క లేవనెత్తిన అంశాలపై మంత్రి సమాధానం ఇచ్చారు. ఎనిమిదేండ్లలో రాష్ట్రంలో 29 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు మంజూరు చేశామన్నారు. 21 కళాశాలలు నిర్వహణలో ఉన్నాయని తెలిపారు. మరో 8 కళాశాలల ఏర్పాటు ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో వైట్‌కోర్టు రెవల్యూషన్ నడుస్తున్నదన్నారు. ఒకనాడు రాష్ట్రంలో 2250 మెడికల్ సీట్లుంటే ఆ సంఖ్య నేడు 8,515కి చేరిందనీ, పీజీ సీట్ల సంఖ్య 2,890కి పెరిగిందని వివరించారు. ఎమ్‌బీబీఎస్ సీట్లు మూడు రెట్లు, పీజీ సీట్లు రెండున్నర రెట్లు పెరిగాయన్నారు. వంద సీట్ల మెడికల్ కాలేజీ ఏర్పాటుకు రూ.300 కోట్లు, 150 సీట్ల కళాశాలకు రూ.500 కోట్లు ఖర్చువుతున్నదని వివరించారు. ఒక్కో మెడికల్ విద్యార్థిపై రూ.30 లక్షలు, పీజీ విద్యార్థిపై రూ.45 లక్షలు, సూపర్ స్పెషాల్టీల తయారీకి రూ.75 లక్షలు ఖర్చవుతుందని సభకు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్రంలో డాక్టర్ల సంఖ్య ఉందని చెప్పారు.

కేంద్రం ప్రయివేటీకరిస్తుంటే..మేం కాపాడుతున్నాం : మంత్రి జగదీశ్‌రెడ్డి



సింగరేణి బొగ్గు గనుల వేలం అంశంపై సభ్యులు సీఎల్పీ నేత భట్టివిక్రమార్క, కాంగ్రెస్ సభ్యులు శ్రీధర్ బాబు, బీఆర్ఎస్ సభ్యులు కోరుకంటి చందర్, సండ్ర వెంకటవీరయ్య, దివాకర్‌రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి జి.జగదీశ్‌రెడ్డి సమాధానిచ్చారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని చూస్తున్నది ఒక్క కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. విద్యుత్ సంస్థ ప్రయివేటీకరణను వ్యతిరేకించింది తమ ప్రభుత్వమేనన్నారు. సింగరేణిపై కేంద్రం జోక్యం పెరుగుతున్నా చివరకు వరకు కాపాడుకునే ప్రయత్నం చేస్తామని చెప్పా రు. సింగరేణి ప్రాంతంలో ఇతర నిక్షేపాలను వెలికి తీసే బాధ్యత ప్రయివేటుకు అప్పగించాలని కేంద్రం యత్నాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

ఎకరా పామాయిల్ తోటపై రూ.50,918 సబ్సిడీ : మంత్రి నిరంజన్‌రెడ్డి



రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకంపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, సాగు ప్రోత్సహంపై అధికార పార్టీ సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అడిగిన ప్రశ్నలకు మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. ఆయిల్ ఫామ్ సాగుచేస్తున్న రైతులకు ఎకరాకు రూ.50918 సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. పన్నెండున్నర ఎకరాల వరకు రైతుల కేటగిరీ ప్రాతిపదిక 80 శాతం నుంచి 100 శాతం వరకు బిందు సేద్య సహాయాన్ని కల్పిస్తున్నామన్నారు. తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగును ప్రోత్సహించేవిధంగా అడుగులు వేస్తున్నామన్నారు. 25-30 ఎకరాల్లో కూడా సాగుచేసే రైతులకు సహాయం అందించే విషయంపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్రంలో 7.7 శాతం పచ్చదనం పెరిగింది : మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



రాష్ట్రంలో హరితహారం వల్ల పచ్చదనం 7.7 శాతం అధికంగా పెరిగిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చెప్పారు. హరిత వనాల పెంపుపై అధికార పార్టీ సభ్యులు గువ్వల బాలరాజు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమి చ్చారు. రాష్ట్రంలో 13.44 ఎకరాల్లో అంతరించిపోయిన అడవులను పునర్జీవింపజేశామని తెలిపారు. 109 పట్టణ పార్కులకుగానూ ఇప్పటికే 73 పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. రాష్ట్రంలో 14864 నర్సరీలు, 19472 పల్లె ప్రకృతి వనాలు, 2011 బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశామన్నారు.

కాందిశీకుల భూములను కాపాడాలి

401 ఎకరాల భూములను భూమిలేని పేదలకు పంచాలి

తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు



నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో కాందిశీకుల భూములను భూబకాసురుల నుంచి కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు డిమాండ్ చేశారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కార్మిక సంఘం బృందంతో కలిసి సర్వేనెంబర్ 114,115లలో కాందిశీకుల భూములను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీ పెద్దలు కలిసి 401 ఎకరాల భూములను కాజేయడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్, చౌటుప్పల్ ఆర్డీఓ, తహసీల్దార్ మంత్రి జగదీశ్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాటలు వినకపోవడంతో రాత్రికి రాత్రే వారిని బదిలీ చేయించారని అన్నారు. కాందిశీకుల వారసుల పేర్లపై దొంగ చాటుగా భూములను ఆక్రమించుకునేందుకు యత్నించారని విమర్శించారు. ఈవిషయం మీడియాకు లీకు కావడంతో విషయం వెలుగులోకొచ్చిందన్నారు. 1952 సంవత్సరంలో కాందిశీకులకు 401 ఎకరాల భూములను కేటాయించగా వారు దేశ విభజనలో పాకిస్తాన్‌కు వెళ్లారన్నారు. అప్పటినుండి ఆ భూములు పడావుగా ఉందన్నారు. ఈ మధ్యకాలంలో కొంతమంది తప్పుడు ధృవపత్రాలు సృష్టించి ఆ భూములకు మేమే వారసులమంటూ చూస్తున్నారని విమర్శించారు. ఒకట్రెండు కుటుంబాలకు వంద ఎకరాల భూములు ఎట్లా వస్తాయని ఆయన ప్రశ్నించారు. నిజమైన వారసులు ఎవరో తేల్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంచకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఇండ్లు, భూములు లేని నిరుపేదలకు పంచుతామని హెచ్చరించారు. చౌటుప్పల్ మండలంలో ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో సర్వే చేసి ఇండ్లస్థలాలు, భూములు లేని నిరుపేదలకు పంచాలని కోరారు. రానున్న కాలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేపడతామన్నారు. కొంతమంది ఆ భూములను కాజేయాలని కుట్రలు చేస్తున్నారని పెద్దఎత్తున వార్తలు వస్తున్నాయన్నారు. ఈ వ్యవహారంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రకటన చేయాలని కోరారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ,రాష్ట్ర కమిటీ సభ్యులు, సీపీఐ(ఎం) మండలకార్యదర్శి గంగాదేవి సైదులు, జిల్లా సహాయ కార్యదర్శి గుంటోజు శ్రీనివాస్‌చారి, మండల ప్రధానకార్యదర్శి బొజ్జ బాలయ్య, జిల్లా కమిటీ సభ్యులు బోయ యాదయ్య, మానే సాలయ్య, మండల సహాయకార్యదర్శి మీసాల శ్రీనివాస్, గ్రామ నాయకులు గుండ్ల మహేష్, చెంచలమదారి, కాసం వెంకటేష్ పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు , ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణా సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ బాల రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్‌కు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సుధారాణి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

హర్యానాలో బుసకొట్టిన మతోన్మాదం



తెలకపల్లి రవి

మతసామరస్యం, లౌకికతత్వం కాపాడుకోవాలని చాలాకాలంగా ప్రజాస్వామికవాదులు చెబుతున్న మాట ఎంత నిజమో ఆచరణలో అర్థమవుతున్న సందర్భమిది. దేశ పాలకులు ఆ విధమైన సందేశంతో ముందుకు రావడం లేదు సరికదా ఎగదోసేందుకు కారణమవుతున్నారు.గత మూడు మాసాలుగా దేశం మణిపూర్‌లో హింసాకాండపై కలత చెందుతున్నది. ఈశాన్యాన కొండకోనల్లో మారుమూలల్లో మహిళలపై ఘోరకలి సాగిన తీరు తెలుసుకుని భరతమాత తల్లడిల్లింది. అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహించింది. దేశం సిగ్గుపడాలని ప్రధాని మోడీ పార్లమెంటు భవనం ముందు ప్రవచించారు కూడా. అయితే అత్యున్నత చట్టసభ అయిన పార్లమెంటులో అదే మాట చెప్పడానికి ఒప్పుకోలేదు. ఉభయ సభల్లో ఆ అంశం సమగ్రంగా చర్చించడానికి కేంద్రం సిద్ధపడలేదు. అవిశ్వాస తీర్మానం రూపంలో చర్చ చేద్దామని ప్రతిపక్షాలు కొత్తవ్యూహం చేపట్టాల్సి వచ్చింది. ఈలోగా దేశ రాజధాని శివార్లలోని కార్పొరేట్ హబ్ గుర్‌గ్రాం, నూహ్ పట్టణాల్లో మత కలహాలు భగ్గుమన్నాయి. మత సంస్థలు వ్యూహాత్మకంగా పెట్టిన చిచ్చు ఆరుప్రాణాలు పోవడానికి కారణమైంది. హిందూత్వ శక్తుల కవ్వింపు చర్యలు, వాటిపై అభద్రతతో ముస్లింలు రెచ్చిపోవడం తీవ్ర హింసాకాండకు దారి తీసింది. అక్కడ చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారు, పనిచేసుకుని పొట్ట పోసుకునే శ్రమజీవులు వలస ప్రాణులు అకారణంగా బలైపోయారు. మణిపూర్ మంటలు ఢిల్లీపాలకులను చేరడానికి చాలా సమయం పట్టింది కానీ ఈ విధ్వంసం దావానంలా వ్యాపించిన హింస దేశానికే కలవరం కలిగించాయి.

ఈ సమయంలోనే వారణాసిలోని జ్ఞానవాపి మసీదు వాజ్యం తిరగదోడబడింది. ఒకప్పుడు అయోధ్యలో బాబ్రీమసీదు/రామజన్మభూమి వివాదం రగిలిన తీరులోనే ఇప్పుడు వారణాసి వివాదం రగులుకుంటుందనే సందేహాలు బలపడుతున్నాయి.ఈ మసీదులో పురావస్తు పరిశోధనలు జరపాలంటూ కింది

> హర్యానాలో చెలరేగిన మత ఘర్షణలు, విధ్వంస విద్వేషాలు వాస్తవానికి ఢిల్లీలో జరిగినట్టే భావించాలి. ఎందుకంటే గురుగ్రామ్ పారిశ్రామిక కేంద్రం దేశ, విదేశీ పెటు బడులకు పెద్ద సంస్థలకు నిలయం. దేశమంతటినుంచి వచ్చిన సాంకేతిక నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అక్కడుంటారు. ఇటీవలే కురిసిన కుంభవృష్టి వరదల సమయంలో ఈ సంపన్నులు తప్పించు కోగలిగారు గాని మతకలహాల దెబ్బకు తట్టుకోలేక పోయారు.

కోర్టు ఇచ్చిన ఆదేశాల్లు సుప్రీం కోర్టు దాకా వెళ్లి తిరిగి హైకోర్టుకు వచ్చి అనుమతి పొందాయి. అయితే ఆ అనుమతితో నిమిత్తం లేకుండా యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాన్ని మసీదు అనవక్కరలేదని ఏకపక్షంగా ప్రకటించేశారు. ఇలాంటి వైఖరి ఆచరణలో మతోన్మాద రాజకీయాలను ఎలా ప్రకోపింపచేస్తుందో చాలాసార్లు చూశాం. అన్నట్టు మధురలోనూ కృష్ణ జన్మస్థాన్ ఇలాంటి మలుపులే తిరుగుతున్నది. వందల సంవత్సరాల కిందటి చరిత్ర పరిణామాలపై ఇలాటి వివాదాలు పునరావృతం కాకూడదనే పార్లమెంటు 1991 ప్రార్థనా స్థలాల చట్టం ఆమోదించింది. అయోధ్య సమస్యలో సుప్రీం కోర్టు తీర్పును పాటించాలని మిగిలిన అన్ని చోట్ల 1947 ఆగష్టు15న స్వాతంత్రం వచ్చిన నాటి యథతథ స్థితి కొనసాగాలి తప్ప కొత్త వివాదాలు అనుమతించరాదని ఈ చట్టం నిర్దేశించింది. కాని స్వయాన సుప్రీం కోర్టు ఇప్పుడా చట్టానికి కొత్త భాష్యం చెప్పి కొత్త తగాదాలకు తలుపుతీసింది. ఈ వివాదాలు, విధ్వంసాలు వి ద్వేషాల పర్యవసానాల పట్ల ప్రతిభారతీయుడూ అప్రమత్తంగా వుండాలి. జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఒక ఆర్‌పిఎఫ్ జవాన్ నలుగురు ముస్లింలను వెతికి మరీ కాల్చి చంపడం అతన్ని మతిస్తిమితం లేనివాడని అధికారులు సమర్థించడం కూడా ఇలాటిదే.

హర్యానాలో జరిగిందేమిటి?

హర్యానాలో చెలరేగిన మత ఘర్షణలు, విధ్వంస విద్వేషాలు వాస్తవానికి ఢిల్లీలో జరిగినట్టే భావించాలి. ఎందుకంటే గురుగ్రామ్ పారిశ్రామిక కేంద్రం దేశ, విదేశీ పెట్టుబడులకు పెద్ద సంస్థలకు నిలయం. దేశమంతటి నుంచి వచ్చిన సాంకేతిక నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అక్కడుంటారు. ఇటీవలే కురిసిన కుంభవృష్టి వరదల సమయంలో ఈ సంపన్నులు తప్పించు కోగలిగారు గాని మతకలహాల దెబ్బకు తట్టుకోలేకపోయారు. పని చేసుకోవడానికి వలస వచ్చిన అనేక మంది ఇంటిదారి పట్టారు. చిన్నచిన్న వ్యాపారులు దారుణంగా నష్టపోయారు. వారి దుకాణాలు, హోటళ్లు, ఇండ్లు ధ్వంసం కావడం , పూర్తిగా ధగ్ధమై పోవడం వారిని కుదిపేసింది. డబుల్ ఇంజన్ సర్కార్ల బీజేపీ నేతల నుంచి ఒక్క ఓదార్పుమాటైనా రాకపోగా ఎదురు దాడి చేస్తుండడంతో హతాశులై వారు మరెక్కడికి పోవాలని కలవరపడు తున్నారు. మొత్తం వ్యవహారం చూస్తే ఒక పథకం ప్రకారమే అల్లర్లు సృష్టించినట్టు స్పష్టమవుతున్నది. వాస్తవానికి నూహ్ ముస్లిం జనాభా అధికంగా వుండే ప్రాంతం.జులై 31న విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఇతర పరివార్ సంస్థలు రెండు దేవాలయాల మధ్య బ్రిజ్ మండల్ యాత్ర ప్రదర్శన నిర్వహిస్తామని ప్రకటించాయి. సంప్రదాయకంగా ఎప్పటినుంచో జరుగుతున్న ఈ ప్రదర్శన ఇటీవలి సంవత్సరాలలో ఉద్రిక్తతలకు ఆలవాల మవుతున్నది. ఎందుకంటే వీహెచ్‌పీ స్థానికులతో పాటు చుట్టుపక్కల రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి కూడా భారీగా జన సమీకరణ చేసి బలప్రదర్శనగా మార్చేసింది. పైగా ఈ సారి యాత్రలో భజరంగదళ్ నాయకుడైన మోనూ మనేసర్ పాల్గొం టాడని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ మనేసర్ భివానీ జిల్లా భరత్‌పూర్‌లో మొన్న ఫిబ్రవరిలో గోరక్షణ పేరిట నిస్సార్, జునాయిడ్ అనే ఇద్దరు ముస్లిం యువకుల హత్యకేసులో నిందితుడుగా వున్న వ్యక్తి. దానికి ముందు జిమ్‌లో శిక్షణ నిచ్చే ఆసిఫ్‌ఖాన్, వారిస్ ఖాన్ అనే మెకానిక్ హత్యలో కూడా నిందితుడుగా వున్నాడు. అలాంటి వ్యక్తి పాల్గొంటాడని ప్రకటించడం ముస్లిం యువతలో తీవ్ర నిరసనకు దారితీసింది. వారూ వ్యతిరేకంగా సమీకృతం కావడం ప్రచారం సాగించడానికి దారితీసింది. ముందునుంచి సోషల్ మీడియాలో ఈ కథనాలు పోటాపోటీగా నడిచాయి. ఈ సారి ప్రదర్శన తీవ్ర హింసాకాండకు దారితీయవచ్చునని ముందునుంచే పరిశీలకులు అనుమానిస్తూ వచ్చారు. రాజకీయ పార్టీల నాయకులు ఆ మేరకు పోలీసుల యంత్రాంగానికి హెచ్చరికలు చేశారు కూడా. అయితేనేం దేశంలో ఇప్పుడున్న వాతావరణం బీజేపీ-ఆరెస్సెస్ రాజకీయ వ్యూహాల కారణంగా వాటిని బేఖాతరు చేశారు. మరీ ముఖ్యంగా చివరి రోజున మరో భజరంగ్‌దళ్ కార్యకర్త రెచ్చగొట్టే భాషలో దారుణమైన విడియో విడుదల వైరల్ చేశాడు. 'నూహ్ ప్రజానీకం మా రాకను కాచుకోవడానికి సిద్ధంగా వుండాలని' సవాళ్లు విసిరాడు.

హత్యలు విధ్వంసాలు,అరాచకం

ఈ నేపథ్యంలో మొదలైన ప్రదర్శనలో పరివార్ కార్యకర్తలు తీవ్రభాషలో రెచ్చగొట్టడం ఆశ్చర్యమేమీ కాదు.మానేసర్ రాలేదు గాని భజరంగదళ్ నాయకుడైన సుందర్‌జైన్ హాజరయ్యారు. నల్వార్ మహదేవమందిర్‌లో పాల్గొని ఉద్రేకాలు పెంచేలా ప్రసంగించాడు. అంతేగాక వారు తుపాకులు ,ఇతర ఆయుధాలు పట్టుకుని ఉద్రిక్తత పెంచారు. ముందే



రెచ్చిపోయి వున్న ముస్లిం యువత వారిపై రాళ్లు విసిరారు.దాంతో ప్రదర్శకులు తాము బయిలుదేరిన మొదటి గుడి దగ్గరకు వచ్చి దాచుకున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ప్రభుత్వాధినేతలు పరిస్థితిని ఉపశమింపచేయడానికి చర్యలు తీసుకోలేదు. పక్క జిల్లాల నుంచి అదనపు పోలీసులను రప్పించి వారి రక్షణలో మళ్లీ ప్రదర్శకులను ముందుకు సాగేందుకు అనుమతినిచ్చారు. ఆగష్టు 2న ఈ ప్రదర్శకులు వెళ్లి సెక్టార్ 57లో ఒక మసీదుపై దాడిచేశారు. అక్కడ పాతికేళ్ల వయసున్న ఇమామ్‌ను చంపివేసినట్టు సమాచారం. మోటారు సైకిళ్లపై వచ్చిన దుండగులు దాంతోపాటు మరో మసీదుపై పెట్రోలు బాంబులు విసిరేశారు. దాంతో అవతలివారు మళ్లీ ఎదురుదాడి చేశారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పిపోయింది. కర్ఫ్యూతో సహా నిషేదాజ్ఞలు విధించాల్సి వచ్చింది. వాహనాల దహనం, విధ్వంసం అల్లర్లు అరాచకం తాండవించాయి. ఇక జిల్లా యంత్రాంగమైతే అచేతనంగా వుండిపోయింది. నూహ్ సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌పై దుండగులు దాడిచేశారు. ఇద్దరు హోంగార్డులు, నలుగురు సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. గుర్‌గ్రాం, నూహ్, సోహ్నాలలో 70 మందికి పైగా గాయాల పాలయ్యారు. కోటానుకోట్ల రూపాయల విలువైన ఆస్తి సర్వనాశనమైంది. వందలాది మంది ప్రాణాలు అరచేత పట్టుకుని ఇండ్లు వదలి

> ఆగష్టు 2న ఈ ప్రదర్శకులు వెళ్లి సెక్టార్ 57లో ఒక మసీదుపై దాడిచేశారు. అక్కడ పాతికేళ్ల వయసున్న ఇమామ్‌ను చంపివేసినట్టు సమాచారం. మోటారు సైకిళ్లపై వచ్చిన దుండగులు దాంతోపాటు మరో మసీదుపై పెట్రోలు బాంబులు విసిరేశారు. దాంతో అవతలివారు మళ్లీ ఎదురుదాడి చేశారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పిపోయింది. కర్ఫ్యూతో సహా నిషేదాజ్ఞలు విధించాల్సి వచ్చింది. వాహనాల దహనం, విధ్వంసం అల్లర్లు అరాచకం తాండవించాయి.

పోయారు. ఐటి నిపుణులు కూడా హడలెత్తి స్వస్థలాలకు పయనం కట్టారు. ఒక్కసారిగా గుర్‌గ్రామ్ కల్లోలితమై పోయింది. ఇక్కడున్న బహుళజాతి కంపెనీల ప్రతినిధులు విదేశాల నుంచి ఆందోళన సందేశాలు పంపే పరిస్థితి ఏర్పడింది.ఈ స్థాయిలో విధ్వంసం జరిగిందటే దీని వెనక పథకం ప్రకారం జరిగిన కుట్ర వుందని ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టార్ ప్రకటించారు. అదెవరన్నదే ప్రశ్న. నిజానికి ఇలాంటిది జరుగుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నా అలసత్వంతో అందుకు అవకాశమిచ్చిన ఆయన ప్రభుత్వ పాత్ర ఏమిటి? పైగా నిజానికి ప్రభుత్వ వివరణలు ఎక్కువగా హిందూత్వ శక్తులను సంతృప్తిపర్చేందుకు తప్ప బాధిత ముస్లింలకు ఓదార్పుగా లేవు. అల్లర్లు మొదలైనాక కూడా ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌతాలా తమ అనుమతి లేకుండా ప్రదర్శనలు జరిగినట్టు చెప్పుకొచ్చారు. బీజేపీ ఎంపి రావ్ ఇందర్‌సింగ్ మాత్రం ఇటువైపు నుంచికూడా రెచ్చగొట్టే ప్రయత్నం జరిగిందని కొంత వరకూ అంగీకరించారు. మొత్తంపైన పోలీసులు రంగం లోకి దిగి 140 మందిని అరెస్టు చేశారు. వందవరకూ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

సోషల్ మీడియా ఆయుధంగా..

నూహ్ హింసాకాండలో ఆందోళనకలిగించే అంశం సోషల్ మీడియా పాత్రే. దాదాపు 2000 వీడియోలు యూ ట్యూబ్ ద్వారా ప్రసారమై ప్రజలలో భయోత్పాతం మత విద్వేషం పెంచాయి. ఇరుమతాల వైపు నుంచి వున్నా అధిక భాగం విద్వేషాన్ని పెంచే విధంగా భజరంగదళ్ సృష్టించినవే. అవతలివారు దాడి చేసినట్టు అమానుషంగా ప్రాణాలు తీసినట్టు పెద్ద ఎత్తున ప్రచారం సాగింది.నూహ్ జిల్లా పాతపేరు మేవట్. మేవా రూపురేఖలు మార్చేయాలి. ఇది హిందూ హంతకుల కేంద్రంగా వుండొద్దని రెచ్చగొట్టారు. ఇందుకు ప్రతిగా ముస్లిం యువకులు కొందరు కూడా హింసకు పురికొల్పే విడియోలు పోస్టు చేశారు. ఇదంతా వాతావరణాన్ని కలుషితం చేస్తున్నా సామాజిక కార్యకర్తలు హెచ్చరిస్తున్నా అధికార వర్గాలు ప్రేక్షక పాత్ర పోషించాయి జరగాల్సిన ఘోరాలు జరిగిపోయాక ఇప్పుడు సోషల్ మీడియా విడియోలు పరిశీలించేందుకు కమిటీని నియమించారు. వారిలో కొందరిపై కేసులు కూడా పెట్టారు. మరికొందరిపై దర్యాప్తు జరుగుతున్నది. చిన్నాభిన్నమైన అక్కడ ప్రజాజీవితం కోలుకోవడానికి చాలాసమయమే పడుతుండనడంలో సందేహం లేదు. ఎన్నికల కోసం మత విభజన పెంచే రాజకీయాలు మరోసారి ఉధృతమయ్యే ప్రమాదాన్ని ఈ ఘటనలు మరోసారి గుర్తు చేస్తున్నాయి. ■

స్నేహమేరా..!



> మానవాళి విముక్తి కోసం జీవితాలను అర్పించిన మార్క్స్, ఏంగెల్స్‌ల స్నేహం ఇప్పటికీ ఆదర్శవంతమైనది. 'మానవళి చరిత్రలో స్నేహానికి దర్పణం పట్టే అన్ని ఉదాహరణలను అధిగమించే స్నేహితుల ద్వయం, మేథోజోడి, కార్మికవర్గపు శాస్త్రజ్ఞానాన్ని సృష్టించిందని యురోపియన్ కార్మికవర్గం చెప్పుకుంటుంది' అని మార్క్స్, ఏంగెల్స్ స్నేహం గురించి లెనిన్ వ్యాఖ్యానిస్తాడు. వారి స్నేహం ఎంత బలమైనదో, వారు దర్శించిన విప్లవ క్రమం అంత నిర్మాణాత్మకమైనదని వీరి స్నేహం రుజువు చేస్తుంది.

'స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వతం, స్నేహమే నాకున్నదీ, స్నేహమేరా పెన్నిధీ!' అనే పాట మరపురానిది. ఎందుకంటే అది స్నేహబంధాన్ని గురించిన సృజన కాబట్టి. అన్ని సంబంధాల కన్నా స్నేహసంబంధం చాలా గొప్పదని ఎందుకు చెబుతున్నామంటే, అందులో స్వేచ్ఛ వుంటుంది. ప్రజాస్వామికతత్వం ఉంటుంది. పరస్పర గౌరవ భావన వ్యక్తం అవుతుంది. తన సహచరుడు బాగుండాలనే, ఎదగాలనే అభిలాష స్నేహంలో వుంటుంది. అందుకే స్నేహమంటే అందరికీ ఇష్టంగా వుంటుంది. ఒక వ్యక్తి తనను తాను పూర్తిగా తెరచి ఒక్క స్నేహితుడి దగ్గరే పెట్టగలడు. అది బలమైనా, బలహీనతైనా, మంచియైనా చెడైనా నిర్భయంగా స్నేహితుడితోనే పంచుకోగలము కదా! అందుకే స్నేహం అనే భావనకు ఎంతో విలువ ఏర్పడింది. స్నేహంలో ప్రేముంటది, బాధ్యతుంటది, ఇచ్చిపుచ్చుకోవడమూ, సహనము, ఓదార్పు, సమభావన, సమైక్యత అన్నీ కలిసి వుంటాయి. అందుకే 'స్నేహమేరా జీవితానికి వెలుగునిచ్చే వెన్నెల...స్నేహమేరా! బతుకుబాటలో నీడనిచ్చే తోడురా!' అని పాడుకోగలుగుతున్నాము.

ప్రకృతి గమనాన్ని మనం పరిశీలించినట్లయితే ప్రతి జీవీ సహచరత్వ జీవనాన్నే కొనసాగించింది. ఏ జీవీ ఒంటరిగా లేదు. సహచరత్వమనేది జీవలక్షణంగా కాక, బుద్ధి లక్షణంగా ఎదిగింది. మానవ సమూహమే. కానీ ఆస్తి, ఆధిపత్య భావాలతో కుటుంబ వ్యవస్థ ఏర్పడ్డాక, అన్ని సంబంధాలూ ఆ ఒరవడిలోనే కొనసాగుతున్నాయి. అందుకే మనిషి స్నేహమయ జీవితాన్ని కోరుకుంటున్నాడు. ఈ ఆధునిక సమాజంలో అన్ని సంబంధాలూ ఆర్థిక సంబంధాలుగా ఏర్పడ్డాక స్వేచ్ఛకు, మానవీయాంశానికి తావు లేకుండా పోయింది. కానీ మానవ హృదయం, కోల్పోయిన దాని గురించి వెతుకులాట నిరంతరం చేస్తూనే వుంది. అందుకే స్నేహమయ జీవనకాంక్ష ఎల్లప్పుడూ మనందరిలోనూ వుంటుంది. చరిత్రలోనూ గొప్ప స్నేహాలుగా ప్రసిద్ధికెక్కిన ఉదాహరణలూ మనకున్నాయి. కావ్యాలలోనూ, ఇతిహాసాలలోనూ మధురమైన స్నేహ పుటలను తిరిగేయ గలుగుతాము. మిత్రలాభం గురించిన కథలలో స్నేహ ప్రయోజనాలు, మిత్రభేదం వలన కలిగే కష్టాలను గురించీ మన సాహిత్యంలో చెప్పారు. కుటుంబాలలోని అనుబంధాలూ స్నేహంగా ఉన్నప్పుడే వర్థిల్లుతాయి.

సంపాదకీయం

అయితే నేటి సమాజంలో అంత ఉన్నతంగా స్నేహం సాగుతున్నదా! చాలా వరకు లేదనే చెప్పవచ్చు. స్నేహమనే మాటను మనం తేలిక చేసేశాము. కుల, మత ప్రాతిపదికన, ఆర్థిక స్థాయిలను బట్టి, హోదాలను బట్టి ఏర్పడిన స్నేహాలు, నిజమైన స్నేహాలుగా చెప్పుకోలేము. అవి మంచి స్నేహాలుగా నిలువజాలవు కూడా. పరిచయాలు, అవసరాల మేరకు ఏర్పడ్డ మిత్రత్వాన్ని నిజమైన స్నేహంతో పోల్చలేము. రెండు భిన్నమైన, వైరుధ్య పూరితమైన భావాలు గలవారి మధ్య స్నేహం చిగురించడం కష్టమైన పని. భిన్న అభిప్రాయాలు ఉండవచ్చు. కానీ విరుద్ధ దృక్పథాలు స్నేహం చేయలేవు. చేసిన దాఖలాలూ లేవు. చరిత్రలో చూసుకుంటే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల స్నేహం, స్వాతంత్ర్యం కోసం చేసిన సమరంలో సాగిన స్నేహం. ఇక మానవాళి విముక్తి కోసం జీవితాలను అర్పించిన మార్క్స్, ఏంగెల్స్‌ల స్నేహం ఇప్పటికీ ఆదర్శవంతమైనది. 'మానవళి చరిత్రలో స్నేహానికి దర్పణం పట్టే అన్ని ఉదాహరణలను అధిగమించే స్నేహితుల ద్వయం, మేథోజోడి, కార్మికవర్గపు శాస్త్రజ్ఞానాన్ని సృష్టించిందని యురోపియన్ కార్మికవర్గం చెప్పుకుంటుంది' అని మార్క్స్, ఏంగెల్స్ స్నేహం గురించి లెనిన్ వ్యాఖ్యానిస్తాడు. వారి స్నేహం ఎంత బలమైనదో, వారు దర్శించిన విప్లవ క్రమం అంత నిర్మాణాత్మకమైనదని వీరి స్నేహం రుజువు చేస్తుంది. ప్రపంచమానవాళిని మానవీయంగా తయారు చేయడానికి చేసిన కృషిలో వీరి మైత్రి వెలుగొందింది. అదే విధంగా ఒక దేశంలో విప్లవ సాధనలో ఏర్పడిన మైత్రి ఫిడెల్‌కాస్ట్రో, చేగువేరాలది. ఇలా ఆశయాలదారుల్లో పరిమళించిన స్నేహాలు మనకెంతో స్ఫూర్తినీ, చైతన్యాన్ని కలిగిస్తాయి. చిరస్మరణీయంగా నిలుస్తాయి.

వ్యక్తుల మధ్యనే కాదు, దేశాల మధ్య కూడా శత్రుత్వాలు, వైషమ్యాలు తీసివేసి స్నేహభావంతో కలసిమెలసి ఉండాలన్న లక్ష్యమూ ఈ స్నేహ దినోత్సవాన్ని జరుపుకోవటంలో వుంది. ప్రపంచ ప్రజల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడాలనే భావనా ఈ దినోత్సవాల ఆశయంగా కొనసాగుతున్న సందర్భంలో, మనదేశంలో కులాల మధ్య, తెగల పేరుతోని, మతం పేరుతోని మనుషుల మధ్య విద్వేషాలను సృష్టిస్తూ అమానవీయ కృత్యాలకు ప్పాలడటం నిజంగా ఎంతో బాధాకర విషయం. ఎప్పుడూ ఎదుటివానిలో వైషమ్యాన్ని రగిల్చే ఉన్మాద సమూహాల నుండి స్నేహాన్ని, మానవీయతను ఆశించలేము. మిత్రుడైన వాడు ఎదుటివాని తప్పులను సరిదిద్ది మంచి మార్గాన నడిపించాలి. చెడుమార్గాలు, సమాజానికి ఎంత ముప్పును తెచ్చిపెడతాయో స్నేహ హృదయంతో బోధించాలి. స్నేహం చేయాలి. స్నేహానందాన్ని పొందాలి!

మొద్దబ్బాయిలు!

'వదినా! మీ ఇంట్లో ఇంకా పనులు తెమలలేదా'! అంటూ పెరటిగోడ వద్దకు వచ్చి నిలబడింది. శ్రీలక్ష్మి.
'ఇదిగో వదినా! ఇప్పుడే అన్ని ముగించుకుని నీ వద్దకే వద్దామని అనుకుంటున్నా! ఇంతలో నీవే పిలిచావు! వస్తున్నా'! అంటూ మమత కూడా పెరటిగోడ వద్దకు వచ్చింది.

ఇంట్లో జరుగుతున్న విశేషాలు పరస్పరం ఇద్దరూ బదలాయించుకున్నారు.
'ఏంటి వదినా! మీ అన్నయ్య నిన్న మీ పెద్దకొడుకు ఆఫీసుకు వెళ్లాడంట! కాని ఆఫీసులో మీ అబ్బాయి కనిపించలేదంట'! కొంపదీసి సస్పెండ్ అయ్యాడా ఏమిటీ'? అన్నది మమత.


'అయ్యో! నా కొడుకేమయినా కండక్టర్ అనుకున్నావా? సస్పెండ్ కావడానికి! ఆ ఆఫీసుకే నా కొడుకు పెద్దబాస్ తెలుసా?' అన్నది శ్రీలక్ష్మి గొప్పగా.

'అది కాదు వదినా! మొన్నే కాదు. మీ అన్నయ్య చాలాసార్లు, ఆ ఆఫీసుకు వెళ్లాడంట. కాని మీ పెద్దబ్బాయి ఎప్పుడూ కనిపించడం లేదంట! అందుకే సస్పెండ్ అయ్యాడా అని డౌటు వచ్చింది! అందుకే అలా అడిగానమ్మా! అంతే ' అన్నది మమత.

'అయినా! కొత్తదానిలా ఎంక్వైరీ చేస్తున్నావు! నీ కొడుకు పనిచేస్తున్నది. నా కొడుకు ఆఫీసులోనే కదా! నా కొడుకు పని చేసేది మీ ఆఫీసులోనే కదా! నా కొడుకు సస్పెండ్ అయితే నీకు చెపుతాడు కదా! వాడ్ని అడగకపోయావా'? అన్నది శ్రీలక్ష్మి.
'ఏంటి! చాలా సేపటి నుంచి మాట్లాడుకుంటున్నారు? ఏమిటీ విషయం' అంటూ వచ్చింది సరళ.
'ఏముందీ? అంతా షరామామూలే? నీ కొడుకు ఎప్పుడూ ఆఫీసుకు రాడంట? ఎందుకూ ఉద్యోగం నుంచి సస్పెండ్ అయ్యాడా అని అడిగాను! దానికి ఏదేదో మాట్లాడుతున్నది!
ఇది న్యాయమా వదినా? అంటూ ఫిర్యాదు చేసింది మమత.
'నా కొడుకు బాస్ కదా! ఎప్పుడూ టూర్లల్లో దేశదేశాలు తిరుగుతూ ఉంటాడు. అందుకే ఆఫీసుకు రాడు.
అంతమాత్రానే సస్పెండ్ అని పెద్దపెద్ద మాటలు ఎందుకు మాట్లాడాలి!
నీ కొడుకూ అదే ఆఫీసులో పనిచేస్తాడు కదా నీవు చెప్పు' అన్నది శ్రీలక్ష్మి.

'అవును వదినా నీ కొడుకూ, మమత కొడుకూ, నా కొడుకూ, నాకొడుకూ ఒకే ఆఫీసులో పనిచేస్తారు! అది తెలిసిన విషయమే! కాని మమత కొడుకూ ఆఫీసుకు పోవడం లేదు! అందుకే ఆమె ఆ విషయం చెప్పడం లేదు' అన్నది.
'మమత కొడుకు ఎందుకు ఆఫీసు మానేశాడు?'





ఆశ్చర్యంగా అడిగింది శ్రీలక్ష్మి.

'వీళ్ల ఆఫీసుకు నీ కొడుకే బాస్ కదా! అయితే వీళ్ల ఆఫీసులో పనిచేసే అమ్మాయిని, పక్కసీటు వాడు రోజూ సతాయిస్తున్నాడంట!ఆ అమ్మాయిని వీడియో తీసి వాళ్ల ఆఫీసు వాట్సప్ గ్రూపులో పెట్టారంటా! ఫిర్యాదు చేద్దామని చూస్తే, మీ వాడు ఆఫీసుకే రావడం లేదు'! అన్నది సరళ.

'మా వాడు ఆఫీసు పనిమీదే టూర్లు కొడుతుంటాడు కదా! అందుకే ఆఫీసు రావడానికి వీలు కాదు! కాని ఇంతపెదద సమస్య ఆఫీసులో వచ్చినప్పుడు, ఆఫీసుకు వచ్చి ఆ సమస్య పరిష్కరించాల్సిందే! కాని వాడు మొదటి నుంచి అంతే బాధ్యత లేకుండా బలాదూర్‌గా తిరుగుతాడు అంతే'! అన్నది శ్రీలక్ష్మి.

'మావాడు, మీవాడు, సరళ కొడుకు మనలాగే స్నేహితులు! మీ వాడి తర్వాత మా వాడే ఆఫీసుకుఇ బాస్. ఆ తర్వాత సరళ కొడుకు బాస్. అయితే మీ వాడిని ఆఫీసుకు పిలిపించమని రెండు మూడు రోజులు ఆఫీసు వాళ్లంతా వాడిని ఒత్తిడి చేశారంట! దాంతో మీరంతా క్రమశిక్షణ తప్పిపోయారు! ఇట్లా పద్ధతి తప్పి పనిచేస్తున్నందున నేను మీ ఆఫీసుకు రానని, మావాడు కూడా ఆఫీసుకి వెళ్లడం మానివేశాడు' రెండు మూడు రోజుల్నుండి ఇంట్లోనే ఉంటున్నాడు' అన్నది మమత.

'వీళ్లు మంచి ఉద్యోగాలు చేస్తున్నారు అనుకున్నాం గాని, ఇలా తయ్యారేమిటి? బొత్తిగ బాధ్యత లేకుండా ఉన్నారు'!

ఇంతకు నీ కొడుకేం చేస్తున్నాడు? అడిగారు సరళను.

'వాడు కూడా తక్కువేం కాదు! అదే తానులోని ముక్క. నీ కొడుకుని పిలిపించమని, మమత కొడుకూ ఒత్తిడి చేస్తే వాడేమో ఆఫీసు ఎగ్గొట్టాడు. వాడు ఎగ్గొట్టాడని నా కొడుకుని అదే అడిగారంట! బాస్‌ని ఆఫీసుకి పిలిపించు! అని, దానికి అంత బాస్‌ని నేను ఎట్లా పిలిపిస్తాను? ఆయనకు ఆఫీసుకి రమ్మని బాస్‌ను పిలిపించడం లేదు. మీరు, ఆ అమ్మాయి ఏమైనా చేస్కోండి'ష అన్నది సరళ.

'తమ ఆఫీసులో పనిచేసే, అమ్మాయిని పక్క సీటువాడు వేధిస్తూంటే ఆ విషయం తెలిసీ, అధికారం ఉండీ వాడిపై చర్యలు తీసుకోలేని బాసులు మన పుత్రరత్నాలని, చెప్పు కోలేని స్థితిలో పడిపోయాము! సాటి ఆడపిల్లలుగా సిగ్గు పడుతు న్నాము. ఈ ముగ్గురు చిన్నప్పుడు స్కూల్‌కెళ్లకుండా డుమ్మాలు కొడితే మొద్ద బ్బాయిలు అనుకున్నాం! గాని పెద్దయ్యాక మొద్దు దద్దమ్మలు అవుతారని అనుకోలేదు!' అని ముగ్గురమ్మలూ బాధపడ్డారు. ■

- ఉషాకిరణ్

దేశం చచ్చిపోయింది...



ఏదో ఒక భూమి అనుకున్నాను గానీ
దగ్ధభూమిగా నామకరణం
చేసుకున్నట్లుంది !

మానవత్వం కబేళాలలో
మాంసపు ముద్దలుగా
వేలాడుతున్నది
ఆనంద తాండవంలో మూర్ఖులు...
వాళ్ళకు కావలసింది మానాలు
కాదు
ఖనిజాల గనులు

కసి తీర్చుకోవడానికి అంతం చేయడానికి
ఏ ఊరు ఏ కులమైతేం ఏ వర్గమైతేం
ఆమే మన చెల్లెమ్మనే మన అక్కనే
చిత్తు కాగితంలా దగ్ధం చేస్తున్నారు!
నిషాన్ లేకుండా కుట్రలు పన్నుతున్నారు.
..

చదువులు విద్వేషాలై
జెండాలూ బాకులై
మారణహోమాల్ని రగిలిస్తున్నయి
తరతరాల నాగరికతంతా దిగంబర
దగ్ధమే

అత్యాచార హత్యలే !

పంటసాలన్నీ
ముండ్ల కలుపుతో పరుచుకున్నయి
చెరువులన్నీ
మురిక కంపలతో బిక్కు
బిక్కుమంటున్నవి
ఒక బిల్కిస్ బానో ఒక గోద్రానో
ఒక ఒరిస్సానో, ఒక వాకపల్లినో, ఒక
బెంగాల్ నో,
ఒక ఖైర్లాంజినో, ఒక నిర్బయనో, ఒక
మరియమ్మనో,

ఒక మణిపూరో...
అన్నకు చెల్లెలుగా తమ్ముడికి అక్కగా
భర్తకు భార్యగా
అన్నకు వదినగా బావకు అక్కగా
తమ్ముడికి మరదలుగా
అమ్మగా, అమ్మమ్మగా, నాయనమ్మగా
ఎన్నెన్ని రూపాలతో ఎన్ని పేర్లతో
సకలసేవలలో అవని..

ఏ చెట్టు పూయడం లేదు
ఏ గాలీ వీయడం లేదు
ఏ మైక్ మాట్లడటం లేదు
సత్యాన్ని గంపకింద కోడిపిల్లా
కమ్మేస్తున్నారు
అసత్యాన్ని బుల్డోజర్ లా నడిపిస్తున్నారు
కోర్టులే గాదు పార్లమెంటుకు గంతలు
కట్టారు

ఇక వెదవ మాటలు చెప్పకండి!
స్త్రీలు ఎక్కడ పూజింపబడుతారో..
అక్కడే గౌరవమని
లక్ష్మీదేవతలని దేవతా మూర్తులని....
దేశం చచ్చిపోయింది

- వనపట్ల సుబ్బయ్య, 9492765358

ఓ యుద్ధం మిగిల్చిన గాయం-హిరోషిమా

రెండవ ప్రపంచ యుద్ధం గురించి అందరూ వినే ఉంటారు. 30 కంటే ఎక్కువ దేశాలు పాల్గొన్న అతిపెద్ద యుద్ధమిది. పోలాండ్‌పై 1939 నాజీ దండయాత్రతో చెలరేగిన యుద్ధం 1945లో నాజీ జర్మనీ, జపాన్, ఇటలీ అక్ష శక్తులను, మిత్రరాజ్యాలు ఓడించే వరకు ఆరు రక్తపాత సంవత్సరాల పాటు సాగిన సంగ్రామం. చివరకు జపాన్‌పై అమెరికా రెండు అణు బాంబులు వేయడం ద్వారా ఈ యుద్ధం ముగిసింది. ఇది మానవాళి చరిత్రలో మాయని మచ్చగా మిగిలింది. ఈ యుద్ధంలో తీవ్రంగా నష్టపోయింది జపాన్. ప్రజలు వేల సంఖ్యలో మరణించారు. జపాన్ ఆసియాలో తన సామ్రాజ్యాన్ని విస్తరిం చడం అమెరికా సహించలేక పోయింది. తనకంటే ఎక్కువ శక్తిగల దేశంగా జపాన్ బలపడిపోతుందేమోనన్న ఆందోళన, భయం అమెరికాకు ఉంది. జపాన్‌తో ప్రత్యక్షంగా యుద్ధం చేయాలని లోపల కోరికున్నప్పటికీ అప్పటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ యునైటెడ్ స్టేట్స్ మరొక దేశంతో యుద్ధం తనంతట తానుగా ప్రారంభించదని తన దేశాల ప్రజలకు వాగ్దానం చేశాడు. జపానే తనంతట తానుగా అమెరికాపై దాడిచేస్తే, తప్పనిసరి పరిస్థితుల్లో జపానుపై సమరం చేయవలసి వచ్చిందని తన ప్రజలకు నమ్మించగలమనే ఒక దురాలోచనతో మంచి సమయం కోసం ఎదురు చూశాడు. అప్పట్లో జపాన్ తన చమురు అవ సరాలకు ఎక్కువగా అమెరికాపై ఆధారపడింది. దీనిని రూజ్‌వెల్ట్ తనకి అనుకూలంగా మార్చుకున్నాడు. జపాన్‌పై చమురు నిషేధాన్ని విధించాడు.



చమురు నిషేధంపై జపాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వారు దీనిని యుద్ధ చర్యగా భావించారు. వారు 7 డిసెంబర్ 1941న పెర్ల్ నౌకా శ్రయంపై ఆకస్మికదాడిని ప్రారంభించడం ద్వారా ప్రతిస్పందిం చారు. ఈ దాడి యునైటెడ్ స్టేట్స్‌ను రెండవ ప్రపంచ యుద్ధంలోకి తీసుకువచ్చింది.1945లో జపాన్‌ను ఎలాగైనా ఓడించాలని యుద్ధంలో భాగంగా అమెరికా జపాన్‌పై అణు బాంబులను ప్రయోగించింది. లిటిల్‌బాయ్‌గా పేరు పెట్టబడిన మొదటి అణుబాంబును6 ఆగస్ట్ 1945లో హిరోషిమాపై పడేసింది. అప్పటి నుండి ఈ తేదీని హిరోషిమా దినంగా పిలుస్తున్నారు. అణు పరమాణు శక్తులను మానవాళి శాంతి సంక్షే మాలకు మాత్రమే వాడాలని, విధ్వంసం కోసం దుర్వినియోగం చేయవద్దంటూ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఈ రోజున హిరోషిమా నరగంలోని 'శాంతి వనం'లో ప్రధాన కార్యక్ర మం నిర్వహిస్తారు. నాటి ఆటమ్ బాంబు దెబ్బకు నేటికీ కోలుకోని జపనీయులు శాంతియుత మార్గాల్లో అభివద్ధి దిశగా పయనించడం, అగ్రరాజ్యంగా నిలవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇటువంటి అణుయుద్ధాలు జరగకుండా ప్రపంచదేశాలన్నీ ఒక ఒడంబడికకు రావాలి. ఐక్య రాజ్య సమితి దేశాల్లో ఉన్న వైర్యాన్ని తగ్గించేందుకు శాంతిని ప్రబోధించాలి. సమస్యలుంటే పరస్పర అవగాహనతో సంప్రదింపులు చేసి పరిష్కరించుకోవాలి. ఎందు కంటే జపాన్‌లో జరిగిన ప్రాణనష్టం ఎప్పటికీ పూడ్చలేనిది. అమెరికా విషకౌగిలిలో బంధీ కావడానికి ఉవ్విళ్లూరు తున్న భారత్‌కు ఈ విషయం తెలిసి రావాలి.పరిస్థితులను అంచనా వేస్తూ సొంతంగా నిలబడాలి. దేశాన్ని అభివృద్ధి చేయాలి. సామ్రాజ్యవాద దేశాలతో దోస్తీ ప్రజాస్వామ్యదేశమైనా భారత్‌కు మంచిది కాదనే విషయం ఆలోచించాలి. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలో మరణించిన పౌరులకు నివాళి. (06 ఆగష్టు 'హిరోషిమా దినం')

- డిజె. మోహన రావు, 9440485824

www.praja.khammam@gmail.com
నవతెలంగాణ



శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్

విద్యార్థులకు నాసా బహుమతుల వితరణ

నవ తెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

నేటి విద్యార్థుల మారుతున్న పోటీ ప్రపంచానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు. స్థానిక మమత ఆసుపత్రి రోడ్ నందుగల శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ పాఠశాలలో నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థులకు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ చేతుల మీదగా నాసా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. కేవలం పుస్తక పఠనానికే అలవాటు కాకుండా నేటి కంప్యూటర్ యుగంలో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య మాట్లాడుతూ.. గత సంవత్సరం తమ విద్యార్థులు నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్లో ప్రపంచస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారన్నారు.ఈ సంవత్సరం కూడా విద్యార్థులు మంచి ప్రదర్శనలు తయారు చేసి ప్రపంచస్థాయి ముందంజలో నిలవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డిజియం సిహెచ్.చేతన్ మాధుర్, ఆర్ఐ.జయప్రకాశ్, శ్రీచైతన్య ఒలంపియాడ్ ప్రిన్సిపాల్స్ టిఎన్ఎన్. శర్మ, రాజ్కుమార్ జోషి, ఏడుకొండలు, కోఆర్డినేటర్ కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణా రెడ్డి, సురేష్, డిన్స్ కె.వి.ఆర్, రాజశేఖర్ రెడ్డి, నవీన్, లక్ష్మీ నరసింహరావు, నాసా ప్రోగ్రాం ఇంచార్జ్ సుధాకర్ రెడ్డి, జగదీష్, రమేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ యునాని వైద్యాధికారి డా. శంకర్

నవతెలంగాణ-ఖమ్మం



ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ యునాని వైద్యాధికారి డా. శంకర్ అన్నారు. స్థానిక స్తంభానినగర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులు జ్వరం, దగ్గు, జలుబుకు యునాని వైద్యంతో మంచి ఫలితాలు వస్తాయని ఆయన తెలిపారు. శనివారం చేపట్టిన వైద్య శిబిరంలో 230 మంది చికిత్స పొందినట్లు వైద్యాధికారి అన్నారు.

మధిర శ్రీ చైతన్యలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం

నవతెలంగాణ-మధిర



మధిర పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ నందు స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులు హరితభారత్ అనే అంశం మీద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు కాలానుగుణంగా పెరిగే మొక్కలను మానవ జీవనానికి అవసరమైనటువంటి మొక్కలను స్కూలు ఆవరణలో నాటారు. హరిత భారత్ అనే అంశం మీద వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ వంటి వివిధ కేటగిరీలలో విద్యార్థులకు పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆకెళ్ళ భారతి మాట్లాడుతూ విద్యార్థులను స్కూల్ దశనించే ఉత్తమ పౌరులుగా సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఉద్దేశంతో శ్రీ చైతన్య కర్కులంలో హరితభారత్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంని పొందుపరచటం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో డీజిఎం చేతన్ ఆర్ఐ జయప్రకాష్ జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు, డీన్ నరేష్, సి బ్యాచ్ ఇంచార్జ్ కోట తిరుపతిరావు, స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ఇంచార్జ్ బివి రత్నం, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



పిల్లలకి తల్లిదండ్రులు మంచి జీవితాన్ని అందించాలి

- సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

నవతెలంగాణ-సత్తుపల్లి

పిల్లలకి తల్లిదండ్రులు మంచి జీవితాన్ని అందించాలని, జన్మనివ్వడం ఎంత ముఖ్యమో వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడం అంతే ముఖ్యమని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి అన్నారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్, మండల న్యాయసేవా అధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక స్త్రీశక్తి భవన్‌లో శనివారం జరిగిన చట్టాలు- మన హక్కులు, వినియోగదారుల హక్కు-హ్యూమన్ రైట్స్ అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో అరుణకుమారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపకులు బొడ్డపాటి దాసు, ఏపీ హైకోర్టు న్యాయవాది, ఫౌండేషన్ బాధ్యులు అయ్యప్ప అరుణాచల్ సమాచార, వినియోగదారుల చట్టాలు, పర్యావరణ పరిరక్షణ, అనుమతి యాప్‌లు, పోక్సో, బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన, గృహహింస, మహిళా చట్టాలను వివరించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాలపాటి శ్రీనివాసరావు, బొర్ర వెంకట్రావు, న్యాయవాది వెంకటేశ్వరరావు, ఏపీఎం సుబ్బారావు, ఫౌండేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇనుముల రుక్మిణి, మంచు కిరణ్, జిల్లా బాధ్యులు పామర్తి మంగయ్య, ఏపీ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, గ్రామ దీపికులు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప అరుణాచల్‌కు బెస్ట్ ఆక్టివిస్ట్ అవార్డు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ బాధ్యులు బరిగే అయ్యప్ప అరుణాచల్‌కు బెస్ట్ ఆర్టీఐ యాక్ట్, కంస్యూమర్ యాక్టివిస్ట్ అవార్డును హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ద్వారా సీనియర్ సివిల్ జడ్జి పి.అరుణకుమారి చేతుల మీదుగా అందించారు.

12న జరిగే నిరసనల్లో పాల్గొనండి : యూటీఎఫ్

నవతెలంగాణ-మధిర

ఉపాధ్యాయుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై ఈనెల 12న జిల్లా కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ తెలిపారు. మధిరలో జరుగుతున్న గణిత శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా శిక్షణా కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాల ప్రక్రియ నిర్వహణకై అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, అప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఇప్పటికే మండల కేంద్రాల్లో గత నెల 19వ తేదీన బైక్ ర్యాలీ నిర్వహించామని, ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని అత్యధిక సంఖ్యలో ఈ నిరసనల్లో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు షేక్ ఇబ్రహీం, రాణి, వి కొండలరావు, బి చెన్నయ్య, ఎం రాజు, ఎస్ కృష్ణాంజనేయులు, జె.సత్యనారాయణ, కె.సునిత, సిహెచ్ రాణి, టి.స్వాతి, ఎస్.కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

మండవ కృష్ణారావు మూడో వర్ధంతి

నవతెలంగాణ- మధిర



మధిర పట్టణంలో సీపీఐ(ఎం) నాయకులు మండవ కృష్ణారావు మూడో వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి మండవ ఫణీంద్ర కుమారి, జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, పడకండి మురళి, రాధాకృష్ణ మందా సైదులు, మద్దాల ప్రభాకర్, ఒట్ల శంకర్రావు పాల్గొన్నారు

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడపట్ల సుదర్శన్, గాలి అంజయ్య డిమాండ్ చేశారు. కాకరవాయి గ్రామంలో కొత్త వెంకన్న గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల సందర్భంగా గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. అనంతరం జూపెడ గ్రామానికి చెందిన కోలా నారాయణ తాటి చెట్టుపై నుండి పడి గాయాలపాలైనాడని విషయం తెలుసుకొని కల్లు గీత కార్పొరేషన్ నుండి వచ్చిన 15వేల రూపాయలు చెక్కును బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బోడపట్ల సతీష్, కొత్త వెంకన్న గౌడ్, నాయకులు అండెం లింగయ్య, చవగాని సుధాకర్, మెంచు మహేష్, కొత్త కనకమ్మ, శిరీష, సురిగి వెంకన్న, కోలా ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత, ప్రజాసేవకు మరోపేరు బోడేపూడి

నవతెలంగాణ-వైరాటౌన్



ఖమ్మంనగరంలోని సీపీఐ(ఎం) ఖానాపురం హవేలీ కమిటీ ఆధ్వర్యంలో

రాజకీయ విలువలు, నిబద్ధత, ప్రజా సేవకు మరోపేరు బోడేపూడి వెంకటేశ్వరరావు అని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. శనివారం గండగలపాడు గ్రామంలో అమరజీవి బోడేపూడి వెంకటేశ్వరరావు 26వ వర్ధంతిని బోడేపూడి స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. బోడేపూడి చిత్రపటానికి ఇమ్మడి వీరభద్రం పూలమాలలు వేసి నివాళు లర్పించారు, పార్టీ జెండాను సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు మల్లెంపాటి వీరభద్రం ఆవిష్కరించారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శి గుమ్మా నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో బొంతు రాంబాబు, మల్లెంపాటి వీరభద్రం మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మల్లెంపాటి రామారావు, సీనియర్ నాయకులు సంక్రాంతి కష్టమూర్తి, సత్యనారాయణ, దేవబత్తిని నరిసింహరావు, మల్లెంపాటి ప్రసాదరావు, కిన్నెర మోతి, గోడ్ల లక్ష్మయ్య, పల్లెబోయిన కృష్ణ, పుచ్చకాయల రామయ్య, చిత్తారు మురళి, సామినేని గోవిందరావు, మహేష్, జ్యోతి, శకుంతల, విజయలక్ష్మి, తిరుపతిరావు పాల్గొన్నారు.

వైరాటౌన్ : అమరజీవి బోడేపూడి 26వ వర్ధంతి సందర్భంగా వైరా మండలం లక్ష్మీపురం గ్రామంలో బోడేపూడి వెంకటేశ్వరరావు స్థూపం వద్ద పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు షేక్ ఖాజా ఎగురవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయ కులు అడుసుమల్లి నాగేశ్వరరావు, పురుషోత్తం, కోడూరు సత్యనారాయణ, దరిపల్లి శ్రీనివాసరావు, ముత్తయ్య, వెంకటేశ్వరరావు, ఎల్లయ్య, నరసరావు పాల్గొన్నారు.

బోనకల్: రైతుల, వ్యవసాయ కూలీల పక్షపాతిగా మధిర మాజీ ఎమ్మెల్యే సిపిఎం శాసనసభ పక్ష మాజీ నాయకులు బోడేపూడి వెంకటేశ్వరరావు అని సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు కొనియాడారు. మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో బోడెపుడి వెంకటేశ్వరరావు 26వ వర్ధంతి వేడుకలను సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోడెపుడి వెంకటేశ్వరరావు చిత్రపటానికి దొండపాటి నాగేశ్వరరావు సిపిఎం సీనియర్ నాయకులు గుగులోతు పంతు, కొంగర గోపి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పిల్లలమర్రి వెంకట అప్పారావు, గుగులోతు నరేష్, సిపిఎం నాయకులు మచ్చ గురవయ్య, కొమ్మినేని పిచ్చయ్య రైతు సంఘం నాయకులు జోనిబోయిన గురవయ్య, కెవిపిఎస్ మండల నాయకులు ఏసుపోగు బాబు, బానోతు స్వామి పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : ఎర్రుపాలెంలోని రామిశెట్టి పుల్లయ్య భవనం నందు బోడేపూడి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, సగుర్తి సంజీవరావు, గామాసు జోగయ్య, దూదిగం బసవయ్య, శ్యామలరావు, ఆకుల రవి, దూదిగం శ్రీను, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం: నగరంలోని సీపీఐ(ఎం) ఖానాపురం హవేలీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బోడేపుడి వెంకటేశ్వరరావు 26వ వర్ధంతి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, జిల్లా సెక్టార్ సభ్యురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ బోడేపుడి వెంకటేశ్వరరావు ప్రజా ఉద్యమ నాయకుడిగా మధిర ఎమ్మెల్యేగా పనిచేశారని, తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేశాడని, సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి ప్రజా సమస్యల పరిష్కరించే నాయకుడిగా, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పని చేశాడని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పి.వెంకటి, టి.నాగరాజు, రమాదేవి, సత్తెనపల్లి శ్రీను, అమరావతి, పవన్, జే.ఆనంద్‌రావు, సీనియర్ నాయకులు వి.మల్లికార్జునరావు, ధనియాకుల నాగేశ్వరరావు, పెద్ది నాగయ్య పాల్గొన్నారు.

కొణిజర్ల: మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో బోడేపూడి వెంకటేశ్వరరావు 26 వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ, సీనియర్ నాయకులు కొప్పుల క్రిష్ణయ్య, సీఐటీయూ మండల కన్వీనర్ మోత్కూరి వెంకటేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఐద్వా నాయకులు విజయ, వెంకయ్య, కొలిపాక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధిర : మధిర సీపీఐ(ఎం) కార్యాలయంలో బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు మండవ ఫణీంద్ర కుమారి మందా సైదులు, నాయకులు పడకండి మురళి, మద్దాల ప్రభాకర్ తేలప్రోలు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో కునారిల్లుతున్న సంక్షేమ వసతి గృహాలు

ఎనిమిది నెలలుగా డైట్ బిల్లు లేక వార్డెన్ల అవస్థలు

కేవీపీఎస్ సర్వేలో వెల్లడైన హాస్టల్లో దుస్థితి

నవతెలంగాణ- ఖమ్మం



సమస్యలతో సహవాసం చేస్తూ సంక్షేమ వసతి గృహాలు కునారిల్లుతున్నాయని, గత ఎనిమిది నెలలుగా డైట్ బిల్లులు రాకపోవడంతో వార్డెన్లు అప్పులు తెచ్చి హాస్టళ్లను నడుపుతున్నారని, చాలీచాలని మెస్‌చార్జిలతో విద్యార్థులు అలమటిస్తున్నారని, దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో దోమలకు కేరాఫ్ అడ్డాగా వసతి నిలయాలు ఉన్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ ప్రభుత్వాన్ని అన్నారు. శుక్ర, శనివారాల్లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్ఎస్పి క్యాంపులోని ప్రీ మెట్రిక్ బాల, బాలికల వసతి గృహాలను, ఆనంద నిలయాలను కెవిపిఎస్ జిల్లా ప్రతినిధి బృందం స్వయంగా వెళ్లి విద్యార్థులను, అధికారులను ప్రత్యక్షంగా కలిసి సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో వచ్చిన సమస్యలపై మనోహర్ మాట్లాడుతూ స్థానిక జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్పి క్యాంపులో ఎస్సీ బీ హాస్టల్, పురాతన ప్రహరీ గోడ కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్న నేటికీ గోడ నిర్మాణం చేపట్టడంతో పందులు, కుక్కలు, విషపురుగులు వస్తున్నాయని, దీంతో భయభ్రాంతులకు గురవుతున్నామని, మా సర్వే వద్ద విద్యార్థులు వాపోయారని, తక్షణమే ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని అధికారులను డిమాండ్ చేశారు. దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుత వర్షాకాల సీజన్ కాలంలో విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, తక్షణమే ప్రతి హాస్టళ్లకు దోమల జాలీలు పెట్టాలని, దోమతెరలు, జెట్ కాయిల్స్ ఇవ్వాలని, పరిసరాల శుభ్రతకు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా మొత్తం హాస్టల్లో సర్వే చేసి వచ్చిన సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు బొట్ల సాగర్ నగరికంటి చిరంజీవి, పట్టణ నాయకులు గుమ్మడి బిక్షం, జర్రిపోతుల కిరణ్, గొర్రెముచ్చు శాంతయ్య, భద్రం పాల్గొన్నారు.

అజ్మీర ఫకీర్‌కు నివాళి

నవతెలంగాణ - ఎర్రుపాలెం



పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కడవరకు కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా అజ్మీర ఫకీర్ కొనసాగారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య అన్నారు. గత కొద్ది రోజుల క్రితం పార్టీ సీనియర్ నాయకుడు అజ్మీర్ ఫకీర్ మృతి చెందిన వార్త విదితమే శనివారం ఎర్రుపాలెం మండల పరిధిలోని జమలాపురం గ్రామంలో గల తన నివాసం వద్ద దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొని అజ్మీర ఫకీర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గామాసు జోగయ్య, సగ్గుర్తి సంజీవరావు, ఆంగోతు వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పిటిసి అంకశాల శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ వాసిరెడ్డి దుర్గాప్రసాద్, రామ్‌శెట్టి విజయ్ పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి : సీఐటీయూ

నవ తెలంగాణ-మధిర

ఆశా వర్కర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో దెందుకూరు మరియు మాటూరు పీహెచ్సీలో మెడికల్ ఆఫీసర్లకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నరసింహారావు మాట్లాడుతూ ఆశా కార్మికులు గత 32 సంవత్సరాల నుండి గిరిజన ప్రాంతాలలో 18 సంవత్సరాల నుండి మైదాన ప్రాంతాల్లో పనిచేస్తున్నారని, అంతేకాకుండా గ్రామాలలో అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చే మందులను ప్రజలకు అందించడంలో ఆశా వర్కర్ల కీలక పాత్ర పోషిస్తున్నారు అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పడకంటి మురళి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తెలపాలు రాధాకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, సిఐటియు నాయకులు వడ్రనపు మధు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టడానికే ఏకరూప పౌరస్మృతి

ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్

నవతెలంగాణ- ఖమ్మం



దేశంలోని విభిన్న మతాల, సంస్కృతుల, జాతుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, సామరస్యాన్ని దెబ్బ తీసి రాజకీయంగా లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే బిజెపి ఏకరూప పౌరస్మృతి ఎజెండాను ముందుకు తీసుకొస్తున్నదని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ విమర్శించారు. శనివారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో ఆవాజ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "ఏకరూప పౌరస్మృతి ఎవరి కోసం?" అనే అంశంపై ఆవాజ్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ గౌస్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజాసమస్యలను పరిష్కారం చేయడంలో ఘోరంగా విఫలమయ్యిందని, సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికే భావోద్వేగ సమస్యలను ముందుకు తెచ్చిందని, మతాల, జాతుల మధ్య విద్వేషం రెచ్చగొట్టి బిజెపి మణిపూర్‌ను తగలబడుతోందని అన్నారు. మహిళలను ఉద్ధరించడానికి ఏకరూప పౌరస్మృతి తీసుకొస్తామని, చెబుతున్న బిజెపి మణిపూర్ మహిళలను వివస్త్రలను చేసి ఊరేగిస్తూ మరోవైపు మహిళలను ఉద్ధరిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విభిన్న సంస్కృతులను, జీవన వైవిధ్యాలను ధ్వంసం చేసి, మనువాదాన్ని దేశంపై రుద్దడానికి బిజెపి కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. వివిధ మత, జాతి సమూహాలలో ఉన్న ప్రత్యేక పౌర స్మృతులలో ఉన్న అసమానతలను ఆ సమూహాలను చైతన్యం చేయడం ద్వారా తొలగించాలని, బలవంతంగా రుద్దే ప్రయత్నం మానుకోవాలని హితవు పలికారు. ఉమ్మడి పౌరస్మృతి పై 21వ లా కమిషన్ సిఫార్సులను పార్లమెంటులో చర్చించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల నుండి వస్తున్న వ్యతిరేకతను గమనించి వారిని ఏకరూప పౌరస్మృతి నుండి మినహాయింపు ఇస్తున్నట్లు రహస్య మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోందని, ఇది అత్యంత అవకాశవాదం అన్నారు. బిజెపి మతోన్మాద రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మైనారిటీలు బిజెపి విద్వేష ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, ప్రజలలో చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజకీయ విశ్లేషకుడు ఐవి రమణరావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు యర్రా శ్రీకాంత్, సిపిఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా నాయకులు జితేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు కొండబాల కరుణాకర్, బిఆర్ఎస్ నాయకులు షైక్ ముక్తార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చోటే బాబా, మైనారిటీ జేఏసీ నాయకులు రెహమాన్, యూనిటీ ఆఫ్ మాల నాయకులు కానక రాజు, బిసి నాయకులు ప్రసాద్, ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవులు బండి నారాయణ, ధనమ్మ

9వ వర్ధంతి సభలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు చాగంటి నారాయణ

నవతెలంగాణ- ముదిగొండ

పేదల సమస్యలపై ఎర్రజెండా నీడలో నిరంతరం ఉద్యమించే సమస్యలు పరిష్కారానికి కృషి చేసి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు అండగా నిలిచిన బండి నారాయణ, ధనమ్మల జీవితం ధన్యమైనదని ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు చాగంటి నారాయణ అన్నారు.మండల పరిధిలో చిరుమర్రిలో సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు తొలితరం కమ్యూనిస్టు యోధులు,అమరులు బండి నారాయణ, ధనమ్మల 9వ వర్ధంతి సభ పార్టీ గ్రామశాఖ కార్యదర్శి సామినేని రామారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బండి నారాయణ, ధనమ్మలు ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచి ఎనలేని సేవలందించారన్నారు. బండి నారాయణ ఆశయా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ మాట్లాడుతూ దేశంలో ప్రజలకు రక్షణ లేదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి 9 ఏళ్లలో ప్రజా సంక్షేమ నిస్మరించి పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందని విమర్శించారు. మహిళలపై దాడులు అత్యాచారాలు, హత్యాకాండలు పెరిగాయన్నారు. మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన దమనకాండకు కేంద్ర ప్రభుత్వాన్ని బాధ్యతన్నారు. బండి నారాయణ, ధనమ్మ లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం బండి నారాయణ ధనమ్మల చిత్రపటాలకు పుష్పగుచ్చాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు బండి పద్మ, మండల నాయకులు కోలేటి ఉపేందర్, సీనియర్ నాయకులు ఉన్నం కోటేశ్వరరావు, వల్లపాటి భద్రయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కోలేటి అరుణ, గ్రామశాఖ కార్యదర్శిలు కత్రం గురవయ్య, ఇనుప ఉపేందర్, గ్రామ మాజీ సర్పంచ్ ఇనుప బాబు, గ్రామ నాయకులు సామినేని రాంబాబు, బండి శేఖర్, బండి శ్రీనివాసరావు, చావగాని మాధవరావు, బండి నారాయణ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని రావినూతలలోని 116, 117, 118, 119 పోలింగ్ కేంద్రాలను ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్ జి.మధుసూదన్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో పరిస్థితులను ఆయన పూర్తిగా పరిశీలించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పన కోసం అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అధికారులు పోలింగ్ కేంద్రాలలో ఉన్న పరిస్థితులను స్వయంగా పరిశీలించి అందుకు అవసరమైన నివేదికలను జిల్లా కేంద్రానికి పంపించాలని ఆయన మండల అధికారులను కోరారు. ఎన్నికల నిర్వహణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అధికారులు ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయన వెంట మండల తహశీల్దార్ పున్నం చందర్, మండల విద్యాశాఖ అధికారిని మలినీడి ఇందిరా జ్యోతి, గిర్దావర్లు గుగులోతు లక్ష్మణ్, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు అవినీతి ప్రభుత్వానికి చెంప పెట్టు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం



ఆల్ ఇండియా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీపై సూరత్ కోర్టు విధించిన తీర్పుపై సుప్రీం కోర్టు స్టే విధించిడం బిజెపి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి, బాణాసంచా కాల్చారు.కార్యక్రమంలో పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, నగర కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర ఓబీసీ నాయకులు వడ్డెబోయిన నరసింహారావు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మహిళా కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జ్ అమర్జ హన్ బేగ్, కార్పొరేటర్లు లకావత్ సైదులు నాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, రఫీదాబేగం, నాయకులు చోటాబాబా, మిక్కిలినేని నరేందర్, పల్లెబోయిన భారతి చంద్రం, కోప్పెర ఉపేందర్ పాల్గొన్నారు.

కోర్టు తీర్పు బిజెపి ప్రభుత్వానికి చెంపపెట్టు

ఎర్రుపాలెం : ఏఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ అనర్హత పై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును నిలిపి వేస్తూ సుప్రీం కో ర్టు ఇచ్చిన తీర్పు కేంద్రం లో ఉన్న అధికార పార్టీ బిజెపి ప్రభుత్వానికి చెంప పెట్టు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి విమర్శించారు,మం డల కేంద్ర మైన ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు టపాసులు కాల్చి స్వీట్ పంపిణీ చేసి హర్షాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమంలో బండారు నరసింహారావు, శీలం ప్రతాపరెడ్డి, కడియం శ్రీనివాసరావు, ఇస్మాయిల్, మల్లెల లక్ష్మణరావు, వెంకటరామిరెడ్డి, బుర్ర నారా యణ, జంగా ప్రసాద్ రెడ్డి, రాహుల్ గాంధీ, వెంకట నరసయ్య, బాబురావు, అనిల్ కుమార్, జానకి శివ, తిరుపాల శెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ క్లైములు చెల్లించాలని వినతి

నవతెలంగాణ- ఖమ్మం



బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ (డీసీఎల్)ని కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏఐటియుసి గాదె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెండింగ్ క్లైములు, గత రెండు మూడు సంవత్సరాలుగా ఆగి ఉన్న వాటిని వెంటనే క్లియర్ చేయాలని, అలాగే భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిల్ ఇవ్వాలని, 55 సంవత్సరాల నిండిన కార్మికులకు నెలకు 5 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన డీసీఎల్ 15 రోజుల్లో పెండింగ్ క్లైములన్నీ క్లియర్ చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. తంబు విధానాన్ని కూడా తీసివేయాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బోయినపల్లి వీరబాబు, సిఐటియు నాయకులు ఎస్కే చానా తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు తల్లిపాలే ఆరోగ్యకరం

నవతెలంగాణ - బోనకల్



తూటికుంట్ల గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్స వాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగనవాడీ కేంద్రాలు పిల్లలకు ఆరోగ్య కేంద్రాలుగా ఉండాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు, పసిపిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందించాలని కోరారు. అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమణ, అంగన్వాడీ కార్యకర్తలు రాణి, అంగనవాడీ ఆయా రేణుక మహిళలు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్ : తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని అంగన్వాడీ సూపర్ వైజర్ షాకీరా బేగం అన్నారు. మండలంలోని వెంకట గిరి పంచాయతీ పరిధిలోని కోట నారాయణపురం గ్రామంలో శనివారం చిన్నారులకు విద్యాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మణెమ్మ, ఆశా వర్కర్ సైదమ్మ, అంగన్వాడీ ఆయా ఉమా, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎరమల రేణుక తల్లులకు సూచించారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని ఒకటవ సెక్టార్ పరిధిలో గల బుచ్చిరెడ్డిపాలెం ఎర్రుపాలెం రెండవ సెక్టార్‌లో గల రామన్నపాలెం గ్రామాలలో గల అంగన్వాడీ సెంటర్ నందు ఆగస్ట్1 నుంచి 7వతేది వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల కార్య క్రమంలో భాగంగా గర్భిణిలకు, బాలింతలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాలెం అంగన్వాడి సెంటర్ నందు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల ర్యాలీని గ్రామాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ విద్యాసాగర్, సొసైటీ అధ్యక్షులు మదన్మోహన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పొట్ట పెంజర నరసింహారావు, సూపర్వైజర్ రమణ, గ్రామ పంచాయతీ సెక్రటరీ వెంకటలక్ష్మి, ఏఎన్ఎం రేణుక, ఇందిరా, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

కల్లూరు : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసిడిఎస్ సిడిపిఓ కృష్ణకుమారి అన్నారు. మండల పరిధిలోని చంద్రుపట్ల అంగన్వాడి కేంద్రంలో చంద్రుపట్ల సెక్టార్ సూపర్వైజర్ జొన్నలగడ్డ సుజాత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో సిడిపిఓ కృష్ణకుమారి పాల్గొని ప్రసంగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి గర్భిణీ, బాలింతల గృహాలను సందర్శించారు. గర్భిణీగా గుర్తించిన దగ్గరనుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఝాన్సీ, లక్ష్మి, కమల తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులు వర్సెస్ పోడుసాగుదారులు

నవతెలంగాణ-కొణిజర్ల

ఎల్లన్న నగర్ గ్రామంలో ఫారెస్ట్ అధికారులకు, పోడుసాగుదారుల మధ్య స్వల్ప వివాదం నెలకొంది. ఇందుకు సంబంధించిన వివరాలు...గుబ్బగుర్తి అటవీ రెంజ్ పరిధిలోని ఎల్లన్న నగర్ గ్రామ సమీపంలో ఫారెస్టు అధికారులు శనివారం జెసిబిలతో ట్రెంచ్ కొట్టేందుకు వెళ్లారు. దీంతో తమ భూముల్లో ట్రెంచ్ కొట్టడానికి వీల్లేదంటూ స్థానికంగా ఉండే పోడుసాగుదారులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఫారెస్ట్ అధికారులకు పోడుసాగుదారులకు మధ్య వివాదం చెలరేగడంతో తోపులాట జరిగినట్లు సమాచారం.

తహశీల్దార్ రవికుమార్‌కు అభినందనలు

నవతెలంగాణ- తల్లాడ

తల్లాడ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వి.రవికుమార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అభినందనలు తెలిపిన వారిలో గిర్దవర్ రాధిక, బిఆర్ఎస్ నాయకులు ధూపాటి భద్రరాజు, బిజెపి మండల అధ్యక్షుడు ఆపద వెంకట రామారావు తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించండి : సీఐటీయు

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్



గత 30 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పెరుమళ్ళపల్లి మోహన్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జలగంనగర్ వద్ద గల సమ్మె శిబిరాన్ని శనివారం మోహన్‌రావు సందర్శించి మాట్లాడారు. కార్మికుల సమస్యల పట్ల కెసిఆర్ మొండివైఖరి విడనాడాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలను, ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు కోర్ని నాగరాజు, నరేందర్ రెడ్డి, లాలయ్య, ధర్మేందర్, రాములు, రామయ్య, రాంబాబు, అనురాధ, జయమ్మ, అనసూయ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యరంగాన్ని ప్రభుత్వం బలోపేతం చేయాలి

డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్
కార్యదక్షుడు బోడేపూడి
సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ- ఖమ్మం



రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించి ప్రజలు నమ్మేవిధంగా తీర్చిదిద్దాలని ప్రముఖ డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ కోరారు. శనివారం ఖమ్మంలోని బివికే, సీపీఐ(ఎం) టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో నెల నెలా మెడికల్ క్యాంపులో భాగంగా మంచికంటిహాల్‌లో తెలంగాణ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ మాట్లాడారు. భారతదేశంలో ఆరోగ్యం రంగంపై నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది అని విమర్శించారు. ప్రతి సంవత్సరం దేశ ప్రజల ఆరోగ్యం కోసం తగిన నిధులు మంజూరు చేయడం లేదని విమర్శించారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో ప్రధమ ప్రాధాన్యత ఆరోగ్య రంగాన్ని ఎంపిక చేస్తారని, కానీ భారతదేశంలో ప్రజల ఆరోగ్యంపై శీతకన్ను వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూడా నిమ్స్ వంటి ఆసుపత్రులను జిల్లాకు ఒకటి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని చికిత్స సౌకర్యాలు కల్పిస్తే ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు వేగుచుక్కలాగా బోడేపూడి వెంకటేశ్వరరావు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించారని కొనియాడారు. అసెంబ్లీలో రాష్ట్ర సమస్యలపై నిరంతరం పోరాటాలను గుర్తు చేశారు. ప్రధానంగా రైతు సమస్యలపై నిరంతరం ఆందోళనలు బోడేపూడి వెంకటేశ్వరరావు చేశారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ధైర్యంగా నాయకత్వం వహించారని తెలిపారు. జీవితం అంతా ప్రజలకు సేవ చేశారని, ఆయన స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు భవిష్యత్ లో నిర్వహణ చేస్తామని చెప్పారు. అనంతరం 500 మంది పేషెంట్లకు టెస్టులు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు యాలముడి మనోజ్, సి.భారవి, రావిళ్ళ రంజిత్, కొల్లి అనుదీప్, పిల్లలమర్రి సుబ్బారావు, జెట్ల రంగారావు, జి.రాజేష్, నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, భారతి, బుగ్గవీటి సరళ, యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు, మాదినేని రమేష్ పాల్గొన్నారు.

కూలి బంధు, బీమా అమలు చేయాలి

వ్యకాస జిల్లా అధ్యక్షులు మేరుగు సత్యనారాయణ

నవతెలంగాణ-వైరాటౌన్

రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలని, ఉపాధి కోసం కూలి బంధు, కూలి బీమా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మేరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా రూరల్ మండల కమిటీ సమావేశం వైరా బోడేపూడి భవనంలో కారుమంచి జయరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మెరుగు సత్య నారాయణ మాట్లాడుతూ రెండు రెక్కలు ఆస్తిగా, చెమట చుక్కలు పెట్టుబడిగా భూమిపై పనిచేస్తూ పంటలు పండిస్తూ సమాజంలో అందరికీ తిండి పెడుతున్న వ్యవసాయ కూలీలు నేడు అర్ధాకలితో బ్రతుకుతున్నారని, బిజెపి పాలనలో పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, రోజు కూలి కేవలం 250 నుంచి 350 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. గ్రామాలలో 200 రోజులు ఉపాధి పని కల్పించాలని, రోజు కూలి 600 రూపాయలకు పెంచాలని, కేంద్ర బడ్జెట్లో 2 లక్షల 64 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని సవరించాలని, 57 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యవసాయ కార్మికులకు నెలకు 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు కూలి బంధు, కూలి బీమా పథకం తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి తూము సుధాకర్, నాయకులు షేక్ ఖాసిం, గరిడేపల్లి సుబ్బారావు, షేక్ రెహనా, ఎస్కే మసీద్ బి, ఎస్.కే ఫాతిమా, జి.శివాజీ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-వైరాటౌన్

ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయ ఆధ్వర్యంలో వైరా ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్లకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా సిఐటీయూ వైరా పట్టణ కన్వీనర్ అనుమోలు రామారావు, జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆశా కార్మికులు గిరిజన ప్రాంతాలలో 32 సంవత్సరాల నుండి, మైదాన ప్రాంతాలలో 18 సంవత్సరాల నుండి పనిచేస్తున్నారని, గ్రామాలలో అన్ని రకాల జబ్బులను గుర్తించి ప్రభుత్వం ఇచ్చే మందులను ప్రజలకు అందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు అన్నారు. ఆశా వర్కర్ల కీలకపాత్రను గుర్తించి ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అవార్డు ప్రకటించింది అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఆశాలకు పనిభారం తగ్గించాలని, కరోనా రిస్క్ అలవెన్స్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, అధికారుల వేధింపులు అరికట్టాలని, ఆశాలకు ప్రసూతి సెలవులు తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు సుజాత, ఆదిలక్ష్మి, అమత, నాగమణి, పద్మ, నాగేంద్ర, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నవ తెలంగాణ - బోనకల్

ఉపాధ్యాయ, విద్యారంగం సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ టియస్ యుటియఫ్ బోనకల్ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఛైర్మెన్ లింగాల కమల్ రాజుకి శనివారం వినతిపత్రం అందజేశారు. జిడిపి, జిపియఫ్ 2022-3 స్లిప్పులు ఆన్లైన్ చేయాలని, పాఠశాలలో పూర్తిస్థాయిలో సర్వీస్ పర్సన్స్ నియమిం చాలని, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ అందించాలని, గురుకుల, కెజిబివి పాఠశాల విద్యార్థులకు అనారోగ్య సమస్యలు రాత్రి వేళల్లో వచ్చినప్పుడు జిల్లా కేంద్రానికి తీసుకెళ్లటానికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో వారు కోరారు. బోనకల్ పిహెచ్‌సిలో రాత్రి సమయంలో కూడా వైద్యం అందించే విధంగా కృషి చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు. గోవిందాపురం ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న హిందీ పోస్ట్‌ను భర్తీ చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా నాయకులు సద్దా బాబు, టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు భూపతి ప్రీతం, ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, నాయకులు పి.పుల్లారావు, పి.నరసింహా రావు, రాఘవాచార్యులు, ఎంసిఆర్ చంద్రప్రసాద్, టి.లక్ష్మి పి.గోపాల్‌రావు, చిన్న రంగారావు, జల్లా కోటయ్య, జి.శ్రీనివాసు, వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్ అందజేత

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు యస్‌బిఐ బ్యాంకు నందు మేదర కుమారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద మంజూరైన రెండు లక్షల రూపాయలను ఆమె భర్త మేదర్ తామస్‌కు యస్‌బిఐ మేనేజర్ వేద వసంతరాయ్, క్యాషియర్ గోపి, మండల బిఆర్ఎస్ యూత్ ప్రధాన కార్యదర్శి శీలం నరేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన జ్యోతి యువజన బీమా కింద సంవత్సరానికి 436 రూపాయలు చెల్లించిన ఎడల చనిపోయిన రెండు లక్షల బీమా సౌకర్యం కలదని తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినట్లు బోనకల్ ఎస్సై బొల్లెద్దు సాయికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన కుక్కల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆదేవిధంగా ఇదే కేసులో మరో ముగ్గురు పై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వైరా ఏసిపి మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ ఈ కేసును విచారణ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

శ్రీ వారిని దర్శించుకున్న భక్తులు

నవతెలంగాణ - ఎర్రుపాలెం

జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వా మి వారి ఆలయానికి శనివారం కావడంతో భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామునే స్వామి వారికి పంచామృతాలతో సర్వాంగా అభిషేకం ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ వారికి పట్టు వస్త్రములు ధరింప జేసి,ప్రత్యేక అలంకరణ చేసి స్వామి వారిని భక్తులకు దర్శనం కల్పించారు.

దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ముదిగొండ

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఓపెన్ టెన్త్ అధ్యయన వేదిక కో-ఆర్డినేటర్ చిరుమర్రి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కె నాజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసి చదువుకోవాలని ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. ఈనెల10వ తేదీవరకు దరఖాస్తుల స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యా రంగానికి ప్రాధాన్యత : జడ్పీ ఛైర్మెన్

నవతెలంగాణ - బోనకల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, అందుకోసమే మన ఊరు మనబడి కింద ప్రభుత్వ పాఠశాలకు కోట్లాది రూపాయలను మంజూరు చేస్తుందని జిల్లా పరిషత్ ఛైర్మెన్ లింగాల కమల్ రాజు అన్నారు. బోనకల్ ఉన్నత పాఠశాలలో శనివారం జరుగుతున్న తొలిమెట్టు ఉపాధ్యాయుల శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగానికి కావలసిన అన్ని మౌలిక సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందన్నారు ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలను సాధిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు చదువే ప్రాధాన్యతగా గుర్తించి చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. అనంతరం జానకిపురం గ్రామంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు కోట శ్రీకాంత్ తండ్రి కోట రోషయ్య దశదిన ఖర్మకు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బంధం శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి బనావత్ కొండ, రైతుబంధు మండల కన్వీనర్ వేమూరి ప్రసాద్ రావు, వివిధ గ్రామాలకు చెందిన ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రామకృష్ణ విద్యాలయంలో నిరంతర ప్రశిక్షణా వర్గ బోధన

ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయంలో నిరంతర ప్రశిక్షణా వర్గ బోధన ముఖ్య లక్ష్యం విద్యార్థులలో ఉన్న సామర్థ్యాన్ని వెలికి తీయడమని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు చెప్పారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం ద్వారా నడపబడుచున్న వరంగల్, ఖమ్మం జిల్లాలలో ఉన్న 15 పాఠశాలల్లో పని చేస్తున్న ఆచార్యుల రెండు రోజుల నిరంతర ప్రశిక్షణా వర్గ బోధన కొనసాగుతుందన్నారు. చెప్పబోయే పాఠాన్ని ముందుగా చదివి అర్థం చేసుకొని విద్యార్థులకు బోధించాలని, అప్పుడే విద్యార్థులకు అర్థమవుతుందని, బోధనలో విద్యార్థులను భాగస్వామ్యులను చేయాలని, మనం చెప్పిన విషయాన్ని 24 గంటల్లో పునఃశ్చరణ చేయాలని, విద్యార్థులకు అవగాహన అయిందో లేదో మూల్యాంకనం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, వేమవరపు సుబ్బారావు, పాఠశాల కార్యదర్శి శ్రీనివాస్, పాఠశాల ప్రధానాచార్యా సంతోషా గౌతమ్, 65 మంది ఆచార్యులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ జాఫర్‌కి నివాళి

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం 2వ డివిజన్‌కి చెందిన సీనియర్ ఆటో డ్రైవర్ షేక్ జాఫర్ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి పువ్వాడ ఫౌండేషన్ ద్వారా 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పీఏ చిరుమామిళ్ల రవికిరణ్ అందజేశారు. అనంతరం 8వ డివిజన్లోని గొల్లగూడెంకు చెందిన చిర్రా వెంకటేశ్వర్లు మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి పాల్వంచ కృష్ణ, కార్పొరేటర్లు దండా జ్యోతిరెడ్డి, కూరకుల వలరాజు, సలీం, బాలకృష్ణ, కుక్కల రామకృష్ణ, సుధాకర్, కోటి, గ్రామ అధ్యక్షుడు జానీ, కొండల్‌రావు, రజీమ్, బొందల రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కిడ్జ్‌లో ఘనంగా స్నేహితుల దినోత్సవం

నవతెలంగాణ- ఖమ్మం



నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు తమ మిత్రుల ముంజేతికి ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టి తమ ఆత్మీయతను పంచుకున్నారు. తమ మిత్రులకు ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ఇంచార్జీగా అమర్జాహాన్ బేగం

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఇన్చార్జిగా అమర్జాహాన్ బేగం నియమితులయ్యారని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌజన్య తెలిపారు. శనివారం ఖమ్మంలోని సంజీవరెడ్డి భవనంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం మహిళా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, ఖమ్మం జిల్లా మహిళా కమిటీ సభ్యులు రజనీ, పుష్ప, మండల కమిటీ సభ్యురాలు వాసవి, రేణుక , ప్రభావతి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టకపోతే ప్రత్యక్ష పోరాటమే : సిపిఐ

నవతెలంగాణ - బోనకల్

బోనకల్ - ఖమ్మం ప్రధాన రహదారి మరమ్మతు పనులు వెంటనే చేపట్టకపోతే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కేంద్రంలోని బోనకల్-ఖమ్మం ప్రధాన రహదారిని సిపిఐ బృందం శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్ కుమార్, బొమ్మినేని కొండలరావు, పగిడిపల్లి యేసు, సిపిఐ సహాయ కార్యదర్శి ఆకెన పవన్, సిపిఐ మండల నాయకులు సాధనపల్లి ఆమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడుపై దాడికి ఖండన

నవతెలంగాణ - బోనకల్

చిత్తూరు జిల్లాలో పర్యటిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై వైసీపీ కిరాయి గూండాలు రాళ్లతో దాడి చేయడాన్ని బోనకల్ మండల తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ - బోనకల్

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ మధిర డివిజన్ అధ్యక్షులు కోట వెంకట్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో హ్యూమన్ రైట్స్ పౌండేషన్ ఆధ్వర్యంలో మానవ హక్కుల చట్టాలపై, పోక్సో యాక్ట్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ యం.నిస్సి జిల్లా అడ్వైసర్ యం.యశోద, మధిర డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కె. వెంకటేశ్వర్లు , కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇన్చార్జి ప్రత్యేక అధికారిని శైలజ పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రముఖ సమాజ సేవకుడు పల్లా కిరణ్ కుమార్ కుమార్తె పల్లా హాసిని పుట్టినరోజు సందర్భంగా తీవ్రమైన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఇద్దరు నిరుపేద మహిళలకు వైద్యం మరియు మందుల నిమిత్తము తమ వంతుగా పల్లా కిరణ్ ఆర్థిక సహాయం అందించారు. దంసలాపురం కొత్త కాలనీకి చెందిన ఆర్ వెంకటలక్ష్మికి ఇటీవల ఫైర్ యాక్సిడెంట్ అయ్యి ఒళ్లంతా కాలిపోయి ఎడమ చేయి తీసివేయడం జరిగింది. అలాగే 22వ డివిజన్ ముస్తఫానగర్‌కి చెందిన ఎస్.కర్ణ తీవ్రమైన అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారనే విషయం తెలుసుకొని వెంటనే స్పందించి ఆ ఇద్దరు నిరుపేద మహిళలకు వైద్యం మరియు మందుల నిమిత్తము ఆర్థిక సహాయం అందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ - ఎర్రుపాలెం

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు పట్ల విద్యార్థులకు హెూమియోపతి ఆయుష్ విభాగం డాక్టర్ శ్రీనివాస్ నాయక్ అవగాహన కల్పించారు. పెనుబల్లి మండలం విఎం బంజరలో హెూమియోపతి హాస్పటల్ నందు విధులు నిర్వహిస్తూ శనివారం ఎర్రుపాలెం మండల పరిధిలోని మామునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెూమియోపతి మందులపై అవగాహన కల్పించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మారాబత్తుల మోహనరావు పాల్గొన్నారు.

.దరఖాస్తు చేసుకున్న బీసీలందరికీ రుణాలు ఇవ్వాలి

నవతెలంగాణ- నేలకొండపల్లి

రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీలందరికీ ప్రభుత్వం తక్షణమే రుణాలు మంజూరు చేయాలని బీసీ జేఏసీ పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొత్త కొత్తూరు గ్రామంలో బీసీ జేఏసీ మండల కమిటీ సమావేశం దేవరశెట్టి రాము అధ్యక్షతన జరిగింది.

అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం 06 ఆగస్టు 2023

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ

- మండల విద్యాశాఖాధికారి సున్నం సమ్మయ్య



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు శనివారం నుండి రాగి జావ అందజేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న రక్తహీనత, పోషకాహార లోపాన్ని నివారించేందుకు గాను రాగి జావ అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో మధ్యాహ్న భోజనం అమలు అయ్యే పాఠశాలలకు అగష్టు నెలకు సంబంధించి 11 రోజుల పాటు రాగి జావ అందించేందుకు 4 క్వింటాళ బెల్లం, 4 క్వింటాళ రాగి పిండిని ఆయా పాఠశాలలకు అందజేసినట్లు ఆయన తెలిపారు. వారంలో మూడు రోజుల పాటు అనగా మంగళవారం, గురువార, శనివారం అందజేయడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థికి 10 గ్రాముల బెల్లం, 10 గ్రాముల రాగి పిండి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఔ ప్రభాకర్‌తో పాటు ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్మెన్‌లకు సన్మానం

నవతెలంగాణ-చుంచుపల్లి

మండలంలోని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బాదావత్ శాంతి, జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్ రావు పదవీకాలం నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని మండల ప్రజా పరిషత్ చుంచుపల్లి కార్యాలయ సిబ్బంది వీరిని ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, బాదావత్ సీతారాములు, సీనియర్ అసిస్టెంట్ ఎండి.జానీ పాషా, కార్యాలయపు సిబ్బంది పావని, బేగం, వెంకట్, టైపిస్టు అంబికా, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవడమే తమ సంస్థ లక్ష్యం

- గౌతమి స్ఫూర్తి నిర్వాహకులు సోమయ్య

నవతెలంగాణ-అశ్వాపురం



నిరుపేదలను ఆదుకోవడమే గౌతమి స్ఫూర్తి ఫౌండేషన్ లక్ష్యమని ఆ సంస్థ కార్యనిర్వాహకుడు కే.సోమయ్య అన్నారు. శనివారం అశ్వాపురం గ్రామానికి చెందిన వర్షిత అనే డీఎంఎల్టి రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ అవసరాలకు రూ.15వేలను అందజేశారు. అదేవిధంగా చింతిరాల క్రాస్ రోడ్డుకు చెందిన కోపూరి రాంబాబు అనే వ్యక్తికి వైద్య ఖర్చుల కోసం రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని గౌతమి నగర్ కాలనీ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ సంస్థ ఏర్పడిందని, సంస్థ ముఖ్య ఉద్దేశం నిరుపేదలకు వైద్య సేవల కోసం, నిరుపేద విద్యార్థులకు చదువుకునేందుకు ఎంతో కొంత అండగా ఉండాలనే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ నారాయణరాజు పాల్గొన్నారు.

పెరిగిన వేతనం ఏరియర్స్‌తో సహా చెల్లించాలి

నవతెలంగాణ-ములకలపల్లి



పెరిగిన వేతనాన్ని ఏరియర్స్‌తో సహా వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) మండల కార్యదర్శి బుగ్గా వెంకట నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కార్యాలయంలో అధికారి ప్రవీణ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ధరలతో పోలిస్తే కేటాయించిన బడ్జెట్ సరిపోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, తిరుపతమ్మ, భూక్యా క్రాంతి, ముదిగొండ అనసూర్య, మంగమ్మ, రత్నకుమారి, ముత్తమ్మ, పోడి ముత్తమ్మలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-టేకులపల్లి

ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం సహాయనిధి అండగా ఉందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్ర పరిధిలోని వివిధ గ్రామాలలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. టేకులపల్లికు చెందిన కే.నాగభూషణం, టి.దేవిలకు రూ.20,000, కోయగూడెం గ్రామానికి చెందిన వి.సుభద్ర రూ.18000, మంగలి తండకు చెందిన బి.మనీకు రూ.17,000, రాజు తండకు చెందిన బి.బీమా రూ.22,000, బిల్లుడు తండకు చెందిన బి.గోగ్యకు, కొత్త తండాకు చెందిన బి.భీమ్లాకు రూ.20,000 చెక్కులను అందజేసి మాట్లాడారు. కరోనా కష్ట సమయంలో కూడా పేద ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రతన్, మండల నాయకులు కాలే ప్రసాద్ రావు, కుమ్మరి కిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలు వెంటనే చేపట్టాలి

నవతెలంగాణ-మణుగూరు

ఉపాధ్యాయుల ప్రమోషన్స్ బదిలీలు వెంటనే చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేసింది. శనివారం అశ్వాపురం, మణుగూరు మండలాల ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని యూటీఎఫ్ మండల బృందం సందర్శించింది. ఉపాధ్యాయులతో వారి సమస్యల మీద చర్చించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు షేక్ మీరా హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి టీచర్ బోధనలో అప్డేట్ అవుతూ టెక్నాలజీని ఉపయోగించుకుని బోధనను సరళీకృతం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, ఎంఈఓ వీరస్వామి, రిసోర్స్ పర్సన్స్, ట్రెజరర్ మీ రెడ్డి ఇంద్రసేనారెడ్డి, సీనియర్ నాయకులు సిహెచ్ శ్రీనివాసు, వజ్జా కృష్ణమూర్తి, రెండు మండలాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే హామీలు వెంటనే అమలు చేస్తాం

- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు సున్నం నాగమణి

నవతెలంగాణ-చంద్రుగొండ



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యురాలు సున్నం నాగమణి ప్రజలకు హామీ ఇచ్చారు. శనివారం బల్లెపల్లిలలో పల్లె పల్లెకు ఇందిరమ్మ బాటలో మాజీ ఎంపీపీ గుగులోత్ బాబు, గండరపు సీతారాములు అధ్యక్షతన సున్నం నాగమణి ఆధ్వర్యంలో ఇందిరమ్మ బాట కరపత్రాలతో ప్రారంభించి, పోకలగూడెం, రేపల్లెవాడ పంచాయతీలో గ్రామలలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...కాంగ్రెస్ మానిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఏనుముల చిన్న రాములు, గోపాల్ రావు, నరసింహారావు, ఏనుముల బుచ్చయ్య(చిన్న), చీమాట నరసింహారావు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి రెండవ విడత గొర్రెలు పంపిణీ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



మండలంలో రెండవ విడత గొర్రెలు పంపిణీ ఈ నెల 8 నుంచి చేస్తున్నట్లు మండల పశు వైద్య అధికారి రాంప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ విడతలో పెంట్లం, పెద్దిరెడ్డి గూడెం, మర్రిగూడెం, అబ్బుగూడెం, పంచాయతీలో 328 మంది లబ్ధి దారులు వున్నారని, కురుమ, యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి గొర్రెల పంపిణీ అనేది చాల దోహద పడుతుందని అన్నారు.

జీపీ కార్మికుల సమ్మెను పరిష్కారం చేయాలి

- సీపీఐ(ఎం) జాతీయ నాయకులు ఎం.సాయిబాబు

నవతెలంగాణ-భద్రాచలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.సాయిబాబు

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి, కార్మికుల సమ్మెను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని సీపీఐ(ఎం) జాతీయ నాయకులు ఎం.సాయిబాబా డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య అధ్యక్షతన శనివారం బండారు చంద్రరావు భవన్లో జరిగింది. ఈ సమావేశానికి ఎం.సాయిబాబు పాల్గొని మాట్లాడారు. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వారి డిమాండ్ల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. పంచాయతీ కార్మికులు లేకపోతే గ్రామాలలో పరిశుభ్రత ప్రజల ఆరోగ్యాలు ప్రమాదంలోకి నెట్టివేయబడతాయని పేర్కొన్నారు. పంచాయతీ కార్మికుల శ్రమ వల్లనే రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెబుతున్న అనేక కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర శాసనసభ సమావేశాలు జరుగుతున్నందువల్ల రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమ్మెకు నాయకత్వం వహించిన జేఏసీ నాయకులను పిలిచి చర్చలు జరపాలని వారి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అదేవిదంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా డే సందర్భంగా ఆగస్టు 9, 10 తేదీలలో దేశవ్యాప్తంగా కలెక్టరేట్ ఎదుట కేంద్ర కార్మిక సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న మహా పడావ్ ధర్నా కార్యక్రమాలకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని పేర్కొన్నారు. మణిపూర్లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం హింసకాండ నేడు హర్యానాకు ఎగబాకిందని పేర్కొన్నారు. తెగల మధ్య మతాల మధ్య కులాల మధ్య వైశ్యాలను రెచ్చగొట్టి బీజేపీ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తుందన్నారు. మణిపూర్లో హింసను ఆపటం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మణిపూర్ ముఖ్యమంత్రిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు, సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ములుగు జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఎలమంచి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, రత్నం రాజేందర్, పార్టీ నాయకులు సున్నం గంగా, రేపాకుల శ్రీనివాస్, ఎలమంచిలి వంశీ, కుమ్మరి శ్రీను, కొప్పుల రఘుపతి, అన్నవరపు సత్యనారాయణ, మర్మం చంద్రయ్య, కొరసా చిలకమ్మ, నిమ్మల వెంకన్న, గద్దల శ్రీను, దొడ్డ రవి, బత్తుల వెంకటేశ్వర్లు, గ్యానం వాసు, సాంబశివరావు, కృష్ణ, మచ్చా రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వ సాచివేత ధోరణి : ఏజే రమేష్



జూలూరుపాడు : గ్రామ పంచాయతీ కార్మికులు గత 31 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం సాచివేత ధోరణితో వ్యవహరిస్తుందని, ఈ ధోరణిని ప్రజల్లో ఎండగట్టి, ప్రజా మద్దతుని కుడగడతామని జిల్లా జేఏసీ చైర్మెన్ ఏజె.రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సమ్మె శిబిరాన్ని సందర్శించిన మాట్లాడుతూ సమ్మె డిమాండ్లపై మంత్రితో ఒక దఫా చర్చ జరిగినప్పటికీ స్పష్టమైన హామీ రాలేదని, ప్రస్తుతం అసెంబ్లీ జరుగుతున్నప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం వైపు నుండి ఒక్క ప్రకటన కానీ, కనీసం జేఏసీతో చర్చలు కానీ స్పష్టత రాలేదని అన్నారు. కళ్లుండీ చూడలేని....చెవులు ఉండి వినలేని గుడ్డి, చెవిటి ప్రభుత్వంగా ఉన్నదన్నారు. కార్మికుల సహనానికి పరీక్ష పెట్టద్దని, సహనం కోల్పోతే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమార్, మండల అధ్యక్షులు ఈర్యా తదితరులు పాల్గొన్నారు.



వరద బాధిత రైతులకు ఎరువుల వితరణ

- వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ యజమాని సహాయం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)

గుండాల మండలంలో ఇటీవల కాలంలో అధిక వర్షాలకు వరద ముంపునకు గురైన సాయనపల్లి గ్రామానికి చెందిన 33 బాధిత రైతు కుటుంబాలకు మండల కేంద్రానికి చెందిన శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ యజమాని తిరుకోళ్లూరి వెంకటేశ్వర్లు (పట్వారి వెంకన్న) సుమారు 50 వేల విలువచేసే ఎరువు బస్తాలను ఇంటికి మూడు చొప్పున శనివారం పంపిణీ చేసి, మానవత్వం చాటుకున్నారు. దీనికి గాను ఆ బాధిత రైతులు, గ్రామ ప్రజలు వ్యాపారికి ధన్యవాదాలు తెలియజేశారు.

జెడ్పీ జీపీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి

- జెడ్పీ కార్యాలయం ఎదుట నిరసన

నవతెలంగాణ-కొత్తగూడెం



తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ముందు జడ్పీ జీపీఎఫ్ సమస్యల పరిష్కారం కోసం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుమ్మడి సమ్మయ్య, జిల్లా అధ్యక్షులు బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్ మాట్లాడుతూ సాధారణ భవిష్యత్ నిధిపై ఉన్న ఆర్థిక ఆంక్షలు తొలగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న లోన్లు, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్స్ వెంటనే విడుదల చేయాలని, 2006-07 నుండి 2021-22 వరకు జడ్పీ జీపీఎఫ్‌కు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.2742 కోట్ల వడ్డీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా జడ్పీ జీపీఎఫ్ ఖాతాలలో మిస్సింగ్ క్రెడిట్‌గా ఉన్న సుమారు రూ.1000 కోట్లను సరిచేసి ఉపాధ్యాయుల ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. 2006-2013 వరకు ఉద్యోగ ఉపాధ్యాయులకు జెడ్పీ వారు చెల్లించిన బూస్టర్ స్కీం బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాలని, 2013-14 నుండి నేటి వరకు మరణించిన ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించవలసిన బూస్టర్ స్కీం నిధులు ప్రభుత్వం విడుదల చేయాలని, లోన్లు పార్ట్ ఫైనల్స్, ఫైనల్ పేమెంట్స్ మంజూరి చేసిన వెంటనే వ్యక్తిగత ఖాతాలనుండి తగ్గిస్తున్నారు, కానీ జమ చేయడానికి సుమారు 6 నెలల నుండి 12 నెలల కాలం పడుతుందని, ఈ మధ్య కాలానికి వడ్డీ లెక్కించి ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులు ఫ్లెక్సీ, ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వి.సరియా, జోగా రాంబాబు, టి.సత్తిబాబు, జిల్లా కార్యదర్శులు బి.రమేష్, బి.బాలు, జిల్లా హెచ్ఎంల ప్రతినిధి కె.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, పి.రామనాథం, బివి.ఎల్ కుమార్, డి.సుధాకర్, బి.లింబ్యా, కె.నరసయ్య, డి.వీరన్న, సత్యనారాయణ, డి.పద్మ, డి.రమాదేవి, గోగ్గల సమ్మయ్య, టి.ఇమ్మానుయేల్, టి.శ్రీనివాస్, సర్వేశ్వరరావు, దేవదాస్, హరి సింగ్, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, రాఘవులు, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

కఠోర శ్రమ మాత్రమే న్యాయవాది విజయానికి మార్గం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్
- రెండు రోజుల న్యాయవాదుల కార్యశాల ప్రారంభం

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

న్యాయవాది విజయానికి, ప్రగతికి, కఠోరమైన శ్రమ చేయటం ఒక్కటే మార్గమని, దీనికి ప్రత్యామ్నాయం లేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్ అన్నారు. కొత్తగూడెం రైటర్ బస్తీలోని ఐఎంఏ హాలులో శనివారం జరిగిన న్యాయవాద కార్యశాల ప్రారంభ సభకు ఆయన హాజరై కార్యశాలను ప్రారంభించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో జిల్లా జడ్జి ప్రసంగిస్తూ న్యాయవాదులు వృత్తిలో మెళుకువలు మెరుగు పర్చుకోటానికి ఈ కార్యశాల ఉపయోగపడుతుందని ఆశించారు. జిల్లాలోని న్యాయవాదులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిత్యం మారుతున్న సమాజంలో మారుతున్న చట్టాలకు అనుగుణంగా న్యాయవాదులు తమ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పర్చుకోవాలని ఆయన ఉపదేశించారు. ఈ సభలో ఐఎల్‌పీఏ బాధ్యులు శాంసన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రాధాకృష్ణ, ఇల్లెందు బార్ అసోసిమేషన్ అధ్యక్షులు మామిడి సత్య ప్రకాష్, మణుగూరు ఉపాధ్యక్షురాలు సిహెచ్.సరస్వతి, భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు బండారు అరుణ్ చంద్, తదితరులు ప్రసంగించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు దుంద్ర రమేష్, ప్రధాన కార్యదర్శి రావిలాల రామా రావు, సంయుక్త కార్యదర్శి కాసాని రమేష్, కోశాధి కారి సాహు సంతోష్ లాల్, క్రీడా కార్యదర్శి పిట్టల రామారావు, గ్రంథాలయ కార్యదర్శి యాసా యుగంధర్, మహిళా ప్రతినిధి ఎ.మనోరమ, కార్యక్రమ నిర్వాహకురాలు ఎస్. భానుప్రియ తదితరులు పాల్గొన్నారు. సభా ప్రారంభానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి స్వర్గీయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. నాగరాజు చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత న్యాయవాది పిపి.విఠల్ స్వాగతం పలుకగా, కాసాని రమేష్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యశాల శని, ఆదివారం రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు.

ప్రజలతో మమేకమవుతున్న మడత

- రాజకీయంలో పెను మార్పు

నవతెలంగాణ-ఇల్లందు

ప్రజలతో మమేకమవుతూ తన ప్రస్థానాన్ని మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మడత వెంకట్ గౌడ్ కొనసాగిస్తున్నారు. గత కొన్ని రోజులుగా స్తబ్దతగా వున్న ఆయన మళ్ళీ రాజకీయాల్లో స్పీడ్ పెంచారు. అందులో భాగంగానే శనివారం పట్టణంలోని అంబజార్‌లోని నెహ్రూ చౌక్ వరకు వ్యాపారులను కలిసారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ మంచి, చెడు మాట్లాడుకున్నారు. అధికారంలో ఉన్న లేకపోయినా ఎప్పటిలాగే కలిసిమెలసి ఉంటున్న వెంకట్ గౌడ్ రాకను చూసి వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వెంకట్ గౌడ్ వెనుక ఆయన అనుచరులు 300 మందితో కలిసి అంబజార్ మొత్తం కలియ తిరిగారు. కాగా కొద్దీ మంది వ్యాపారులు తమ అభిమానాన్ని ఎల్లప్పుడూ చాటుకునే విధంగా శాలువలు కప్పి సన్మానించారు. అంబజార్ అభివృద్ధికి వెంకట్ గౌడ్ హయాంలో చేసిన పనులను గుర్తు చేసుకున్నారు. కొంతమంది మరో అడుగు ముందుకు వేసి ఆయన ధీరత్వాన్ని కొనియాడారు. నమ్ముకున్న వారికోసం కడదాకా కలబడి నిలబడ్డ నాయకుడని ప్రశంసించారు. దీంతో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడతపై ప్రజలు చూపిస్తున్న అభిమానంతో వచ్చే ఎన్నికల్లో వెంకట్ గౌడ్ పేరు రాజకీయాల్లో ముఖ్య కేంద్ర బిందువుగా మారే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన అభిమానులు, కార్యకర్తలు కోడి రాజేందర్, మామిడి శివకుమార్ మేకల నగేష్, బొల్లి రాజు, జేమ్స్ విక్కీ ,కోటగిరి రాజేందర్, భరత్, స్వామి, మునాఫ్, శేషు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మూకమామిడి ప్రాజెక్టు ఎడమకాలువ తూమును ఎత్తించాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తహసీల్దార్‌కి వినతి

నవతెలంగాణ-ములకలపల్లి



మూకమామిడి ప్రాజెక్టు ఎడమకాలువ తూమును వెంటనే ఎత్తించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు విడుదల చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ పుల్లారావుకు 'ఆయకట్టు రైతులతో కలిసి వెళ్లి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు ఎడమకాలువ తూము కిందకు పడిపోవడంతో ఆయకట్టు రైతులు నీరులేక వరినాట్లు అగిపోయాయన్నారు. ఇప్పటికే రైతులు పోసిన వరినార్లు ఎండిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మల మధు, మంచాల సారయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, భూక్యా వెంకటేశ్వర్లు, వూళే వెంకటేష్, వూకే రంగయ్య, వాసం ముత్యాలు, కీసరి చలమన్రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాంచ్ కార్యదర్శిగా వై.రాంగోపాల్

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచి సెక్రటరీగా వై.రాంగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగిన 12వ మహాసభలో సింగరేణి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కామ్రేడ్ వై.రాంగోపాల్ బ్రాంచ్ సెక్రటరీగా, ఎం.వి రాంనర్సయ్య వైస్ ప్రెసిడెంట్‌గా, మేకల ఈశ్వర్ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీగా, జి.పుల్లారావు సహాయ కార్యదర్శిగా, ఆవుల నాగరాజు ట్రెజరర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆఫీస్ బేరర్లుగా ఎస్కే సుభాని, ఆధర్ల సురేందర్, జి.గంగాధర్ రావు, గొప్ప సుధాకర్, పి.సురేందర్ ఎన్నికయ్యారు. 33 మంది ఎగ్జిక్యూటివ్స్ మెంబర్స్‌గా ఎన్నికయ్యారు.

పీఓను కలిసిన డీవైఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కొత్తగూడెం



నూతనంగా బాధ్యతలు చేపట్టిన భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్‌ని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లిక్కి బాలరాజు, కాలంగి హరికృష్ణలు శనివారం ఐటీడీఏ పీవో ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ భద్రచలం ఐటీడీఏలో సమస్యల పరిష్కారంలో చాలా అద్భుతంగా పీఓ కృషి ఉండబోతుందని, సమస్యల కోసం ఎవరు వచ్చిన నేరుగా కలవడం కోసం అవకాశం కల్పిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో మారుమూల పట్టణాలలో పల్లెటూర్లలో అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల పెంపుదాలలో ఐటీడీఏ కృషి పెరగాలని కోరారు. యూత్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా అనేక ఉపాధి అవకాశాలు కల్పించి, యువతకు మార్గం, మార్గ నిర్దేశం చేయాలని కోరారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రామయ్యను హై కోర్టు జడ్జి లక్ష్మణ్ శనివారం కుటుంబ సభ్యులతో కలసి పర్ణశాల రామయ్యను దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది వారికి ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు సీతాకుటీర ప్రదేశంతో పాటు ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. సీతానారచీరల ప్రాంతాలను సందర్శించి పర్ణశాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఫాం ఆయిల్ సాగు విస్తరణను వేగవంతం చేయండి : డీఓ

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్ ఫాం సాగు విస్తరణను వేగవంతం చేయాలని ఆయిల్ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. వానాకాలంలో నిర్దేశించిన లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మండలంలోని నారంవారిగూడెం కార్యాలయంలో శనివారం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులకు అవసరమైన మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉన్నాయని, గతంలో మాదిరిగా మొక్కల కొరత లేదని చెప్పారు. సాగు ప్రయోజనాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీ పథకాల పైనా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఇప్పటికే ఆయిల్ ఫాం సాగు చేస్తున్న రైతులకు పక్వానికి వచ్చిన గెలలను మాత్రమే ఫ్యాక్టరీకి తరలించాలని, లేత గెలలు తరలించడం వల్ల ఆయిల్ రికవరీ పై ప్రభావం ఉంటుందని, ఫలితంగా గెలలు ధర పడిపోతుందని, ఈ విషయాన్ని రైతుల్లోకి తీసుకెళ్ళాలని చెప్పారు. ప్రభుత్వం జారీ చేసిన పోడు భూములకు కూడా రాయితీ పథకాలు అమలు అవుతాయని, కొత్తగా పట్టాలు తీసుకున్న గిరిజన రైతులకు సాగుపై అవగాహన కల్పించాలని అన్నారు. సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల ఫీల్డ్ ఆఫీసరు మహేష్, అప్పారావు, ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టుకు అడ్మినిస్ట్రేషన్ సమస్య
అసెంబ్లీ దృష్టికి తెచ్చిన హరిప్రియ



నవతెలంగాణ-ఇల్లందు

నియోజకవర్గ పరిధిలోని గార్ల, కామేపల్లి మండలాల గుండా వెళ్లే కాలువల భూములు కోల్పోతున్న రైతుల సర్వే నెంబర్లను బ్లాక్ చేయడం వల్ల కాలువ కింద భూమి పోగా మిగులు భూమికి రైతుబంధు వర్తించడం లేదంటూ ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే హరిప్రియ తీసుకువెళ్ళారు. శాసనసభలో శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో సీతారామ ప్రాజెక్టు ఫేస్-2లో చేపడుతామని సీఎం చెప్పడంతో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇవ్వాలని ఎమ్మెల్యే హరిప్రియ ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలో మెజార్టీ రైతులు బోరు బావుల మీద చిన్న కుంటలు చెరువుల మీద ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 మండలాలకు రూ.1,16 వేల కోట్లతో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇవ్వగలరని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.

జాయింట్ కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీఓఎస్ నాయకులు



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ రాంబాబుని టీఎన్‌జీఓఎస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకముగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓఎస్ జిల్లా అధ్యక్షులు అమరానేని రామారావు, జె.సోమయ్య సిహెచ్.రామారావు, పి.ప్రకాష్, నరసింహ రావు, రాంబాబు, జి.ఉష, పి.కల్యాణి, శశికళ, జి.నందిని, యస్.సందీప్, మధుసూదన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు పట్ల పాయం హర్షం

మణుగూరు : రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం పట్ల కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మణుగూరులోని పాయం క్యాంపు కార్యాలయంలో సంబరాలు జరుపుకొని, మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలం వైస్ ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, ఉప సర్పంచులు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, వీరంకి వెంకట్రావు గౌడ్, ఎస్కే బాజి, తరుణ్ రెడ్డి, సామ శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి రాజు, నిట్ట జీవరత్నం, పాల్వంచ రాములు, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

అశ్వారావుపేట : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం సుబ్బన్న పేట గ్రామానికి చెందిన గంగుల ఆంజనేయులు ద్విచక్రవాహనం పై అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం వైపు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యంలోనే తిమ్మాపురం మూల మలుపు వద్ద అదుపుతప్పి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు స్థానిక చిట్టితల్లి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో బాధితుడిని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఆంజనేయులకు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

గడప...గడపకు గడల

కొత్తగూడెం : గడప గడపకు గడల కార్యక్రమంతో మీ కొడుకుగా మీ ఇంటికి వస్తున్న డాక్టర్ గడల శ్రీనివాసరావు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్టు సభ్యులు కోరారు. శనివారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో డాక్టర్ జిఎస్ఆర్ ట్రస్ట్ యువసేన ఆధ్వర్యంలో ఇంటింటినీ సందర్శిస్తూ...త్వరలో ప్రారంభంకానున్న "గడప..గడపకు గడల మీ కొడుకుగా" మీ ఉన్నతకై విద్యా, వైద్యం, ఉపాధి, మీ సమస్యల పరిష్కారానికై వస్తున్న డాక్టర్ గడల శ్రీనివాసరావుని పెద్ద ఎత్తున ఆశీర్వదించాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ వార్డు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కో-ఆర్డినేటర్ మోదుగు జోగారావు, ట్రస్ట్ యువసేన ఇంచార్జి మిట్టపల్లి కిరణ్, పుదారి శ్యామ్ కుమార్, ఆరెల్లి శ్రీనివాస్, సంపత్, హర్షద్, బట్టు నారాయణ, ప్రమోద్, సాగర్, హరీష్, సోమ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డబల్ ఇండ్లు మంజూరు చేయాలి : ఇఫ్ట్యూ

మణుగూరు : మల్లేపల్లి చెరువు ముంపు బాధితులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని శనివారం ఇఫ్ట్యూ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనివాస్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు నాసర్ పాషా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని మల్లేపల్లి చెరువు బ్యాక్ వాటర్ ముంపు ప్రాంత బాధిత కుటుంబాలు ప్రతి వర్షాకాలంలో చెరువు నిండినప్పుడల్లా విష సర్పాలు, దోమలతో సహజీవనం చేయాల్సి వస్తోందని అన్నారు. అలాగే మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.మంగీలాల్, వి.శంకర్ నాయక్, ఉప్పల శివరామకృష్ణ, కడారి వీర్రాజు, నామాల రామకృష్ణ, తూము వెంకటేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య శిబిరం



నవతెలంగాణ-మణుగూరు

లయన్స్ క్లబ్ మణుగూరు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరబాద్ ఏవిస్ హాస్పిటల్స్ వారిచే ఉచిత వైద్య శిబిరం ప్రముఖ డాక్టర్ కొటేశ్వర రావు హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎస్సై రాజేష్ కుమార్, డాక్టర్ గాజుల కోటేశ్వర రావు, డాక్టర్ గణేష్ హాజరై మాట్లాడారు. కార్పొరేట్ హాస్పిటల్స్ సేవలు మారుమూల ప్రాంతాల ప్రజకు అందించడం అభినందనీయం అని చెప్పారు. అల్సర్, బోదకాలు, నరాల బలహీనత, నరాల వ్యవస్థ నలిగి పోవడం, తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించ తలపెట్టిన లయన్స్ క్లబ్ సభ్యులు అందరికీ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ గాజుల పూర్ణ చందర్ రావు, పాస్ట్ జెడ్‌సీ దోసపాటి వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం చైర్ పర్సన్, ఎంజెఎఫ్ రమేష్ కుమార్, నాగేశ్వర రావు, డాక్టర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సారయ్య కుటుంబానికి బియ్యం వితరణ

ఆళ్ళపల్లి : మండల పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన పెండకట్ల సారయ్య ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సారయ్య దశదిన కర్మలకు కుటుంబానికి పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు 50 కేజీల బియ్యం వితరణగా శనివారం స్థానిక ఆయన అనుచరుల చేతుల మీదుగా అందజేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గొగ్గెల శ్రీను, గొగ్గెల భాస్కర్, గొగ్గెల రాంబాబు, పాయం సారయ్య, రమేష్, పాయం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి ద్విచక్ర వాహనదారుడు అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాల ప్రకారం చిన్న ఆర్లగూడెం గ్రామానికి చెందిన కొర్స వెంకటేష్ (40) ఏపీ 16 బీటీ 0922 అనే నెంబర్ గల ఫ్యాషన్ ద్విచక్ర వాహనంపై లక్ష్మీ నగరం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో కాటాయిగూడెం మహదేవపురం గ్రామాల మధ్య గల తాలిపేరు కాలవపై ఉన్న కల్వర్టు వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వెంకటేష్ తలకు బలమైన గాయాలతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. ఆర్లగూడెం నుండి లక్ష్మీ నగరం వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టినట్లుగా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాక వెంకటేష్‌కు భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

అటవీ శాఖ ఉద్యోగుల ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండలంలోని ముత్తాపురం గ్రామానికి చెందిన పూనం సూరయ్య పాల్వంచ డివిజన్ ములకలపల్లి రేంజ్‌లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న క్రమంలో గత నెలలో అనారోగ్యంతో మరణించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి ఎంతో కొంత ఆర్థిక సాయం చేసి అండగా ఉండాలని పాల్వంచ డివిజన్‌కు చెందిన ఫారెస్ట్ ఉద్యోగులు వాట్సాప్ గ్రూప్‌లో శుక్రవారం చర్చించుకుని, నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ దామోదర్ రెడ్డి ఆదేశించడంతో శనివారం ఆళ్ళపల్లి, రేగళ్ల, తదితర ఫారెస్ట్ రేంజ్ అధికారులు కె.నరసింహారావు, వి.జశ్వంత్, శ్రీనివాస్, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి డివిజన్ తరుపున మృతుడి కుటుంబానికి ఇతోధిక సహాయంగా రూ.58,000 నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ఉద్యోగులు, టీఎస్ జెఎఫ్ఓఏ కిన్నెరసాని డివిజన్ నాయకులు శోభన్, సురేష్, హాథిరామ్, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

బోడెపూడి వర్ధంతి సభలో పోతినేని



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

నవతెలంగాణ-భద్రాచలం

శ్రామిక వర్గం ఐక్యత కోసం కృషి చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడమే ఆదర్శ కమ్యూనిస్టు, సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే అమరజీవి బోడెపూడి వెంకటేశ్వరరావుకి ఇచ్చే నివాళి అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అధ్యక్షతన బండారు చంద్రరావు భవన్లో శనివారం బోడేపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి సభ జరిగింది. బోడెపూడి నాయకులు ఎం.సాయిబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో పోతినేని పాల్గొని మాట్లాడారు. ఆదర్శ ప్రజా ప్రతినిధిగా, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడు బోడెపుడి అని కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, వెట్టిచాకిరి రద్దు కోసం పోరాడిన యోధుడని ఆయన అని, ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు మొత్తం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నేడు కేంద్ర బీజేపీ ప్రభుత్వం తన మతోన్మాద ఎజెండా ద్వారా దేశ సమైక్యతకు తీవ్ర ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందని పోతినేని పేర్కొన్నారు. కేంద్రం బీజేపీ ప్రభుత్వం మతోన్మాదానికి కార్పొరేట్ అనుకూల రాజకీయ విధానాలకు నాయకత్వం వహిస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగంపైన, రాజ్యాంగ వ్యవస్థల పైన తీవ్రమైన దాడి జరుగుతుందని ఈ దాడిని ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రతిఘటించాలని విజ్ఞప్తి చేశారు. ఒకనాడు చట్టసభలు అంటే ప్రజా సమస్యలపై చర్చ జరిగేవని అన్నారు. దేశానికి, రాష్ట్రానికి అవసరమైన అనేక పథకాలను రూపొందించడానికి ఆర్థిక సామాజిక అసమానతలను రూపుమాపటానికి వేదికలుగా ఉన్నాయని తెలిపారు. చట్టసభల విలువలను పెంచినటువంటి ఘనత సీపీఐ(ఎం) ప్రజా ప్రతినిధులకు ఉందని పోతినేని సుదర్శన్ పేర్కొన్నారు. నేడు చట్టసభలన్నీ కార్పొరేట్ పెద్దల సభలుగా మారిపోయాయని, ప్రజా సమస్యలు చర్చకు రావడం లేదని పేర్కొన్నారు. చట్టసభల విలువలను బీజేపీ దిగజారుస్తుందని విమర్శించారు. చట్టసభల్లో సీపీఐ(ఎం) కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం ఉంటే అది ప్రజాస్వామ్యానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ శాసనసభలో సీపీఐ(ఎం) అడుగుపెట్టే విధంగా కృషి చేయాలని, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం గెలిపించడం ద్వారా ఈ నియోజకవర్గ అభివృద్ధిని ముందుకు తీసుకుపోవాలని పార్టీ శ్రేణులకు పోతినేని విజ్ఞప్తి చేశారు. ఈ వర్ధంతి సభలో పార్టీ జాతీయ నాయకులు ఎం.సాయిబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కారం పుల్లయ్య, కే.బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, సున్నం గంగ, ఎలమంచిలి వంశీ, దొడ్డ రవి, అన్నవరపు సత్యనారాయణ, చంద్రయ్య, ములుగు జిల్లా నాయకులు రత్నం, రాజేందర్, కుమ్మరి శీను, కొప్పుల రఘుపతి, గ్యానం వాసు తదితరులు పాల్గొన్నారు.

బోడెపూడి, దంతులూరి ఆశయాలు కొనసాగిస్తాం

మణుగూరు : పేదల బాంధవుడు బోడెపుడి వెంకటేశ్వరరావు, మణుగూరు ప్రాంతంలో సీపీఐ(ఎం) పార్టీ వ్యవస్థాపకులు దంతులూరి నరసింహరాజు ఆశయాలు కొనసాగిస్తామని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొడిశాల రాములు అన్నారు. శనివారం శ్రామిక భవనంలో దంతులూరి, బోడేపూడి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రామిక వర్గం ఐక్యత కోసం కృషి చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయడమే ఆదర్శ కమ్యూనిస్టులు సమస్యల పైన నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడు బోడెపూడి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నందం ఈశ్వరరావు, రంగా, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మణుగూరులో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఏజెన్సీ ప్రాంత రైతులకు తనఖా రుణాలు



నవతెలంగాణ-దమ్మపేట

గత మూడేండ్లుగా ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు వ్యవసాయ, విద్యా ఋణాలు అందక ఇబ్బందులు పడుతున్నారని జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు రావు జోగేశ్వరరావు అన్నారు. ఇట్టి ఇబ్బందులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, వ్యవ సాయ సహకార శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షులు పల్లా రాజేశ్వరరెడ్డి, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుల దృష్టికి తీసుకువెళ్లినట్లు వారు తెలిపారు. ఈ ఇబ్బందులను గుర్తించి దీనిపై ధరణి పోర్టల్‌లో బ్యాంక్ తనఖా ఆప్షన్ కల్పించారు. ఇక నుండి ఏజెన్సీ ప్రాంతంలోని వ్యవసాయ భూములకు తనఖా ద్వారా ఆయా రైతులకు వ్యవసాయ, విద్యా ఋణాలు పొందడానికి అవకాశం కలిగినదని ఇప్పటి నుండి అధిక వడ్డీతో ప్రయివేటు ఋణాలు తీసుకోవలసిన ఇబ్బందులు రైతులకు తొలగిపోయాయని, రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోగలరని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వ సభ్య సమావేశానికి అధికారులు డుమ్మా

- పని చేయడం చేతకాకపోతే మండలానికి రాకండి : ఎంపీపీ



నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల కేంద్రంలో రైతు వేదిక నందు ఎంపీపీ సున్నం లలిత అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి అన్ని శాఖ అధికారులు వస్తారు, మండలంలోని ప్రజా సమస్యలు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం అయ్యే విధంగా చూస్తారని అనుకున్న మండల ప్రజలకు నిరాశే ఎదురైంది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ముఖ్యంగా విద్యుత్ శాఖ, రోడ్డు రవాణా శాఖ, అగ్రీ కల్చర్, అటవీ శాఖ, ఎక్సైజ్ శాఖ పలు శాఖ అధికారులు ఎవరూ రాకపోవడం, కనీసం వారు ఎంపీపీ అనుమతి కూడా తీసుకోలేదని, వారు వచ్చే సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు అయితే వారికి నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. మండల అధికారులు, పాఠశాలలు ప్రిన్సిపాల్స్ సంబధిత ఉన్నత అధికారులు మాత్రమే సమావేశానికి రావాలని, కానీ కొంత మంది అధికారులు, కింది స్థాయి అధికారులు పంపిస్తూన్నారని, వారికి సమస్యలు పై అవగాహన లేక మాట్లాడలేక పోతున్నారన్నారు. వచ్చే సమావేశానికి ఖచ్చితంగా సంబధిత శాఖ అధికారులు మాత్రమే రావాలని అన్నారు. రోడ్లు భవనాలు శాఖ ఏఈ లకన్ నాయక్ పై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రాజపురం-మద్రిగుడెం గ్రామాల మధ్య గల వాగుకు వంతెన గురించి ఎంపీపీ అడగగా ప్రపోజల్ పంపించామని ఏఈ చెప్పడంతో ఎప్పటి నుండో అదే చెపుతున్నారని, రైతులు వంతెన లేక వర్షాకాలంలో అనేక సమస్యలు ఎదుర్కుంటుంటే కనీసం ఎంపీపీ దృష్టికి ఇంతవరకు తీసుకు రాలేదన్నారు. పని చేయడం చేతకాక పోతే మండలంలో ఎందుకు ఉంటున్నారన్నారు. మండలంలో సీతారామ ప్రాజెక్ట్ కాలువ పనులు కోసం రోడ్లు తీసివేశారని, వర్ష కాలంలో చిన్న వర్షాలకు కూడా రైతులు పొలాలు దగ్గరకు వెళ్లేందుకు అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారన్నారు. మండలంలో అనేక సమస్యలు వున్నా కొంత మంది సర్వ సభ్య సమావేశానికి రాకుండా ఉంటున్నారని, సమస్యలు వినిపించకుండా ఎలా పరిష్కారం అవుతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ భారత లాలమ్మ(లావణ్య), వైస్ ఎంపీపీ రామారావు, ఎంపీడీఓ అన్నపూర్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వేతనాలను పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయాలి

- వంటవార్పు కార్యక్రమంలో జేపీసీ



దమ్మపేట



ఆళ్లపల్లి

నవతెలంగాణ-ఇల్లందు

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను పెంచి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింప చేసే విధంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనురాధ, ఐఎఫ్టియు జిల్లా ప్రధానకార్యదర్శి కొక్కు సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శనివారం ఇల్లెందు ఎండీఓ కార్యాలయం ముందు సమ్మె శిబిరం వద్ద శనివారం ఏర్పాటు చేసిన వంటవార్పు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్మికుల సమ్మె నెల రోజులు దాటిపోయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించకుండా దున్నపోతు మీద వర్షం పడిన చందంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కో-కన్వీనర్ జటంగి వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సీతారామయ్య, రాష్ట్ర నాయకులు మాద వశెట్టి నాగేశ్వరరావు, బానోత్ రామ్సింగ్, జిల్లా నాయకులు రామిశెట్టి నరసింహారావు, సీఐటీయూ డివిజన్ నాయకులు శంకర్, మన్యం మోహన్ రావు, మండలం జేఏసీ చైర్మన్ తొగర సామెల్, రామల్ల మోహన్ రావు, తాండ్ర కిరణ్, కారంగుల కిరణ్, గోపి, ఆర్కే, రంజిత్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి జీపీ కార్మికుల నిరసన

దమ్మపేట గ్రామపంచాయతీ కార్మికుల 31 రోజు సమ్మెలో భాగంగా శనివారం వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కార్మికులు నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు పస్తులతో సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వం పట్టించు కోవటం లేదని, ఈ రోజుతో అసెంబ్లీ సమావేశాలు ముగుస్తున్నాయని, సాయంత్రం కల్లా ప్రభుత్వం మాకు ఒక నిర్ణయం తెలియపరచకుంటే ఈ ట్యాంకు లు పైనుండే ఎక్కి దూకి ప్రాణ తర్పణ చేస్తామని, మా ఉసురు, మా కుటుంబాల ఉసురు ఈ రాష్ట్ర ప్రభుత్వానికి తగిలి నశించి పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 31 గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెకు ఆశాల సంఘీభావం

ఆళ్ళపల్లి మండల కేంద్రములో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెకు శనివారం మండలంలోని సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్ల సంఘం పూర్తి మద్దతు తెలిపి, సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు సుగుణ, సీతాదేవి, కావేరి, తదితరులు, ఆళ్ళపల్లి పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరమ ప్రభుదాస్, మల్కాపురి శేఖర్, ప్రమీల, ముసలయ్య ఏలియా, కుమారి, తదితరులు పాల్గొన్నారు.



రుణమాఫీతో అన్నదాతల్లో ఆనందోత్సవాలు

- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

సీఎం కేసీఆర్ రూ.1 లక్ష రుణమాఫీతో అన్నదాతల్లో ఆనందోత్సవాలు వెల్లివిరుస్తున్నాయని జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ చేసిన కేసీఆర్‌కు సొసైటీ సభ్యుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేసీఆర్ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. రైతు రుణమాఫీతో పాటు రైతు బంధు, రైతు భీమా, ప్రభుత్వం మద్దతు ధరకు వరి ధాన్యం కొనుగోలు, 24 గంటల ఉచిత విద్యుత్‌ను రైతులకు అందిస్తున్న మహోన్నత వ్యక్తి కేసీఆర్ అని కొత్వాల అన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మెన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామమోహన్రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, సామా జనార్దన్ రెడ్డి, జరబన సీతారాంబాబు, మైనేని వెంకటేశ్వరరావు, బర్ల వెంకటరమణ, సీఈవో జి.లక్ష్మీనారాయణలి తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా మెడికల్ ట్రస్ట్ బోర్డు నిర్ణయాలు సింగరేణిలో అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మంద



నవతెలంగాణ-కొత్తగూడెం

కోల్ ఇండియాలో జేబీసీసీఐ నిర్ణయం ప్రకారం కోల్ ఇండియా మెడికల్ ట్రస్ట్ బోర్డు సమావేశం శనివారం కోల్‌కత్తాలో జరిగింది. ఆ సమావేశంలో సీఐటీయూ తరపున వి.ఎం.మనోహర్ పాల్గొన్నారు. దానిలో జరిగిన నిర్ణయాలను ఫోన్ ద్వారా తెలియజేసిన ప్రకారం మెడికల్ స్కీమ్‌లో చేరదలుచుకున్న వారికి చివరి అవకాశంగా ఈ సంవత్సరం 31డిసెంబర్ 2023 వరకు అవకాశం కల్పించారు. ఆ అవకాశాన్ని సింగరేణిలో కూడా అమలు చేయటానికి సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ విడుదలను వెంటనే విడుదల చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మంద నరసింహారావు పేర్కొన్నారు. దీంతో పాటు సీరియస్ జబ్బులు అయినటువంటి వాటికి రూ.8 లక్షలతో నిమిత్తం లేకుండా ప్రత్యేకంగా ఎంత ఖర్చైనా అంత భరించే పద్ధతిలో అగ్రిమెంట్ జరిగిందన్నారు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎనిమిది లక్షలతో లింకు పెట్టకుండా హార్ట్, పెరాలసిస్, కిడ్నీస్, క్యాన్సర్, ఎయిడ్స్, యాక్సిడెంట్, మోకాలు చిప్పలు అరుగుదల తదితర జబ్బులకు అయ్యే పూర్తి ఖర్చులను ఈ స్కీం కింద భరించే పద్ధతులు అగ్రిమెంట్ అయినందున అందుకు అనుగుణంగా సర్క్యులర్ జారీ చేసి వెంటనే దీనిని కూడా అమలు చేయాలని సింగరేణిలో ప్రత్యేకమైన ట్రస్ట్ బోర్డులో కూడా అన్ని అంశాలను ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా తూచా తప్పకుండా అమలు చేయాలని ఆయన కోరారు.

మణిపూర్ ఘటన బాధాకరం

దుమ్ముగూడెం : మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరిగిన ఘటన బాధాకరమని ఆదివాసీ ఐక్యవేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తెల్లం హరికృష్ణ అధ్యక్షతన ములకపాడు గ్రామంలో ఆదివాసీ ఐక్యవేదిక ఆధర్యంలో మణిపూర్‌లో జరిగిన దుశ్చర్యను ఖండిస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. ఈ నెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మండల వ్యాప్తంగా వేడుకగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు కొమరం దామోదర్‌రావు, సోంది మల్లారు, కణితి రాముడు, సరియం భీమ్, పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మీ, కొమరం చంటి, కామరాజు, మడకం భారతి, వాగె రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానం

చంద్రుగొండ : తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ అంగన్వాడీ ఉపాధ్యాయురాలు బానోత్ అరుణ అన్నారు. శనివారం చంద్రుగొండ ప్రాజెక్ట్ సెక్టార్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గ్రామంలో తిరుగుతూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలింతలకు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పి.భూషమ్మ, సుజాత, సరోజిని, బానోతు విజయలక్ష్మి, బి.అరుణ, మీనాక్షి, గర్భిణీలు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ పార్క్‌ను అమరవీరుల స్మృతివనంగా ప్రకటించాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమంలో కొత్తగూడెం ప్రాంతం, మరీ ముఖ్యంగా సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలలో పాల్గొన్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్ గుర్తు చేశారు. తెలంగాణ అమరవీరుల స్మృతికి చిహ్నంగా కొత్తగూడెం బస్టాండ్ వద్ద గల చిల్డ్రన్స్ పార్క్‌ను అమరవీరుల స్మృతివనంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ శ్రేణులతో కలిసి శనివారం సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదురుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ 1969వ సంవత్సరంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో కొత్తగూడెంలో ఇద్దరు వ్యక్తులు అమరులయ్యారని గుర్తు చేశారు. అదేవిధంగా మలిదశ ఉద్యమంలో సైతం కార్మిక ప్రాంతమైన కొత్తగూడెం చిరస్మరణీయమైన పోరాటాలు చేసిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల కోసం సింగరేణి యాజమాన్యం ఏదైనా ఒక కార్యచరణ రూపొందిస్తే బాగుంటుందని వేచి చూశామని అలాంటిదేమీ జరగకపోవడం శోచనీయమన్నారు. ఉద్యమంలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలి ప్రత్యేక రాష్ట్రం ఆకాంక్షను తమ ఆత్మ బలిదానాలతో ప్రపంచానికి చాటిన అమరవీరుల త్యాగాలను మరిచిపోవద్దన్నారు. అనంతరం జీఎం వెల్ఫేర్ బసవయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున రావు, సాయి, జిల్లా కార్యదర్శులు మాలోత్ వీరు నాయక్, చెనిగారపు నిరంజన్ కుమార్, సిద్ధంకి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
www.navatelangana.com
9
ఖమ్మం
ఆదివారం 6 ఆగస్టు 2023

స్నేహం అంతులేనిది..

స్నేహం ఓ మధురమైన అనుభూతి. దీనికి వయసుతో నిమిత్తం లేదు. ఆటపాటలాడే బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు అందరిలో స్నేహ భావం ఉంటుంది. అటువంటి స్నేహానుభూతి అనుభవిస్తేనే తెలుస్తుంది. సృష్టిలో నా అనేవారు, బంధువులు లేని వారు ఉంటారేమేగాని స్నేహితులు లేని వారుండరు. ఇంట్లో చెప్పలేని సమస్యలు, బాధలు సైతం వీరితో ఎటువంటి దాపరికం లేకుండా చెప్పుకొని ఓదార్పు పొందుతాం. అందుకే స్నేహానికి, స్నేహితునికి అంత ప్రాధాన్యం. అదే నిజమైన స్నేహం... స్వచ్ఛమైన స్నేహం. ఈరోజు స్నేహితుల దినోత్సవం సందర్భంగా కొందరి స్నేహానుభావాలను తెలుసుకుందాం...

- పాలపర్తి సంధ్యారాణి



అన్నీ తానే అయ్యింది



మా నాన్న పెరు వి.కె రావు. సిబాక కంపెనీలో రెప్రసెంటిటివ్‌గా పని చేసేవారు. అమ్మ పేరు ఉమ. నాకొక అక్క ఉంది. నేను పుట్టింది చెన్నైలో. అయితే నటిని కావడంతో అనేక ప్రాంతాలకు వెళుతుండేదాన్ని. అందుకే స్నేహితులంటూ ప్రత్యేకంగా ఎవరూ లేరు. అదేమి విచిత్రమో కానీ హైద్రాబాద్ వచ్చాక నేను ఉంటున్న ఫ్లాట్‌కి ఎదురుగా ఒకరు పరిచయం అయ్యారు. ఆవిడ పేరు ధరణి. నన్ను చూసి చాలా ఆశ్చర్య పోయింది. సంతోషంతో తనకు నోటా మాట రాలేదు. చాలా కలుపు గోలు మనిషి. నాకు హైద్రాబాద్‌లో ఎవరూ తెలియదు, బైటకు వెళ్లాలన్నా ఎలా వెళ్లాలో తెలియదు. తాను పరిచయం అయినప్పటి నుండి చాలా సహాయంగా ఉండేది. వాళ్ళ ఇంట్లో ఏ వంట చేసినా నాకు తెచ్చి పెట్టేది. పండగలకు తప్పకుండా నన్ను పిలిచేది. వారి ఇంటికి ఎవరు వచ్చినా నన్ను పరిచయం చేస్తూ ఉండేది.

ఇంట్లో ఒక్కదాన్నే ఉండాలంటే నాకు భయం. మా వారు ఊళ్ళో లేనప్పుడు నేను ఎక్కువగా తన దగ్గరే, మా డాగీతో సహా ఉండేదాన్ని. నాకు ఆరోగ్య సమస్యలు వస్తే తనే దగ్గరుండి చూసుకునేది. నాకు ఏమీ తోచనప్పుడు వాళ్ళ ఇంటికి వెళ్తే, నా కోసం ఏదైనా చేసి పెట్టేది. హైద్రాబాద్‌లో ఎవరూ లేరని అనుకుంటున్న నాకు బంధువు కంటే ఎక్కువగా చేరదీసి, అనుక్షణం నాకు ఏ సహాయం కావాలనా చేసి పెట్టె స్నేహితురాలు దొరికింది. అందుకే అంటారు ఎప్పుడు ఎక్కడ ఎవరితో అనుబంధం ఎర్పడుతుందో తెలియదు అని.

- పూర్ణిమ, సినీ నటి

వయసుతో పని లేదు



నాన్న పేరు సాంబశివరావు, రామారావుగారి దగ్గర స్టంట్ మాస్టర్. అమ్మ సీతారావమ్మా, గృహిణి. నాకు ఇద్దరు అక్కలు, ఒక తమ్ముడు. నేను చిన్నప్పటి నుంచే నటించడం ప్రారంభించాను. ఎందరో సినీ కళాకారులు మా ఇంటి చుట్టు పక్కల ఉండేవారు. మా ఇంటికి ఒక ఇల్లు విడిచి ఝాన్సీ ఉండేవారు. తరచూ మా ఇంటికి వచ్చేవారు. అమ్మను వదిన అని, నాన్నను అన్నయ్య పిలిచేవారు. నేను వయసులో ఆమెకంటే చాలా చిన్న దాన్ని. అయినా మా ఇద్దరి మధ్య ఒక ఆత్మీయతతో కూడిన అనుబంధం ఉండేది. నాకు ఆపిల్స్ అంటే చాలా ఇష్టం. మా ఇంటికొచ్చినప్పుడల్లా ఆపిల్స్ తెచ్చి నాకిస్తూ నీ బుగ్గల్లాగా ఉన్నాయి అనేవారు. అప్పుడు నాకు బుగ్గలు బాగా ఉండేవి. అలాగే ఆవిడ షూటింగ్స్‌కి వెళ్లేటపుడు నన్ను చూసి కానీ వెళ్లేవారు కాదు. నేను ఆవిడ కలిసి ఎన్నో సినిమాల్లో నటించాం. షూటింగ్ సమయాల్లో నన్ను దగ్గర కూర్చోపెట్టుకుని అన్నం తినిపించేవారు. ఆవిడతో నా అనుబంధం దాదాపు 50 ఏండ్లది. నా పెండ్లి తర్వాత మా మధ్య కొన్నాళ్ళు కాంటాక్ట్ లేవు. నేను హైద్రాబాద్ వచ్చాక నా గురించి తెలుసుకుని నెంబర్ సంపాదించి ఫోన్ చేసారు. ఎంతో సంతోషించాను. 'మా ఇంటికి ఒకసారి వస్తావా' అని అడిగారు. 'తప్పకుండా వస్తాను' అని వెళ్లాను. అప్పటి నుండి తరచూ వెళ్లి వస్తుంటాను. నేను వెళ్తే ఆవిడకు ఎన్నో జ్ఞాపకాలు. గంటలు గంటలు మాట్లాడుకుంటూ ఉంటాము. భోజనం పెట్టకుండా పంపరు. చిన్నప్పటి నుండి ఆమెను నేను అత్తా అని పిలిచినా నాకెప్పుడూ ఆమె స్నేహితురాలే. ఎప్పుడు మొదలైనా, ఎలా మొదలైనా, మొదలైన పరిచయం మనసును తాకితే అదే స్నేహం.

- బేబీ రాణి, సీనియర్ నటి

స్వార్థం లేనిదే స్నేహం



నాన్న గారి పేరు వరప్రసాద్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవి విరమణ పొందారు. అమ్మ ప్రభావతి గృహిణి. వారికి మేము ముగ్గురం ఆడ పిల్లలం. నాకు ఇద్దరు అక్కలు. నేను పుట్టింది పెరిగింది, చదివింది హైద్రాబాద్‌లోనే. పదవ తరగతి వరకు రాజేంద్రనగర్‌లోని భారతీయ విద్యాభావన్‌లో చదువుకున్నాను. నా బెస్ట్ ఫ్రెండ్ నాజియా. 10వ తరగతి వరకు ఇద్దరం కలిసి చదువుకున్నాం. వేసవి సెలవులు రాగానే పొద్దున్నే ఇద్దరం లంచ్ బాక్సులు పట్టుకుని సైకిళ్ళు వేసుకుని రాజేంద్రనగర్ చుట్టుపక్కల తిరేగేవాళ్ళం. మధ్యాహ్నం ఎక్కడో ఒక చెరువు గట్టున, చెట్లకిందనో కూర్చుని తెచ్చుకున్న లంచ్ బాక్స్‌లోని భోజనాన్ని ఇద్దరం పంచుకుని తినేవ్వాం. సాయంత్రం వరకు తిరిగి ఇంటికి చేరుకునే వాళ్ళం. ఇంటర్ వేరు వేరు కాలేజీ ల్లో చేరినప్పటికీ తరచూ కలుస్తూ ఉండే వాళ్ళం. నేను ఎంబీఏ చేసాను. తను సైకాలజీ చదివింది. సాఫ్ట్ వేర్ కోర్సులు కూడా చేసింది. ప్రస్తుతం బెంగళూర్‌లో టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది.

ఇద్దరం భోజన ప్రియులం. ఇంట్లో అబద్దం చెప్పి బైట తినడానికి వెళ్లిపోయేవాళ్ళం. ఏ రోజూ మేము ఒక్క మాట అనుకుని ఎరుగము. తాను చాలా మృదుస్వభావి, సున్నిత మనస్కురాలు. తనకు సినిమాలంటే చాలా ఇష్టం. ఏ సినిమా వదిలేది కాదు. నేను సినిమాలు అసలు చూడను. నాకు సినిమాలు ఇష్టముండవని సినిమాకి రమ్మని నన్ను ఎప్పుడూ అడిగేది కాదు. స్నేహం అంటే రోజు పలకరించుకోవడాలు, కబుర్లు చెప్పుకోవడాలు కాదు. వాళ్లకు ఏదైనా సమస్య వచ్చినా, కష్టం ఉన్నా అండగా నిలబడటం. అలాగే రోజూ మాట్లాడితినే స్నేహం లేకుంటే లేదు అని కూడా అనుకోకూడదు. వృత్తి రీత్యా తీరుబడి లేక పోయినా తప్పనిసరిగా సమయం తీసుకుని 15 రోజుల కొకసారి మాట్లాడుకుంటాం. తాను ఎప్పుడైనా డిస్టర్బ్‌గా ఉంటే 'పూరి నువ్వు బాగా గుర్తుకు వచ్చావు, నీతో మాట్లాడాలి' అంటూ ఫోను చేస్తుంది. అది మా స్నేహంలోని స్వచ్ఛత. ఒక్కోసారి ఉండలేక నేనే సడన్‌గా తనకు ఫోన్ చేస్తుంటా. నేను ఫోన్ చేసినప్పుడు అనిపిస్తుంది తనకు నా అవసరం ఉంది, అందుకే బాగా గుర్తుకు వచ్చింది అని. అపుడు తాను ఎన్నో విషయాలు నాతో పంచుకుని స్వాంతన పొందుతుంది.

- పూర్ణిమ, న్యూస్ రీడర్

మనసు నొప్పించకుండా...

అప్పటి వరకు అమ్మా నాన్న వెంటే తిరిగిన పిల్లలు... టీనేజ్ వచ్చాక స్వతంత్రంగా వ్యవహరిస్తుంటారు. దాంతో తల్లిదండ్రులకు తమ మాట వినట్లేదని ఒకింత బాధగానే ఉంటుంది. తమని పట్టించుకోవట్లేదనీ ఫీలవుతుంటారు. ఆంక్షలు విధిస్తుంటారు. టీనేజ్ పిల్లలున్న ప్రతి ఇంట్లో ఈ పరిస్థితులు సర్వసాధారణంగా కనిపిస్తూనే ఉంటాయి. అయితే పిల్లలు నొచ్చుకోకుండా వారి మనసు మారాలంటే ఇలా చేసి చూడండి...

అభినందించడం

ఎదిగిన పిల్లలు మీ చెప్పుచేతుల్లో ఒదిగి ఉండాలని అనుకోవడం సరికాదు. 'మీకేం తెలుసు' అని తీసిపడేసినట్టుగా చూస్తే పిల్లల్లో పౌరుషం పొడుచుకొస్తుంది. టీనేజ్ వయసులో పిల్లలు స్వతంత్రంగా వ్యవహరించాలని భావిస్తుంటారు. వారి ఎదిగే వయసును గుర్తించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. మీ ఇంటి చర్చల్లో వారిని భాగస్వాములను చేయండి. వారిచ్చే సలహాలు పూర్తిగా వినండి. అవి మంచివైతే అభినందించండి. 'నీకెందుకు నువ్వెళ్లి చదువుకో.. మేం చూసుకుంటా' అని అంటే నొచ్చుకుంటారు. ఇదే మాట ప్రతి సారీ అంటుంటే 'నా మాటకు విలువ ఇవ్వనప్పుడు.. మీ మాట నేనెందుకు వింటాను' అని పిల్లలు మిమ్మల్ని ఎదిరించవచ్చు.

కలివిడిగా ఉండండి

కాలేజ్ వయసులో పిల్లలకు స్వేచ్ఛనిస్తే వారెక్కడ దారి తప్పుతారో అని కాస్త కట్టుదిట్టం చేస్తుంటారు. ఇది సరికాదు. అయితే పిల్లలకు మితిమీరిన స్వేచ్ఛ ఇవ్వడం, ఎక్కవ ఆంక్షలు విధించడం రెండూ కరెక్ట్ కాదు. ఈ రెండూ పిల్లల మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతాయి. స్వేచ్ఛకు కొన్ని పరిమితులు ఉంటాయని వారు అర్థం చేసుకునేలా చెప్పండి. వారికంటూ ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించండి. ఫ్రెండ్స్‌ను ఇంటికి తీసుకురమ్మనండి. వారి స్నేహితులతో మీరూ కలివిడిగా ఉండటానికి ప్రయత్నించండి. మీ అనుభవంతో ఆ ఫ్రెండ్స్ ఎలాంటి వారో ఇట్టే తెలిసిపోతుంది. చెడుసావాసం చేస్తున్నట్టు అనిపిస్తే అలాంటి వారితో స్నేహం అంత మంచిది కాదని హితవు పలకండి. మొదట్లో అర్థం చేసుకోకపోవచ్చు. కానీ నెమ్మదిగా మీ మాటల్లోని ఆంతర్యాన్ని గ్రహించగలుగుతారు.



ప్రోత్సహించండి

పిల్లలను ఇతరులతో పోల్చకండి. ఇతరులు సాధించిన విజయాలను మీ పిల్లలకు స్ఫూర్తినిచ్చేలా చెప్పడంలో తప్పులేదు. కానీ మీ పిల్లలను వారితో పోల్చడం మంచిది కాదు. ఈ పద్ధతి ఎక్కువ కాలం కొనసాగితే కొన్నాళ్లకు కొరకరాని కొయ్యల్లా తయారవుతారు. ఎదుటివారి గుణగుణాలను మెచ్చుకునే ముందు మీ పిల్లల్లో ఉన్న శక్తి సామర్థ్యాలు గుర్తించండి. వారికి ఎందులో అసక్తి ఉందో తెలుసుకుని ప్రోత్సహించండి.

స్నేహం పదిలంగా...

ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితులు తప్పనిసరిగా ఉంటారు. ఇలాంటి స్నేహ బంధాన్ని చాటడానికి ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవంగా జరుపుకుంటారు. నిజమైన స్నేహం అనేది ఇద్దరు వ్యక్తులు నిర్మించడానికి సిద్ధంగా ఉన్న నిస్వార్థ సంబంధం. ఇది చిత్తశుద్ధి, ఆసక్తులు, సానుభూతిపై ఆధారపడి ఉంటుంది. ఏర్పడిన స్నేహాన్ని పదికాలాల పాటు పదిల పరుచుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. బంధాలన్నింటిలో స్నేహానికి మించింది లేదంటారు. అందుకే 'స్నేహమేరా జీవితం, స్నేహమేరా శాశ్వితం' అంటాడు సినీ గీత రచయిత. మరి అలాంటి స్నేహ బంధం ఎప్పటికీ విచ్ఛిన్నం కాకుండా ఎల్లకాలం కొనసాగాలంటే ఏం చేయాలో చూద్దాం...

స్నేహం నమ్మకంతో నిర్మించబడింది. కాబట్టి స్నేహం మొదటి నియమం అబద్ధాల నుండి దూరంగా ఉండడం. స్నేహితులకు ఎప్పుడూ అబద్ధం చెప్పకూడదు. ఎవరితోనైనా స్నేహం చేస్తున్నప్పుడు మీ ఇద్దరి మధ్య అబద్ధాలకు అసలు చోటే ఉండకూడదు. ఏ సంబంధాన్ని అయినా అబద్ధాలు వచ్ఛిన్నం చేస్తాయనేది గుర్తు పెట్టుకోవాలి.

డబ్బును స్నేహానికి దూరంగా ఉంచండి

స్నేహ సంబంధం నిస్వార్థంగా ఉండాలి. స్నేహితుల నుండి ఎప్పుడూ ప్రయోజనం పొందాలని ఆశించకూడదు. మీకు ఆర్థిక సహాయం అవసరం కావచ్చు, కానీ స్నేహంలోకి డబ్బు తీసుకురావద్దు. ఎందుకంటే మీరు మీ ఆర్థిక అవసరాల కోసం స్నేహితులపై ఆధారపడితే అది మీ స్నేహానికి మంచిది కాదు.

విషయాలను దాచిపెట్టొద్దు

చాలా మంది దొస్తులు తమ హృదయంలో ఉన్న ప్రతి విషయాన్ని స్నేహితులతో పంచుకుంటారు. కానీ మీరు మీ స్నేహితుల నుండి విషయాలను దాచడం ప్రారంభించినప్పుడు మీ స్నేహం దూరం అవుతుందని గుర్తించండి. మీ స్నేహితులు మీ గురించి మరొకరి నుండి తెలుసుకుంటే అది మీ స్నేహ బంధానికి అసలు మంచిది కాదు.

సహాయానికి వెనుకడుగు వేయకండి

కష్టసుఖాలలో స్నేహుతులకి మద్దతు ఇవ్వడం నిజమైన స్నేహానికి నిదర్శనం. స్నేహితులకి మీ అవసరం ఉన్నప్పుడు, సహాయం చేయడంలో వెనక్కి తగ్గకండి. మీకు సాధ్యమైనంత వరకు వారికి సాయం చేస్తాననే వాగ్దానం ఇవ్వాలి. ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. స్నేహితులకు సహాయం చేసే శక్తి మీ దగ్గర లేకపోవచ్చు. కానీ మీ స్నేహితునికి ఆ సమయంలో మానసికంగా బలహీనంగా, ఒంటరిగా అనిపించేలా చేయవద్దు. ఇలాంటి సంఘటనలు మీ స్నేహాన్ని మరింత బలహీనపరుస్తాయి.

గుజరాత్ బీజేపీలో అసమ్మతి

(మొదటిపేజీ తరువాయి)

చెప్పడానికి ఇష్టపడని బీజేపీ నాయకుడొకరు ఆ పత్రికకు చెప్పారు. పార్టీ నాయకత్వంతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని వాఘేలా ప్రయత్నించారని, అయితే అది ఫలించలేదని, దీంతో గత నెల 31న ఆయన రాజీనామా చేశారని ఆ నాయకుడు వివరించారు. పార్టీకి చెందిన మరో ప్రధాన కార్యదర్శి భార్గవ్ భట్‌ను కూడా ఇలాగే సాగనంపారు. ఆయనను పార్టీ పదవి నుండి వైదొలగాల్సిందిగా ఏప్రిల్‌లో ఆదేశించారు.లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్‌పై పలువురు నాయకులు తిరుగుబాటు చేయడం బీజేపీని కలవరపరుస్తోంది. పాటిల్‌కు వ్యతిరేకంగా గళం విప్పిన వారిని పార్టీ నుండి బయటికి సాగనంపే కార్యక్రమం కొనసాగుతోంది. అందులో భాగంగానే గతంలో భార్గవ్ భట్‌ను, ఇప్పుడు ప్రదీప్‌సింగ్ వాఘేలాను బయటికి పంపారు. పార్టీ నాయకులకు పదవులు కట్టబెట్టి, అందుకు ప్రతిఫలంగా వారి నుండి లంచం తీసుకున్నారంటూ పాటిల్‌పై ఆరోపణలు చేసినందుకు ముగ్గురు కార్యకర్తలను ఇటీవలే సూరత్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వాఘేలా 2016 ఆగస్ట్ 10న రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

మణిపూర్‌లో మళ్లీ హింస

(మొదటిపేజీ తరువాయి)

గ్రామస్తులు నిద్రిస్తున్న సమయంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి, కత్తులతో పొడిచి చంపారని పోలీసులు తెలిపారు. దాడి చేసిన ఉగ్రవాదులు చురచంద్‌పూర్ నుండి వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. కొండలు, లోయల మధ్య, కేంద్ర భద్రతా బలగాలు నిర్వహించబడుతున్న బఫర్‌జోన్‌ను ఉగ్రవాదులు ఉల్లంఘించి, దాడి చేశారని తెలిపారు. మరణించిన ముగ్గురూ రిలీఫ్ క్యాంపులో ఉండేవారు. పరిస్థితి మెరుగుపడిందని భావించి, శుక్రవారం తమ నివాసాలకు తిరిగి వచ్చారు. అంతలోనే ఈ ఘోరం జరిగిందని పోలీసులు చెప్పారు. హత్యలకు ప్రతీకారాంగా బిష్ణుపూర్ జిల్లా ఉఖా తంపక్‌లో కుకీలకు చెందిన ఇళ్లను ఒక మూక తగలబెట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరో ఘటనలో రాష్ట్ర బలగాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు సహా ముగ్గురు గాయపడ్డారు. వారిని ఇంఫాల్‌లోని రాజ్ మెడిసిటీకి చికిత్స నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు. బిష్ణుపూర్‌లోని నారస్సేనా ప్రాంతాలోని రెండో భారత రిజర్వు బెటాలియన్ (ఐఆర్‌బి) ప్రధాన కార్యాలయంలోని పోలీసు ఆయుధాగారంపై గురువారం రాత్రి దాడి చేసి భారీగా ఆయుధాలను ఎత్తుకెళ్లారు.

కర్ఫ్యూ వేళల కుదింపు

తాజా ఘటనల నేపథ్యంలో ఇంఫాల్‌లోని రెండు జిల్లాల్లో కర్ఫ్యూ సడలింపు సమయాన్ని ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకు కుదించారు. గతంలో ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ కర్ఫ్యూ సడలింపు ఉండేది.

ప్రభుత్వ సంస్థలు ఏమి చేస్తున్నాయి : ఐటీఎల్ఎఫ్

హింసను అరికట్టేందుకు ప్రభుత్వ సంస్థలు ఏమి చేస్తున్నాయో తెలుసుకోవాలని అనుకుంటున్నామని ఆదివాసీ గిరిజన నాయకుల ఫోరం (ఐటిఎల్ఎఫ్) ఒక ప్రకటనలో పేర్కొంది. మూడు నెలలుగా ప్రభుత్వం పంపించిన తుపాకులను, ఆయుధాలను దోచుకుంటున్నా, భద్రతాపరమైన ఉద్రిక్తతలకు పాల్పడుతున్నా ఎందుకు నివారించలేకపోతున్నారని రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఇంఫాల్ లోయ సహా పలు ప్రాంతాల్లో 24 గంటల సమ్మె

27 అసెంబ్లీ నియోజకవర్గాల కో-ఆర్డినేషన్ కమిటీ 24 గంటల సమ్మెకు పిలుపునిచ్చింది. దీంతో, ఇంఫాల్ లోయసహా దాదాపు అన్ని ప్రాంతాల్లో శనివారం దుకాణాలు, వ్యాపార సముదాయాలు మూసివేశారు.

9నుంచి సీపీఐ(యం-యల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్ కేంద్ర కమిటీ సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఐ(ఎంఎల్) రెవల్యూషనరీ ఇనిషియేటివ్ కేంద్ర కమిటీ సమావేశాలు ఈ నెల 9,10న హైదరాబాద్‌లో జరగనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి 13 రాష్ట్రాల నుంచి 25 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్టు తెలిపారు. దేశంలో బీజేపీ అనుసరిస్తున్న తీరుపై సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు.

విభజించి...పాలించి ఓట్లు దండుకునే యత్నం

(మొదటిపేజీ తరువాయి)

అక్కడ హింస చెలరేగుతున్నదని చెప్పారు. అక్కడ చోటుచేసుకున్న ఘటనలు దారుణమని పేర్కొంటూ ఆ పరిణామాలను తీవ్రంగా ఖండించారు. శనివారం శాసనమండలిలో 'రాష్ట్రంలో గిరిజన సంక్షేమం-పోడు భూములకు పట్టాల పంపిణీ'అనే అంశంపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు గిరిజన తెగల మధ్య కొట్లాట పెట్టించి మొత్తం ప్రభుత్వ యంత్రాంగం నిలబడి చూస్తున్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఇది చాలా దారుణమనీ, అందరూ దీన్ని ఖండించాలని కోరారు. అన్ని జాతులూ బాగుపడాలని బీఆర్ఎస్ కోరుకుంటుంటే విభజించి పాలించి ఓట్లు దండుకోవాలన్న ప్రయత్నం కేంద్రంలోని బీజేపీ చేస్తోందని అన్నారు. కానీ ఐక్యతే తమ పార్టీ సిద్ధాంతమని ఆమె స్పష్టం చేశారు. గిరిజనుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని వివరించారు. అటవీ హక్కుల చట్టాన్ని కేంద్రం కాలరాస్తున్నదని విమర్శించారు. అడవుల్లో పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో 1.50 లక్షల మందికి 4.05 లక్షల ఎకరాల అటవీ భూములకు సీఎం కేసీఆర్ పట్టాలిచ్చారని వివరించారు. వారికి రైతు బంధు, రైతు బీమా పథకాలు అమలవుతున్నాయని అన్నారు. గ్రామ సభలు తీర్మానం చేసే హక్కును కూడా తొలగిస్తూ అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేసేందుకు మోడీ సర్కార్ కుట్రలు పన్నుతున్నదని చెప్పారు. అటవీ హక్కులను పూర్తిగా నిర్వీర్యం చేసిందనీ, పీసా చట్టాన్ని చాలా పేలవంగా అమలు చేస్తున్నదని కాగ్ కూడా తేల్చిందని చెప్పారు. గిరిజన సబ్‌ప్లాన్ నుంచి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదన్నారు. వివిధ శాఖలు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని అన్నారు.

ఆదివాసీల చరిత్రను కనుమరుగు చేసే కుట్ర : గోరటి వెంకన్న

ఆదివాసీల చరిత్రను కనుమరుగు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ సభ్యుడు గోరటి వెంకన్న విమర్శించారు. అడవుల్లో సహజ వనరులను మైనింగ్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఆదివాసీలను వనవాసీలు అనడం కుట్రపూరితమేనని అన్నారు. వారి సంస్కృతిని ధ్వంసం చేయడం సరైంది కాదన్నారు. మణిపూర్‌లో జరిగిన ఘటనలు బాధాకరమనీ, వాటిని తీవ్రంగా ఖండించారు.

నిరంకుశంగా కేంద్రం తీరు : పల్లా

గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవమరిస్తున్నదని బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీలను అమలు చేయడం లేదనీ, గిరిజన విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పడం లేదని చెప్పారు. మేడారం జాతరకు కేంద్ర మంత్రులు వస్తున్నా ఒక్క రూపాయి ఇవ్వడం లేదన్నారు. కేంద్రం సహకరించకపోయినా గిరిజన రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం పది శాతానికి పెంచి అమలు చేస్తున్నదని వివరించారు.

గిరిజన బంధు ప్రవేశపెట్టాలి : జీవన్‌రెడ్డి

ఉమ్మడి ఏపీలో 3.08 లక్షలు, తెలంగాణ వచ్చాక 4.05 లక్షలు కలిపి మొత్తం ఏడు లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంచారని కాంగ్రెస్ సభ్యుడు జీవన్‌రెడ్డి చెప్పారు. వర్షాధారంగా పంటలు పండిస్తున్నారని అన్నారు. అయితే సాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తే మరిన్ని పంటలు పండుతాయని సూచించారు. సబ్‌ప్లాన్ నిధుల నుంచి గిరిజన బంధును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గిరిజన తండాల గ్రామపంచాయతీలకు రూ.పది లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. ఎస్ఐ, కానిస్టేబుల్ నోటిఫికేషన్లు విడుదలయ్యాక గిరిజనుల రిజర్వేషన్లను పదిశాతానికి ప్రభుత్వం పెంచిందన్నారు. న్యాయ సలహా తీసుకుని ఆ నోటిఫికేషన్‌కూ పెంచిన రిజర్వేషన్లను వర్తింపచేయాలని సూచించారు. మణిపూర్ ఘటన దారుణమని విమర్శించారు. అక్కడ గిరిజన తెగలు, ఆడబిడ్డలపై జరుగుతున్న దాడి, హింసను వ్యతిరేకిస్తూ శాసనమండలి తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపాలని కోరారు.

అవసరమైన మేరకు ఐటీడీఏలను ఏర్పాటు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

పెంచాలని సూచించారు. మంచిర్యాల జిల్లా మండలం దండేపల్లి మండలం బోయ పోచగూడెం ఆదివాసులు పోడు వ్యవసాయం చేస్తున్నప్పటికీ వారికి పట్టాలు ఇవ్వలేదని చెప్పారు. అదే విధంగా యెన్నెల, వేమనపల్లి, చెన్నూరు, జన్నారం తదితర ప్రాంతాల్లో సర్వే చేయలేదని తెలిపారు. వారి సమస్యలను తీర్చాలని కోరారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న క్రమంలో వారిపై నమోదైన కేసులున్నింటినీ తొలగిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ పూర్తిగా నెరవేరలేదని గుర్తుచ్చేశారు. పోడు, ఇతర భూములకు సంబంధించిన కేసుల విషయంలో గిరిజనులు వాదించుకోలేకపోతున్నారనీ, వారి పక్షాన ప్రభుత్వమే న్యాయవాదులను ఏర్పాటు చేసి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

రెసిడెన్షియల్ పాఠశాలల్లో అనేక మంది చదువుకుంటున్నారనీ, దీనికి సంబంధించి గతంలో జీవో నెంబర్ 3 ఉండేదని నర్సిరెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆయా పాఠశాలల్లో ఎక్కువగా గిరిజనులే ఉపాధ్యాయులుగా ఉన్నారని తెలిపారు. ఉదయం పాఠం చెప్పిన ఉపాధ్యాయులే రాత్రి కాపలా కాయాల్సి వస్తున్నదని వివరించారు. అందువల్ల ఒక్కో పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. 2013లో అప్పటి ముఖ్యమంత్రి పోస్టులను మంజూరు చేశారని గుర్తుచేశారు. అయినప్పటికీ కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉందని చెప్పారు.

మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం...

పోడు భూముల సర్వే చేపట్టి ఏడాదైందని గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. నర్సిరెడ్డి లేవనెత్తిన అంశాలపై ఆమె మాట్లాడుతూ, అధికారులు ఊర్లకు వెళ్లకుండా ఉండరని అన్నారు. ఒక వేళ అలాంటి సమస్య ఏదైనా ఉంటే తనకు గానీ లేదా తమ శాఖ కార్యదర్శి దృష్టికి గానీ తీసుకొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కేసులకు సంబంధించి డిఎఫ్ఓ పరిధిలో ఉన్నవాటిని ఉపసంహరించుకున్నట్టు తెలిపారు. ఐదు వేలకు పైగా కేసులు న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయని వివరించారు. వీటిని పరిష్కరించాలని ఇప్పటికే సీఎం కేసీఆర్, డీజీపీ, అటవీశాఖ అధికారులను ఆదేశించారని ఆమె తెలిపారు.

ఆర్టీసీ హైడ్రామా

(మొదటిపేజీ తరువాయి)

కార్మికుల బాధను తాను స్వయంగా చూశాననీ, సమ్మె విరమింపచేయమని అప్పట్లో ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశానని గుర్తుచేసుకున్నారు. గవర్నర్ లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వివరణ ఇచ్చారు. అయితే జేఏసీ నేతలతో భేటీ అనంతరం మరికొన్ని అంశాలపై వివరణ కావాలంటూ ఆమె సీఎస్‌కు మరోసారి లేఖ రాసారు. ఓవైపు అసెంబ్లీ జరుగుతుండగానే ఆర్టీసీ కార్మికులు రాజభవన్ ముట్టడికి వెళ్లడం చర్చనీయాంశమైంది. పోలీసులే వారిని వెంటబెట్టుకొని రాజ్‌భవన్ వద్దకు తీసుకెళ్లారనే చర్చా జరిగింది. తాను కార్మికుల పక్షానే ఉన్నాననీ, న్యాయ సలహా తీసుకోకుండా బిల్లుపై సంతకం చేస్తే, ఎవరైనా కోర్టులో సవాలు చేస్తే మరోసారి ఆర్టీసీ కార్మికులు రోడ్డున పడతారనే తాను ప్రభుత్వం నుంచి వివరణలు కోరానని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు.

టీవీవీపీని ప్రభుత్వంలో విలీనం చేయాలి : మండలిలో జీవన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ)ని ప్రభుత్వంలో విలీనం చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి కోరారు. శనివారం శాసనమండలిలో ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు పబ్లిక్ ఎంప్లాయిమెంట్ సవరణ బిల్లు - 2022ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, టీవీవీపీ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విలీనమంటే చట్టం రద్దు చేయాలి

టీవీవీపీని ప్రభుత్వంలో విలీనం చేయాలంటే దానికి సంబంధించిన చట్టాన్ని రద్దు చేయాల్సి ఉంటుందని మంత్రి హరీశ్ రావు తెలిపారు.

ఘాటెక్కనున్న ఉల్లి

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబర్‌కు బదులుగా ఆగస్ట్ చివరి నాటికే బాగా తగ్గుతాయని, దీంతో సరఫరాలు తగ్గి ధరలు పెరుగుతాయని తెలిపింది. అక్టోబర్‌లో ఖరీఫ్ పంట చేతికి వచ్చే దాకా సరఫరాలు తక్కువగానే ఉండి, ఫలితంగా ధరలు పెరుగుతాయి. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. ఈ సంవత్సరం జనవరి-మే మధ్యకాలంలో ఉల్లి ధరలు తగ్గడం వల్ల వినియోగదారులకు ఊరట లభించింది. అయితే ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు రాబోయే ఖరీఫ్ సీజన్‌లో ఉల్లి పంట వేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీనివల్ల ఈ సంవత్సరం పంట సాగు విస్తీర్ణం 8%, దిగుబడులు 5% తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా ఆగస్ట్, సెప్టెంబర్‌లో కురిసే వర్షాలు పంట సాగును నిర్ధారిస్తాయి.

మీడియా..నీ దారెటు?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ వీడియోలో కన్పించాడు. 'మీరు భారతదేశంలో నివసించాలంటే...ఓటు వేయాలంటే...ప్రధాని మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఠాకరేకు మద్దతు ఇవ్వండి' అని చెప్పుకొచ్చాడు. పోలీసు దళంలో మతోన్మాదం ప్రబలితే ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయని జాతిపిత మహాత్మాగాంధీ మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి ఐదు రోజుల ముందు ఓ ప్రార్థనా సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ అంచనాలు 76 సంవత్సరాల తర్వాత ఇప్పుడు నిజమవుతున్నాయి.

మీడియా బాధ్యతారాహిత్యం

బీహార్, మణిపూర్, మహారాష్ట్రలలో జరిగిన ఈ ఘటనలను పరిశీలిస్తే అవన్నీ మతపరమైన విద్వేషాలను వ్యాప్తి చేసేందుకు ఉద్దేశించినవేనని అర్థమవుతుంది. ఈ దారుణాలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాలలోనూ, ప్రధాన స్రవంతి మీడియాలోనూ ప్రసారమయ్యాయి. ముఖ్యంగా కొన్ని టెలివిజన్ ఛానల్స్ వీటిని పదే పదే ప్రసారం చేస్తూ ప్రజల్లో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టాయి. దీంతో మతోన్మాదులు చెలరేగి పోయి పలువురు అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నారు. మహిళలపై అఘాయిత్యాలకు ఒడిగట్టారు. మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన వారు మైతీ మహిళపై లైంగిక దాడి చేశారంటూ వ్యాపించిన తప్పుడు వార్తతో ఆ రాష్ట్రం అట్టుడికిపోయింది. సభ్య సమాజం తలదించుకునేలా అమానుష ఘటనలు చోటుచేసుకున్నాయి. కుకీ యువతులను నగ్నంగా ఊరేగించి ఆపై అత్యాచారం చేసిన ఉదంతం దేశాన్ని కుదిపేసింది. ప్రతీకార దాడులతో మణిపూర్‌లో భయానక వాతావరణం నెలకొంది. మీడియాలో వచ్చిన అవాస్తవాలనే నిజమని నమ్మి విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి దారుణ కృత్యాలకు తెగబడుతున్నారు. ఒకసారి పరిస్థితి చేయి దాటితే దానిని తిరిగి దారికి తెచ్చుకోవడం ఎంత కష్టమో మణిపూర్ పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. తటస్థులుగా ఉండాల్సిన ప్రభుత్వోద్యోగులు కూడా చీలిపోయి, ఒకరిపై ఒకరు ద్వేష భావాన్ని పెంచుకున్నారు.

విజయవంతంగా జాబిల్లి కక్ష్యలోకి...

(మొదటిపేజీ తరువాయి)

(పూర్వపు ట్విట్టర్)లో పోస్టు చేసింది. ఇక తదుపరి ఆపరేషన్ కక్ష్యను కుదించడం. ఈ ప్రక్రియను ఆదివారం రాత్రి 11గంటల సమయంలో చేపట్టనున్నారు. జులై 14న ఇస్రో చంద్రయాన్-3ని ప్రయోగించింది. మూడింట రెండు వంతుల దూరాన్ని చంద్రయాన్ పూర్తి చేసిందని శుక్రవారమే ఇస్రో ప్రకటించింది. గత మూడు వారాల్లో ఐదు ఆపరేషన్లు చేపట్టి భూమికి దూరంగా చంద్రయాన్-3 అంతరిక్ష నౌకను పయనించేలా చేశారు. ఆ తర్వాత ఆగస్టు 1వ తేదిన కీలకమైన సింగిల్ షాట్ మూవ్‌ను అమలు చేసి భూ కక్ష్య నుండి చంద్రుని దిశగా కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. ఇక ఆ తర్వాత భూ కక్ష్యకు దూరంగా జరిగిన అంతరిక్ష నౌక చంద్రుని కక్ష్యకు సమీపంగా పయనించడం అరంభించింది. శనివారం మరో కీలకమైన ప్రక్రియలో చంద్రుని కక్ష్యలోకి రోదసీ నౌకను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రోదసీ నౌక పరిస్థితి సాధారణంగానే వుందని, ఆగస్టు 23న చంద్రుని ఉపరితలంపై సజావుగా దిగేందుకు ప్రయత్నిస్తామని ఇస్రో గతంలో తెలిపింది. ఒక వారం రోజుల తర్వాత ల్యాండింగ్ కూడా సాఫీగా జరుగుతుందని, ఆందోళన చెందే పనే లేదని కేంద్ర సైన్స్, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.



ఆర్చరీలో డబుల్ ధమాకా

- అదితికి పసిడి, సురేఖకు కాంస్యం
- ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్స్

బెర్లిన్ (జర్మనీ) : ప్రపంచ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్స్‌లో భారత ఆర్చర్ల పతక జోరు కొనసాగుతుంది. శుక్రవారం మహిళల జట్టు విభాగంలో జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లు పసిడి పతకంతో సరికొత్త రికార్డు సృష్టించగా.. శనివారం సైతం పతకాల పంట పండింది. గత నెలలో జూనియర్ ఆర్చరీ వరల్డ్‌కప్‌లో పసిడి సాధించిన అదితి స్వామి.. తాజాగా 17 ఏండ్ల వయసులోనే సీనియర్ విభాగంలో ప్రపంచ చాంపియన్‌గా అవతరించి రికార్డు సృష్టించింది. మహిళల వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో యువ ఆర్చర్ అదితి స్వామి పసిడి వెలుగులు వెలిగించింది. మెక్సికో ఆర్చర్ ఆండ్రీయ బెక్రెరాతో పసిడి పోరులో అదితి స్వామి 149-147తో అద్వితీయ విజయం సాధించింది. అంతకముందు జరిగిన ఆల్ ఇండియన్ సెమీఫైనల్లో సీనియర్ ఆర్చర్, తెలుగు తేజం వెన్నం జ్యోతి సురేఖపై అదితి స్వామి 149-145తో విజయం సాధించింది. సహచర ఆర్చర్ చేతిలో ఓటమి నుంచి వేగంగా పుంజుకున్న జ్యోతి సురేఖ.. కాంస్య పతక పోరులో సత్తా చాటింది. టర్కీ ఆర్చర్ ఐపెక్ టోమర్క్‌పై 150-146తో పర్‌ఫెక్ట్ స్కోరుతో సత్తా చాటింది. దీంతో ఒకే ఈవెంట్‌లో భారత్ పసిడి, కాంస్య పతకాలు సాధించి డబుల్ ధమాకా చూపించింది.

మరో మ్యాచ్ రీ షెడ్యూల్!



- కాళీ పూజతో పాక్, ఇంగ్లాండ్ మ్యాచ్ మార్పు

కోల్‌కత : అసలే ఆలస్యంగా షెడ్యూల్ విడుదల, ఆపై వరుసగా పర్వదినాల కారణంగా కీలక మ్యాచుల్లో మార్పులు చేయాలంటూ వినతి. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ షెడ్యూల్ విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటుంది. గల్లీ క్రికెట్ తరహాలో రోజుకో మ్యాచ్‌ను రీ షెడ్యూల్ చేయాలని రాష్ట్ర క్రికెట్ సంఘాల నుంచి బీసీసీఐ, ఐసీసీకి అభ్యర్థనలు అందుతున్నాయి. తాజాగా ఈ జాబితాలో పాకిస్తాన్, ఇంగ్లాండ్ మ్యాచ్ సైతం చేరింది. నవంబర్ 12న ఇంగ్లాండ్, పాక్ జట్లు కోల్‌కతలోని ఈడెన్ గార్డెన్స్‌లో తలపడాలి. కానీ ఆ రోజు కాళీమాత పూజ ఉండటంతో క్రికెట్ మ్యాచ్‌కు భద్రత కల్పించటం కోల్‌కత పోలీసులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. తాజాగా కోల్‌కత ఈడెన్ గార్డెన్స్ మైదానాన్ని ఐసీసీ బృందం పర్యవేక్షించగా.. ఈ సందర్భంగా నవంబర్ 12న మ్యాచ్‌ను రీ షెడ్యూల్ చేయాలనే ప్రతిపాదన ఐసీసీ దృష్టికి వెళ్లిందని తెలుస్తోంది. దీనిపై బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. నవరాత్రి ఉత్సవాల్లో తొలి రోజు పండుగ కారణంగా అహ్మదాబాద్‌లో అక్టోబర్ 15న జరగాల్సిన భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌ను అక్టోబర్ 14కు మార్పు చేస్తున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 12న హైదరాబాద్‌లో జరగాల్సిన పాకిస్తాన్, శ్రీలంక మ్యాచ్‌ను సైతం అక్టోబర్ 10కి మార్పు చేయనున్నారు. దీంతో ప్రపంచకప్‌లో పాకిస్తాన్ ఆడుతున్న మూడు మ్యాచులను రీ షెడ్యూల్ చేయాల్సిన పరిస్థితి తలెత్తనుంది. త్వరలోనే ఐసీసీ, బీసీసీఐ ప్రపంచకప్ రీ షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

పుంజుకుంటారా?!

- విండీస్‌తో భారత్ రెండో టీ20 నేడు
- సిరీస్ సమంపై హార్దిక్‌సేన గురి

రాత్రి 8 నుంచి డిడి స్పోర్ట్స్‌లో..

ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) స్టార్స్ వర్సెస్ సీపీఎల్ (కరీబియన్ ప్రీమియర్ లీగ్) స్టార్స్‌గా పరిగణిస్తున్న ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో తొలి పంచ్ కరీబియన్లు విసిరారు. స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో ఓ బౌండరీ ఇరు జట్లకు మధ్య వ్యత్యాసంగా నిలిచింది. టెస్టు, వన్డేల్లో కరీబియన్ శిబిరంలో పస తగ్గినా.. టీ20ల్లో ఆ జట్టు అరివీర భయంకరమే. నాణ్యమైన విండీస్ జట్టుపై పొట్టి ఫార్మాట్‌లో సత్తా చాటేందుకు హార్దిక్ సేన సిద్ధమవుతోంది. యువ జట్టుతో 2024 టీ20 ప్రపంచకప్ సన్నద్ధతకు టీమ్ ఇండియా సై అంటోంది!.

నవతెలంగాణ-ప్రావిడెన్స్

2023 వన్డే వరల్డ్‌కప్ ఏడాదిలో టీ20 సిరీస్‌కు పెద్దగా ప్రాధాన్యత లేదు అనిపించింది. కానీ భారత్, విండీస్ టీ20 సిరీస్ అందుకు భిన్నమైన అనుభూతి అందిస్తోంది!. తొలి టీ20ల్లోనే అందరి దృష్టిని ఆకర్షించిన భారత్, విండీస్ యువ స్టార్స్.. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌లో ఆధిపత్య పోరుకు తెరతీశారు. 2024 టీ20 ప్రపంచకప్ వెస్టిండీస్, అమెరికాల్లోనే జరుగనుండటంతో టీమ్ ఇండియా ఈ సిరీస్‌ను సవాల్‌గా తీసుకుంటుంది. యువ ఆటగాళ్లకు ఇక్కడి పిచ్‌లు, పరిస్థితులపై అవగాహన కలిగేందుకు ఈ సిరీస్‌ను కీలకంగా భావిస్తుంది. ఇదే సమయంలో టెస్టు, టీ20ల్లో తేలిపోయిన ఆతిథ్య విండీస్.. అచ్చొచ్చిన టీ20 ఫార్మాట్‌లో సిరీస్ విజయం దిశగా అడుగులు వేస్తోంది. సమంపై హార్దిక్‌సేన, ఆధిక్యంపై పావెల్ గ్యాంగ్ కన్నేసిన వేళ భారత్, వెస్టిండీస్ రెండో టీ20 మ్యాచ్ నేడు.

కుర్రాళ్లకు పరీక్ష

తొలి టీ20లో భారత బ్యాటర్లు స్లో వికెట్‌పై తడబడ్డారు. అరంగేట్ర బ్యాటర్ తిలక్ వర్మ మినహా మరో ఆటగాడు ఆకట్టుకునే ప్రదర్శన చేయలేదు. బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడిన తిలక్ వర్మ.. మ్యాచ్‌ను భారత్ పరం చేసినట్టే కనిపించాడు. కానీ అతడి నిష్క్రమణ తర్వాత పరిణామాలు వేగంగా మారిపోయాయి. రెండో టీ20లోనూ తిలక్ వర్మ భారత్‌కు కీలకం కానున్నాడు. ఇక కెప్టెన్ హార్దిక్ పాండ్య, వైస్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌లు



ఇటు వ్యక్తిగతంగా మెరుగైన ప్రదర్శన చేయటంతో పాటు జట్టుగా ముందుకెళ్లటంపై దృష్టి నిలిపారు. సూర్యకుమార్ యాదవ్ ఇష్టమైన పొట్టి ఫార్మాట్‌లోనైనా ధనాధన్ మోత మోగించాలని ఎదురు చూస్తున్నాడు. ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, సంజు శాంసన్‌లు సైతం మంచి ఇన్నింగ్స్‌లు ఆడాల్సి ఉంది. గత సీజన్ ఐపీఎల్ హీరో యశస్వి జైస్వాల్ బెంచ్‌పై అందుబాటులో ఉన్నాడు. టెస్టుల్లో కదం తొక్కిన యశస్వి జైస్వాల్‌కు నేడు రెండో టీ20లో అవకాశం దక్కుతుందేమో చూడాలి. తిలక్ వర్మ శైలిలోనే నిలకడగా ఊచకోత ఇన్నింగ్స్‌లు ఆడటంలో యశస్వి దిట్ట. బౌలింగ్ విభాగంలో ఇద్దరు స్పిన్నర్లనే నేడు ఎంచుకునే వీలుంది. కుల్దీప్, చాహల్ ఉండగా.. అక్షర్ పటేల్‌పై వేటు పడొచ్చు. ముకేశ్ కుమార్, అర్షదీప్ సింగ్‌లు డెత్ ఓవర్లలో మెరుస్తున్నా.. ఇంకా మెరుగైన ప్రదర్శన అవసరం. ఉమ్రాన్ మాలిక్, అవేశ్ ఖాన్‌లలో ఒకరు నేడు తుది జట్టులో నిలిచే అవకాశం కనిపిస్తోంది. లేదంటే, యశస్వి జైస్వాల్ రూపంలో అదనపు బ్యాటర్‌ను ఎంచుకునే అవకాశం సైతం లేకపోలేదు.

జోరుమీదున్న విండీస్

టెస్టులు, వన్డేలు అటుంచితే.. టీ20ల్లో కరీబియన్లది భిన్నమైన జట్టు. 'టీమ్ ఆఫ్ బౌండరీ హిట్టర్స్'గా విండీస్‌కు ఘనమైన పేరుంది. పొట్టి ఫార్మాట్‌లో స్ట్రయిక్‌రొటేషన్‌కు విలువ లేదని నిరూపించిన విండీస్.. బాదుడుతోనే అసమాన విజయాలు సాధించింది. సీపీఎల్‌లో దుమ్మురేపిన కుర్ర క్రికెటర్లు జట్టులో ఉండగా ఆతిథ్య జట్టు సిరీస్‌లో ఆధిక్యంపై కన్నేసింది. కెప్టెన్ రోవ్‌మాన్ పావెల్, షిమ్రోన్ హెట్‌మయర్, నికోలస్ పూరన్ సహా కైల్ మేయర్స్, బ్రాండన్ కింగ్‌లు ప్రమాదకర బ్యాటర్లు. తమదైన రోజు ఆకాశమే హద్దుగా చెలరేగుతారు. బంతితోనూ అల్జారీ జొసెఫ్, షెఫర్డ్, మెక్‌కాయ్‌లకు తోడు ఒడీన్ స్మిత్ ప్రభావశీల బౌలర్లు. ఆరంభ మ్యాచ్‌లోనే విజయం, ఫేవరేట్ ఫార్మాట్ కావటంతో రెండో టీ20లోనూ విజయమే లక్ష్యంగా కరీబియన్లు బరిలోకి దిగుతున్నారు. ఈ గ్రౌండ్‌లో చెత్త రికార్డు ఒక్కటే ఆతిథ్య జట్టుకు అతిపెద్ద ప్రతికూలత!.

పిచ్ రిపోర్టు

ప్రావిడెన్స్ స్టేడియంలో ఆతిథ్య విండీస్‌కు మంచి రికార్డు లేదు. ఇక్కడ జరిగిన 11 టీ20ల్లో వర్షం కారణంగా మూడు మ్యాచుల్లో ఫలితం తేలలేదు. మిగతా మ్యాచుల్లో ఏకంగా ఐదింట కరీబియన్ జట్టు ఓటమి చవిచూసింది. ఈ రికార్డు నేడు భారత్‌కు సానుకూలం కానుంది. సహజంగా ఈ పిచ్‌పై స్పీడ్‌స్టర్స్‌కు సక్సెస్ అవకాశం ఎక్కువ. మ్యాచ్ సాగుతున్న కొద్ది పిచ్ నెమ్మదిగా మారి పరుగుల వేట కష్టమవుతుంది. అంతిమంతగా ఇది స్పిన్నర్లకు ఉపకరిస్తుంది. ఇక్కడ సగటు తొలి ఇన్నింగ్స్ స్కోరు 123 పరుగులు. టాస్ నెగ్గిన తొలుత బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తుంది.

వర్షం సూచన

భారత్, వెస్టిండీస్ రెండో టీ20కు వర్షం సూచనలు ఎక్కువగా ఉన్నాయి. విండీస్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు మ్యాచ్ ఆరంభం అవుతుంది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సరిగ్గా మ్యాచ్ జరిగే సమయంలోనే 40 శాతం వర్షం కురువనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. మ్యాచ్‌కు ముందే వర్షం అంతరాయం కలిగిస్తే.. కుదించిన ఓవర్లతో రెండో టీ20 జరిగేందుకు ఆస్కారం ఎక్కువ.



తుది జట్లు (అంచనా)

భారత్ : ఇషాన్ కిషన్, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య (కెప్టెన్), సంజు శాంసన్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్, ముకేశ్ కుమార్.

వెస్టిండీస్ : బ్రాండన్ కింగ్, కైల్ మేయర్స్, జాన్సన్ చార్లెస్, నికోలస్ పూరన్, రోవ్‌మాన్ పావెల్ (కెప్టెన్), షిమ్రోన్ హెట్‌మయర్, రోమారియో షెఫర్డ్, జేసన్ హోల్డర్, అకీల్ హుస్సేన్, అల్జారీ జొసెఫ్, ఒబెడ్ మెక్‌కాయ్.


ఫైనల్లో ప్రణయ్

- సెమీస్‌లో ప్రియాన్షుపై గెలుపు



సిడ్నీ (ఆస్ట్రేలియా) : భారత బ్యాడ్మింటన్ వెటరన్ ఆటగాడు, వరల్డ్ నం.9 హెచ్.ఎస్ ప్రణయ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించాడు. శనివారం జరిగిన మెన్స్ సింగిల్స్ సెమీఫైనల్లో సహచర భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్‌పై హెచ్.ఎస్ ప్రణయ్ 21-18, 21-12తో వరుస గేముల్లో సాధికారిక విజయం సాధించాడు. ఆదివారం జరుగనున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీ మెన్స్ సింగిల్స్ ఫైనల్లో చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్‌తో ప్రణయ్ పోటీపడనున్నాడు. వరల్డ్ నం.24 చైనా షట్లర్‌తో గతంలో ఆడిన ఏకైక మ్యాచ్‌లో ప్రణయ్ పైచేయి సాధించాడు. మలేషియా మాస్టర్స్‌లో వెంగ్ హాంగ్ యాంగ్‌పై విజయంతోనే ఆరేండ్ల పతక దాహానికి ప్రణయ్ తెరదించటం విశేషం. సీజన్లో రెండో టైటిల్‌పై కన్నేసిన హెచ్.ఎస్ ప్రణయ్ మెన్స్ సింగిల్స్ టైటిల్ పోరులో హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతున్నాడు.

21 ఏండ్ల మధ్యప్రదేశ్ కుర్రాడు ప్రియాన్షు రజావత్ పోరాటానికి సెమీస్‌లో తెరపడింది. ప్రియాన్షుకు ఇదే కెరీర్ తొలి 500 సిరీస్ సెమీఫైనల్స్. తొలి గేమ్‌లో విరామం అనంతరం పొరపాట్లు చేసిన ప్రణయ్.. ప్రియాన్షు పుంజుకునేందుకు చోటిచ్చాడు. దీంతో 14-14తో ప్రియాన్షు స్కోరు సమం చేశాడు. ప్రియాన్షు పోటాపోటీగా పాయింట్లు సాధించగా 18-18తో ఉత్కంఠకు దారితీసింది. చివర్లో వరుస పాయింట్లు సాధించిన ప్రణయ్ 21-18తో తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లో 5-2తో ముందంజ వేసిన ప్రణయ్‌ని.. ప్రియాన్షు వెంటాడాడు. 7-7తో స్కోరు సమం చేశాడు. విరామ సమయానికి 11-7తో ప్రణయ్ ఆధిక్యం సాధించాడు. సీనియర్ షట్లర్‌తో సమరంలో వెనుకంజ వేసిన ప్రియాన్షు రజావత్ రెండో గేమ్‌ను సైతం కోల్పోయాడు. 43 నిమిషాల్లోనే ఫైనల్స్



బెర్త్ ఖాయం చేసుకున్న హెచ్.ఎస్ ప్రణయ్.. మలేషియా మాస్టర్స్ తర్వాత మరో టైటిల్ విజయం దిశగా దూసుకెళ్లాడు. భారత స్టార్ షట్లర్లు పి.వి సింధు, కిదాంబి శ్రీకాంత్ సహా లక్ష్యసేన్ క్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టిన సంగతి తెలిసిందే.


బోధన్‌లో ర్యాలీ

ప్రభుత్వోద్యోగులుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం



- జీపీ కార్మికుల డిమాండ్.. 31 రోజులు పూర్తయిన సమ్మె
- బోధన్ పట్టణంలో భారీ ర్యాలీ, పలుచోట్ల వినూత్న తరహాలో నిరసనలు
- హక్కులను కాలరాసి టెంట్ల వద్ద మొసలికన్నీరు కారుస్తున్న బీజేపీ నేతలు

నవతెలంగాణ-బోధన్/ విలేకరులు

వేతనాలు పెంచి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె 31 రోజులు పూర్తయింది. శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో గ్రామ పంచాయతీ కార్మికులతో భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ప్రజలకు ప్రత్యక్షసేవలందిస్తున్న పంచాయతీ సిబ్బంది పట్ల ప్రభుత్వం వివక్ష పాటించడం శోచనీయమన్నారు. నూటికి 80శాతం మంది దళితులు గ్రామ పంచాయతీ కార్మికులు కావడం వల్లే వివక్ష కొనసాగిస్తున్నారా అని ఆమె విమర్శించారు. మోడీ స్వచ్ఛ భారత్, కేసీఆర్ పచ్చదనం పరిశుభ్రత పిలుపును చిత్తశుద్ధితో అమలు చేశారని అన్నారు. ఎన్నికలకు ముందు పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని సీఎం వాగ్దానం చేసి 9 ఏండ్లు గడిచినా ఎందుకు చేయలేదన్నారు. ధరలు బారెడు, జీతం జానెడు ఉంటే ఎలా అని ఎద్దేవా చేశారు. వేతనాలు పెంపు కోసం ప్రభుత్వం రూపొందించిన జీవో నెంబర్ 60 ప్రకారం గ్రామపంచాయతీ సిబ్బందికి రూ.19వేలు ఇవ్వాలన్నారు. రూ. 8500తో ఎలా జీవిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచకుండా పని భారం పెంచడానికి జీవో నెంబర్ 51ని రూపొందించి ఒకే కార్మికుడు అనేక పనులు చేయాలనే మల్టీపర్పస్ విధానాన్ని ప్రవేశ పెట్టడడం సరికాదన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో గొంతెమ్మ కోర్కెలు లేవని, న్యాయం, ధర్మం నీతి మాత్రమే ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్ కార్మికుల హక్కులను కాలరాసే చర్యలకు ఒడిగట్టిందన్నారు. బీజేపీ నేతలు నేడు టెంట్ల వద్దకు వచ్చి మద్దతు ఇచ్చినప్పటికీ అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను లేకుండా చేస్తున్నది బీజేపీ అనేది మరువకూడదన్నారు. కార్పొరేట్లకు ఉపయోగపడే 4 లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికుల పొట్టలు కొడుతుందన్నారు. 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన ఘనత బీజేపీ సర్కార్‌దేనని వీటిపై ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీపీ జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, జిల్లా నాయకులు ఖాజమోహినోద్దీన్, గ్రామపంచాయతీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నన్నేసాబ్, జిల్లా ఉపాధ్యక్షులు సాగర్, రాజేశ్వరి, రేఖ, పద్మ, జాకీర్, అశోక్, సాయిలు, హనుమండ్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో బండారు చంద్రరావు భవన్లో నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీపీఐ(ఎం) జాతీయ నాయకులు ఎం.సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు హాజరై మాట్లాడారు. పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి, కార్మికుల సమ్మెను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా డే సందర్భంగా ఆగస్టు



9, 10 తేదీలలో దేశవ్యాప్తంగా కలెక్టరేట్ ఎదుట కేంద్ర కార్మిక సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న మహా పడావ్ ధర్నాకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. దమ్మపేట మండలంలో వాటర్ ట్యాంక్ ఎక్కి కార్మికులు నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, ఎర్రుపాలెం మండలాల్లో ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు.

నవచిత్రం

మనస్ఫూర్తిగా నవ్వుకుంటారు


సంతోష్ శోభన్, రాశీ సింగ్

హీరో సంతోష్ శోభన్ నటిస్తున్న తాజా చిత్రం 'ప్రేమ్ కుమార్'. రైటర్ అభిషేక్ మహర్షి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సారంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై శివ ప్రసాద్ పన్నీరు నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, రుచిత సాధినేని హీరోయిన్లు. ఈ సినిమా ఈనెల 18న రిలీజ్ అవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఈ చిత్ర పరిచయ వేదిక కార్యక్రమం జరిగింది.

హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ, "అభిషేక్ మహర్షి, శివ ప్రసాద్లకు థ్యాంక్స్. వాళ్లు నమ్మితేనే సినిమా ఇంత వరకు వచ్చింది. ఈ సినిమా మిమ్మల్ని రెండు గంటల పాటు మనస్ఫూర్తిగా నవ్విస్తుందని నమ్ముతున్నాను. ఈనెల 18న థియేటర్స్‌లో కలుద్దాం' అని అన్నారు. డైరెక్టర్ అభిషేక్ మహర్షి మాట్లాడుతూ 'ఈ కథ ఫిక్స్ కావటానికి కారణం సంతోష్ శోభన్. అనంత్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. థియేటర్‌లో సౌండ్ కొత్తగా ఉంటుంది. ఆడియెన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు మన ఫ్రెండ్స్ గుర్తుకొస్తారు. బయట మనం ఎలా ఉంటామో అదే పాత్రలను తెరపై చూస్తారు' అని అన్నారు. నిర్మాత శివ ప్రసాద్ మాట్లాడుతూ, 'ఆడియెన్స్‌ను ఎంటర్‌టైన్ చేయాలనేదే లక్ష్యంగా చేసిన సినిమా. ఇకపై ప్రతీ పార్టీలో మా మూవీ సాంగ్ వినిపిస్తుంది' అని తెలిపారు. 'ఇందులో అంగన అనే పాత్రలో డబ్బున్న అమ్మాయి ఎలా ఉండకూడదో అలా ఉండే టైప్ చేశా' అని నాయిక రుచితా సాధినేని చెప్పారు.

గ్రామంలో అందరికీ మతిమరుపు ఉంటే?

రామకృష్ణ, హరికృష్ణ హీరోలుగా నటిస్తున్న చిత్రం 'తికమక తాండ'. టిఎస్ఆర్ గ్రూప్ అధినేత, టిఎస్ఆర్ మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ తిరుపతి శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. గౌతమ్‌మీనన్, చేరన్, విక్రమ్ కె.కుమార్ వంటి దర్శకుల దగ్గర కో డైరెక్టర్‌గా పని చేసిన వెంకట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఎన్నో చిత్రాల్లో బాల నటిగా అలరించిన ఆని కథానాయికగా పరిచయమవుతోంది. రామకృష్ణ, హరికృష్ణ ఇద్దరూ కవలలు హీరోలుగా నటించడం విశేషం.

ఇంత కంటే ఏం కావాలి?

చిరంజీవి నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోళా శంకర్'. మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానున్న నేపథ్యంలో చిరంజీవికి చెల్లెలుగా నటించిన కీర్తి సురేష్ శనివారం మీడియాతో ముచ్చటించారు. 'రజనీకాంత్‌కి సిస్టర్‌గా నటించా. అలాగే ఇప్పుడు చిరంజీవికి సిస్టర్‌గా కనిపించడం ఆనందంగా ఉంది. చిరంజీవి, రజనీకాంత్.. ఇద్దరు బిగ్గెస్ట్ స్టార్స్‌తో నటించాను. ఇంతకంటే ఏం కావాలి. ఈ సినిమాలో ఉన్న మరో గొప్ప విశేషం ఏంటంటే, చిరంజీవితో డ్యాన్స్ చేసే అవకాశం కూడా దొరికింది. ఆయనతో ఒక్క ఫ్రేమ్ లోనైనా డ్యాన్స్ చేయాలని వుండేది. కానీ ఇందులో రెండు పాటల్లో డ్యాన్స్ చేసే అవకాశం దొరికింది. దర్శకుడు మెహర్ రమేష్ ఈ కథ చెప్పినప్పుడు చాలా నచ్చింది. అయితే సిస్టర్


కీర్తి సురేష్

క్యారెక్టర్ అనగానే డ్యాన్స్ చేసే అవకాశం ఉండదేమో అని భయపడ్డా. కానీ ఇందులో నా క్యారెక్టర్‌కి ఆ స్కోప్ ఉంది. అన్నయ్యతో చాలా బబ్లీ, జాలీగా ఉండే క్యారెక్టర్ కాబట్టి సూపర్‌గా కుదిరింది. ఈ సినిమా కథ ప్రధానంగా బ్రదర్ సిస్టర్ స్టోరీ. బ్రదర్ సిస్టర్ ఎమోషన్‌తో పాటు అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పక్కా ప్యాకేజ్‌గా ఉంటుంది. మా అమ్మ చిరంజీవితో 'పున్నమినాగు' చిత్రంలో నటించారు. అప్పటి చాలా విషయాలు అమ్మ నాకు చెప్పింది. చిరంజీవి ఎనర్జీ, డెడికేషన్, అలాగే సెట్‌లో ఇచ్చిన సలహాలు సూచనలు గురించి చెప్పింది. చాలా కేరింగ్‌గా చూసుకునేవారట. అమ్మ చాలా చిన్న వయసులో సినిమాల్లో వచ్చింది. అప్పుడు ఒక చిన్న పాపకి చెప్పినట్లు అన్ని విషయాలు చెప్పారట. ఈ విషయాన్ని చిరంజీవితో నేను చెప్పినపుడు.. చిరంజీవి రియాక్షన్ నాకు చాలా సర్‌ప్రైజ్ చేసింది. 'మీ అమ్మ చాలా అమాయకురాలు. నువ్వు మాత్రం అలా కాదు. స్ట్రీట్ స్మార్ట్ నువ్వు' అని చిరంజీవి అన్నారు(నవ్వుతూ). సాధ్యమైనంత వరకు మంచి పాత్రలతో మెప్పిస్తా' అని కీర్తి సురేష్ అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886



నీ... స్నేహం!



నిన్ను నిన్నుగా ప్రేమించుటకు
నీ కోసమే కన్నీరు నింపుటకు
నేనున్నాని నిండుగ పలికే
తోడొకరుండిన అదే భాగ్యమూ...

స్నేహానికి ఇంతకంటే గొప్ప నిర్వచనం ఇంకేముంటుంది. జీవితం చుట్టూ ఒక గాడాంధకారం అలుముకున్నప్పుడు, నిరాశా నిస్పృహలు చుట్టుముట్టినపుడు.. నీ కోసం నేనున్నాను.. అంటూ భుజం తట్టే ఆత్మీయ స్పర్శ స్నేహం. ఆనందాన్ని రెట్టింపు చేస్తుంది. విషాదాన్ని సగానికి సగం తగ్గిస్తుంది. మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలుగా మారిపోయి, మనిషన్నవాడు మాయమైపోతున్న తరుణంలో ఇంకా ఎక్కడో ఒక చోట ఆత్మీయమైన స్నేహాలు, ఉన్నతమైన మానవతా విలువలు వెలుగు రేఖలుగా దారి చూపుతూనే ఉంటాయి.

- ఎం.కె.

స్నేహమంటే ఒక నులివెచ్చటి స్పర్శ. భాషకందని కమ్మటి భావన. చుట్టూ అల్లుకున్న మానవ సంబంధాల పొదరింట్లో విరిసిన అందమైన గులాబీ. జీవితంలో మరిచిపోలేని ఒక మధుర జ్ఞాపకం. ఎప్పుడో చిన్నప్పుడు... బుడిబుడి అడుగుల బాల్యంలోనే అల్లుకునే స్నేహ బంధాలు కొన్నయితే... పరవళ్లు తొక్కే యవ్వనంలో పెనవేసుకునే అనుబంధాలు మరి కొన్ని. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఏ కాలేజీలోనో, లైబ్రరీలోనో, కలిసి నడిచే కారిడార్‌లోనో, తరగతి గదిలోని ఒకే బెంచిపై, మాస్టారు బోధించే పాఠాల్లోని సందేహాల్లో ఊపిరి పోసుకొనే స్నేహం..

ఒక మహావృక్షంలా ఎదుగుతుంది. జీవితంతో మమేకమవుతుంది. ఒక విడదీయరాని అనుబంధమై పోతుంది. అసలు కళాశాల అంటేనే స్నేహితుల కలల కాణచి. సహ విద్యార్థిగా రూపుదిద్దుకొనే పరిచయం.. స్నేహమై ఎలా ఎదుగుతుందో, జీవితంలో ఒక తీపి గుర్తుగా ఎలా మిగిలిపోతుందో ఏ డైరీని అడిగినా చెబుతాయి. మదిలో నిక్షిప్తమైన భావాలను, అనుభవాలను, అనుభూతులను పంచుకోవడం తప్ప ఏ స్వార్థం లేని జీవన బంధం స్నేహం. జీవితంలో ఎవరున్నా, లేకున్నా మంచి నేస్తం ఒకరు తోడుంటే చాలు.

కొందరి ఫ్రెండ్ షిప్ స్కూల్‌తో ఫుల్ స్టాప్ పెడతారు. మరికొందరు కాలేజీతో కామా పెడతారు. కానీ స్కూల్ నుంచి మొదలై కాలేజీలో కంటిన్యూ అయి జీవితాంతం బ్రహ్మముడిలా విడిపోకుండా అలా పెనవేసుకుంటాయి.

స్వార్థం,
స్వలాభం కోసం స్నేహాన్ని కవచంగా వాడుకునే నీచ స్వభావులకూ కొరత లేదు. అవసరం మేరకు స్నేహం, ప్రేమ నటిస్తూ, అవసరం తీరాక ముఖం చాటేసే మహానుభావులూ ఉన్నారు. నిజానికి, స్నేహానికి మించిన సంపదగానీ, సత్కార్యంగానీ మరొకటి లేదు. ఇతరులను ప్రేమించలేనివారికి, స్నేహితులు లేనివారికి జీవితంలో ఎన్ని ఉన్నా నిరుపయోగమే. స్నేహ ధర్మాన్ని పాటిస్తేనే ఇహమైనా, పరమైనా దైవం మనందరికీ మంచి స్నేహితులను, సద్బుద్ధిని ప్రసాదించాలని, పరస్పర స్నేహ సంబంధాలలో వృద్ధిని, శుభాన్ని కలుగజేయాలని కోరుకుందాం.

స్నేహమంటే స్కూల్, కాలేజీ ఇవే కాదు ఒక యజమాని సేవకుడి మధ్యలో కూడా తారతమ్యాలు లేని అరమరికలు లేని స్నేహం అంతస్థులు మరిచి అంతరంగాలను పంచుకుంటుంది. స్నేహానికి కులం లేదు. మతం అడ్డురాదు. అది చంద్రుని వెన్నెల లాంటిది. వీచే చిరుగాలి వంటిది. జలజలా రాలే సెలయేటి లాంటిది అవును అన్ని మతాలకు దోస్తీ సమ్మతమే. ఓ నిముషం కోపంగా మరునిముషం నవ్వులతో.. మరి కాసేపు ఈర్ష్యతో.. ఇంకాసేపు - అనురాగంతో.. జీవితంలో కురిసే రసాలన్నిటినీ రుచిచూపించేదే స్నేహం. అది భవిష్యత్తును కలలు కంటుంది. వర్తమానంలో కలహించుకుంటుంది. గతాన్ని గుర్తుచేసుకొని కంటతడి పెడుతుంది. స్నేహానికి ఉన్న విలువను కాపాడుకొని.. అసూయలను పాతరేసి.. ఈర్ష్యలను వదిలేసి.. కమ్మనైన కలలు కనే మంచి తోడు ప్రతి ఒక్కరికి దొరుకుతారు. ఆ తోడును జీవితాంతం నిలుపుకునే అదృష్టం ఉంటే అదే అమృత స్నేహం.

స్నేహానికున్న విలువ వెలకట్టలేనిది. ఈ లోకంలో స్నేహితుడు/ స్నేహితురాలు లేకుండా ఏ వ్యక్తి వుండరు. అంతటి ఉన్నతమైన స్నేహానికున్న ప్రాధాన్యతను చెప్పేందుకు ఏర్పాటైనదే స్నేహితుల రోజు. స్నేహితుల రోజును ప్రతి ఆగస్టు మొదటి ఆదివారం జరుపుకుంటారు.

1935లో అమెరికా కాంగ్రెస్ "ఫ్రెండ్‌షిప్‌డే"ను ప్రకటించింది. స్నేహ మాధుర్యాన్ని చవిచూసిన ప్రతి ఒక్కరూ వారి అభిప్రాయంతో ఏకీభవించారు. ఫలితంగా ప్రపంచంలో నేడు అనేక దేశాలు స్నేహితుల రోజును జరుపుకుంటున్నాయి. ప్రతి ఏటా తమ తమ మిత్రులకు సంప్రదాయ బద్ధంగా శుభాకాంక్షలు తెలుపుకుంటూ వుంటారు మిత్రులు. సుదూర ప్రాంతాలలో వున్న మిత్రులందరూ ఒకచోట చేరి స్నేహితుల రోజున కలిసి విందులు, వినోదాలలో పాల్గొనడం జరుగుతోంది. అయితే ఈ స్నేహుతుల రోజులలోనూ రకాలున్నాయి. అవేంటంటే...

జాతీయ స్నేహితుల రోజు ఆగస్టులో వచ్చే మొదటి ఆదివారం జరుపుకుంటారు. అలాగే మహిళా స్నేహితుల రోజును ఆగస్టు మూడో ఆదివారం

జాతి,
కులం, మతం, లింగ, ప్రాంతం తేడాలు లేకుండా ప్రపంచదేశాల మధ్య స్నేహభావం పెంపొందాలనే ఉద్దేశంతో 2011లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ అంతర్జాతీయ సమావేశం నిర్వహించి, అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించింది. దేశాల మధ్య సుహృద్భావం, స్నేహం కలగాలని భావించింది. దేశాల మధ్య వైషమ్యాలు ఉండకూడదని సూచించింది. అన్ని దేశాలు సోదరభావంతో మెలిగి, ప్రపంచ శాంతికి బాటలు వేయాలని సంకల్పిస్తోంది. కానీ , దేశంలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. కులాలు మధ్య , జాతులు మధ్య చెలరేగిన వైరం కార్చిచ్చులా రెండు రాష్ట్రాలను దహించి వేస్తుంది.

సెలబ్రేట్ చేసుకుంటారు. అదే విధంగా అంతర్జాతీయ స్నేహితుల నెలగా ఫిబ్రవరి మాసాన్ని పరిగణించారు. ఇక పాత స్నేహితులు, కొత్త స్నేహితుల వారాన్ని మే మూడో వారంలో జరుపుకుంటారు. ఇలా ఎన్ని వర్గాలుగా విభజించినా స్నేహితుడు... ఎప్పుడు హితుడే కదా...

"నా ముందు నడవద్దు, నేను అనుసరించకపోవచ్చు. నా వెనుక నడవద్దు, నేను ముందుకు నడవలేక పోవచ్చు.

నాతోపాటు నడువు.. నా స్నేహితుడిగా ఉండు చాలు.."

స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం... అన్నాడో సినీకవి. జగత్తులో ఎన్ని బంధాలు, అనుబంధాలు ఉన్నా స్నేహబంధం అనేది మాత్రం మనిషి జీవితంలో చాలా ప్రత్యేకమైనది. మిగిలిన అన్ని బంధాలు ఏదో రూపంలో మన ప్రమేయం లేకుండానే మన జీవితంలో ప్రవేశిస్తాయి. కానీ స్నేహబంధం మాత్రం పూర్తిగా మన ఇష్టంతో, మనకు నచ్చిన వారితోనే ఏర్పడుతుంది. స్నేహితుల పట్ల విజ్ఞతతో వ్యవహరించడం చాలా అవసరం. సమయ సందర్భాలను బట్టి మాత్రమే స్పందించాలి. స్నేహితుని లోపాలను ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా, అతని మేలుకోరి సున్నితంగా తెలియజెప్పాలి. నేడు స్నేహం కూడా కృత్రిమమై పోయింది. మొహమాటపు స్నేహాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మనసు లోతుల నుంచి పెల్లుబికే స్నేహ సంబంధాలు చాలా అరుదు. స్నేహం ముసుగులో మోసం, దగా, వంచన కొనసాగుతున్నాయంటే అతిశయోక్తి కాదు.

అలాంటి ఆశయాలకు బాటలు వేసిన వారిలో ముందుగా చెప్పుకోవాల్సింది మార్క్స్ ఏంగెల్స్, చేగవేరా ఫెడల్ క్యాస్ట్రో.. కారల్ మార్క్స్‌కు వెన్నుదన్నుగా నిలిచిన ఏంగెల్స్ మైత్రీబంధం నేటికీ ప్రపంచానికి ఆదర్శం. నేడు స్నేహితుల దినోత్సవం. హ్యాపీ ఫ్రెండ్షిప్ డే...



ఇకనైనా నిద్ర లేవండి !

ఉమ్మడిగున్నప్పుడు
ఉధృతంగ..
దోపిడి గురించి మాట్లాడినం !

అభివృద్ధికి
ఆటంకం జరిగిందని
అక్రమాల్ని విపులీకరించి
నిరసనలు సేపట్టినం !

ఏష బాసలు
పల్సబడుతున్నయని
సిరుతల రామన్నెమాడినం !

విముక్తి నేపథ్యంలో
ఉరికురికి..
ఉద్యమానికి ఊపిరులూదినం !

మూలాల్ని తుంగలోతొక్కి
ఆకాంక్షల్ని..
ఏకపక్షంగ గాలికొదిలినప్పుడు
కనీసం ధిక్కరించెటోడు లేడు !

నిరంకుశంగ
గొంతులకు గొంతులు నులిమితే
ఎలుగెత్తి గిదెట్లని
ప్రశ్నించెటోడు ఒక్కడు రాడు !

దర్నాలు, నిరసనలు
ఈ మట్టిమీద దేశద్రోహమైతే
ఈ ఉద్యమనేల చరిత్రేమిటో.. !

ఎంతటి నియంతైనా..
తవ్వేడు తీసుకున్నకాడ
తంగెళ్ళుపీకుమంటె పీకాలె!
ఫ్లెక్సీలకు పాలాభిషేకాలెందుకు!?

సెరువుల బర్లనుతోలి
కొమ్ములకు బారెం పెట్టినంక
ఇప్పుడు కుములుతే ఏం లాభం !?

ప్రత్యేక పోరాటంలనే కాదు
తుది ఫలితంల కూడ
సృజనకారులకు భాగం ఉంటది !

ఎన్ని నిందలు మోపినా
తుపాకి తూటాలు దించినా
కలాలు, గలాలు..
చైతన్యక్రియ మరువద్దు కదా !

రానున్నది..
ఎన్నికల కోలా'హాలాహలం'
ఇక నటించింది చాలు
కవిగాయకులారా !
ఇకనైనా మొద్దు నిద్ర వదలండి !!

- అశోక్ అవారి, 9000576581

మౌనం అర్ధాంగికారమే కాదు...

మాట ఒకటి
చేతలు రెండు
ఏక్ భారత్
దో పహేచాన్

భారత్ సమ్మాన్ దేశ దేశములలో

మానం, మర్యాద అగ్ని గుండంలో

ఏమిటి...? ఈ దాష్టికం..? దౌర్జన్యం..?
అంటూ దేశమంతా గగ్గోలు
సమాధానం లేని సభాపర్వం

ఒకవైపు చంద్రయానాలు

ఇంకొక వైపు కమిలి, కుమిలి
పోయే ఊరేగింపులు

ఎటూ పొసగని
దో పహేచాన్

స్వచ్ భారత్ అంటే
శుభ్ర భారత్ అనుకున్న

మనుషులపై పోయటం అని అర్థం కాకపాయే

దేశ దేశాలు తిరిగి
భారత్ పహేచానో... భారత్ పహేచానో...
ఇప్పుడు భారత్ బత్తలయ్యింది
అన్న సంగతి తెలియక పాయే

వీటన్నిటికీ జవాబుదారీతనం

మౌనం... మౌనం...

మన్ కీ బాత్
చమన్ కీ బాత్ కాదు
పెదవి దాటని మౌనం
అన్నింటికి అర్ధాంగీకారమే కాదు
నిరంకుశాధికారం కూడా...

- వి. కె.



మహాత్ములు మళ్ళీ పుట్టాలి..!

మహాత్ముల మహోద్యమాలతో
అమర వీరుల బలిదానాలతో
దేశ భక్తుల త్యాగ ఫలాలతో
భారతావనికి స్వరాజ్యమొచ్చింది !

తెల్ల దొరలు వెళ్ళిపోయారు.!
నల్ల నేతలు పల్లకీనెక్కారు.!

స్వాతంత్ర్యం వచ్చి ఏడు పదులు దాటినా
స్వదేశంలో కుచేల సంతతి పెరిగి
అప్పులు కుప్పలుగా నిలిచె.
కానీ...సమగ్రాభివృది శూన్యం..?

గద్దెనెక్కిన వాడు
గుట్టుగా దోచుకున్నాడు.
కొలువులను అడ్డం పెట్టుకొని
అధికారులు తెలివిగా గుంజుకున్నారు..?

దేశంలో వ్యక్తి స్వార్థాలు పెరిగిపోయాయి..?
రాజకీయ, అధికాం అవినీతి
గుర్ర పు డెక్కలా సర్వత్రా
సమాజంలో అల్లుకుపోయాయి..?

ఎన్ని ప్రణాళిక లు వేసినా..
పేదరికం దేశానికి చుట్టరికం లా మారింది..!
ఇంకా దేశం ఎలా ముందుకు వెళ్లుతుంది..??

దేశంకి పూర్వ వైభవం రావాలంటే
ఆనాటిమహాత్ములు మరలా పుట్టాలి..!
అలనాటి త్యాగధనులు తిరిగి జన్మించాలి..!
నవ భారతాన్ని ప్రగతి పథంలో నడప టానికి..
జావగారిన జాతిలో నవ జీవన చేతనం నింపటానికి..!!

- జి.సూర్య నారాయణ, 6281725659



ఒక్కసారొచ్చి పో బిడ్డా౦౦౦!



అభిరామ్,

ఎలా ఉన్నావ్! కోడలు పవిత్ర, పిల్లలు ఎలా ఉన్నారు. మీరు క్షేమమని తలుస్తాను. నేను మీ జ్ఞాపకాల్ని, మీ నాన్నతో నా అనుబంధాన్ని నెమరు వేసుకుంటూ ఒంటరిగా కాలం నెట్టు కొస్తున్నాను. మీరు జర్మనీ వెళ్ళి మూడేళ్ల దాటి పోయింది. పోయిన శ్రావణమాసంలో వస్తారనుకున్నాను. కాని, రాలేదు. ముసలి దాన్ని ప్రాణం ఉండబట్టలేక ఉత్తరం రాస్తున్నాను. నా ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే ఉంది. జీవితంలో ఇలాంటి రోజు వస్తుందని నేను ఊహించ లేదు. అనుకున్నవి జరగక పోవడమేగా జీవితమంటే! మీతో నా ఎడబాటు ఈ వయసులో నాకు ఇది పెద్ద శిక్షలాంటిదే!


మనిషికి జీవితం ఎన్ని గుణ పాఠాలు నేర్పుతుందో! ఎన్ని కష్టాలు కన్నీళ్లు కలబోసిన అనుభవాలను ఆవిష్కరిస్తుందో! తలుచుకుంటేనే, గుండె బరువెక్కుతుంది. నాకు బాగా గుర్తు... నువ్వు పుట్టినప్పుడు ముగ్గురు ఆడబిడ్డల తరవాత, మగబిడ్డ పుట్టావని ఎంత సంతోషించామో! నువ్వు మా నోముల పంటవు. ఎన్ని ఒక్క పొద్దులుండి, ఎందరో దేవుళ్లకు మొక్కుకున్నానే. పుట్టిన వారసుడివి.. నువ్వు విజయదశమి రోజు పుట్టినా పండగలన్ని ఒక రోజు జరుపుకున్నట్టు సంబర పడ్డాం. నిజం చెప్పాలంటే నిన్ను పాలతో కాదు మా రక్తాన్ని ధారపోసి, ప్రాణంగా పోషించుకున్నాం. నువ్వు పసివాడిగా ఉన్నప్పుడు నాన్న పడే కష్టం చూడలేక, మీ పెద్దక్క నాన్నలో పాటు కూలి పనికెళ్తానని, మారాం చేసింది. "ఈ గొడ్డు చాకిరి నాతోనే పోవాలి. ఈ కూలి పని బదుకు నాతోనే అంతం కావాలి. మీరంతా పెద్దపెద్ద చదువులు చదువుకొని గొప్ప ఉద్యోగాలు చెయ్యాలి" అని నాన్న అక్కకు నచ్చచెప్పేవాడు. మా రెక్కల కష్టంతోనే మిమ్మల్ని చదివించి ప్రయోజకుల్ని చేశాం. నీ స్థితిని చూడకుండానే మీ నాన్న కాలం చేశారు.

పోయిన గోదావరి పుష్కరాలకు మనం రాజమండ్రి వెళ్ళినపుడు మీ నాన్న అన్న మాటలు నా మనసులో అలాగే ఉండిపోయాయి. "మనం ఎన్ని కష్టాలుపడ్డా పిల్లల్ని పస్తులు లేకుండా సాకాం. అయినా మన పిల్లలు మంచివాళ్లే! తీర్చలేని కోరికలు ఎప్పుడూ అడగలేదు. వాళ్లకు తెలుసనుకుంటాను. నాన్న కుచేలుడని. కాలం కలిసిరాక నేను భగవంతుడు దగ్గరకు వెళ్ళిపోయినా! నీకేం పర్వాలేదు. నీ ముద్దుల కొడుకు అభిరావమ్ ఉన్నాడుగా! నిన్ను ప్రాణంగా చూసుకుం టాడులే!" అనే మాట కడుపు నిండా నవ్వుతూ అనేవాడు. అలాంటి సందర్భంలో మీ నాన్ననే చూడాలనిపించేది. బాధ్యతల్ని తీర్చుకొని, బంధాలన్ని తెంచుకొని వెళ్ళిపోయాడు.

అత్తగారిళ్లకు ఆడపిల్లలు, ఉద్యోగాల పేరుతో మీరు దిక్కులు పంచుకొని వెళ్ళిపోయారు. నేను మాత్రం ఒంటరి పిట్టలా మీ జ్ఞాపకాల మధ్య కాలం నెట్టుకొస్తున్నాను. మన ఊరి కరణం పెద్ద కొడుకు రామనర్సయ్య మామయ్య వాళ్ల పిల్లలు అమెరికా వెళ్ళి ఆరేళ్లయినా తిరిగి రాలేదు. వాళ్లను వృద్ధాశ్రమానికి వెళ్ళమని ఉత్తరం రాశారట. ఊళ్లో ఎట్టా బతికినోళ్ల చివరకు అనాధల్లా శేషజీవితం గడపాల్సి వస్తుందని తులసమ్మత్త కన్నీరు మున్నీరవుతుంది. మనం "బిడ్డల్ని కనగలం గాని, వాళ్ల తలరాతల్ని కాదుగా" అంటూ బాధపడుతుంది. మన ఇల్లు రాములోరి గుడికి పై ఎత్తు నాయినా! నేను పొద్దుటేలకి మాపిటేలకి మధ్య నలిగిపోతున్నాను. మహాశివరాత్రి నుండి ఆరోగ్యం బాగా దెబ్బతింది. శరీరం సహకరించడం లేదు. ఇంకా ఎంత కాలం బతుకుతానో తెలియదు. చూపు మందగించింది. నాకు నేనే భారంగా మారిపోయాను.

అయ్యా! -

"మీకు వీలుంటే ఒక్కసారి వచ్చి చూసిపోండి. ఒంటరి తనం చాలా నరకంగా ఉంది. చివరి రోజుల్లో మీ దగ్గర ఉండాలని ఆశగా ఉంది. మన ఊరు, పొలం, వ్యవ సాయం, రచ్చబండ, రామాలయం, చర్చి వీధి ఈ మాకులు విన్నప్పు డల్లా మీనాన్న పసిబిడ్డలా, నాతో మాట్లా డుతూ ! నా చుట్టూ తిరుగుతున్నట్టే ఉంది. ఊరు పొమ్మం టుంది. కాడి రమ్మం టుంది. మీ నాన్న, మీరు లేని ఇల్లు శూన్యంగా కనిపిస్తుంది. రాత్రయితే చాలు నా మంచం చుట్టూ మీరంతా కూర్చొని కబుర్లు చెప్తున్నట్టుగా ఉంది. ఒంటరిగా నువ్వక్కడ ఎందుకు నా దగ్గరకొచ్చెయ్ అని మీ నాన్న అన్నట్లుగా ఉంది. కానీ, మీ జ్ఞాపకాలే నన్ను బతికిస్తున్నాయి. కన్నీళ్లతో సహజీవనం చేయడం తప్ప ఈ వయసులో నేనేం! చెయ్యగలను.



ఈ పరుగుల ప్రపంచంలో ఆత్మీయతల్ని పంచుకునే సమయం లేని మానవ యంత్రాలు మీరు. అందరు ఉన్నా ఎవ్వరు లేని అనుభవం నాది. కనుక ఈ ఉత్తరం చేరిన వెంటనే వస్తారని ఆశగా ఎదురు చూస్తుంటాను. ఒక వేళ మీరు వచ్చేలోపు నేను కాలం చేస్తే! నన్ను నాన్న సమాధి పక్కనే దహనం చేయించండి. అమ్మగా ఇది నా చివరి కోరిక. తీరుస్తావుగా! ఉంటాను మరి.

శుభాశీస్సులు-

ప్రేమతో...
నీ తల్లి
బద్దిపూడి యశోదమ్మ

మేమేనండీ...

ఎలా పుట్టాలో తెలియకుండా పుట్టి
ఎలా బతకాలో తెలియకుండా
బతికే వాళ్ళం
బతకలేక చచ్చేవాళ్లం
హత్యాచారాలలో ఏ దేశమైతే
ముందు ఉంటుందో
అదే మా దేశం
ఇక ఊరు అంటారా!!
ఏ ఊర్లో ఉన్నా
ఐదు రోజులు బయట ఉండేవాళ్ళం
ఏ మతంలో పుట్టినా
ఆడవాళ్ళమే
ఏ కులంలో పుట్టినా
దళితులమే
ఎంత ముద్దుగా పుట్టినా
నాన్న ముఖం చిట్లించాల్సిందే
ఎన్ని నెలలు మోసినా
తల్లీ, కడుపు తీపి మరిచి
కుండీల పాలు చేయాల్సిందే
మాకు చదువు అవసరం లేదు
ప్రేమించే అధికారం లేదు
జీవించే హక్కు లేదు
సమానత్వం జాడే లేదు
ఎంత చదివినా
సంసారం చేయాల్సిందే అంటారు
ఎన్ని మెడల్స్ వచ్చినా
మెడలు వంచాల్సిందే అంటారు
మా జాతిని గౌరవిస్తామంటారు
మమ్మల్ని మాత్రం
మాడ్చి చంపేస్తుంటారు
ఆడదేవతల్ని
అనేక రూపాల్లో కొలుస్తూ ఉంటారు
అమ్మ, అక్క, చెల్లి
ఇలా మేము ఏ రూపంలో ఉన్నా
నామరూపాలు లేకుండా చేస్తారు
ఈ ప్రపంచానికి దిక్కే మేము
ఏ దిక్కు మొక్కు లేకుండా
పడి చచ్చేది కూడా
మేమే మేమే
బతుకు భారమైన
భారతమాతలం



- కీర్తి ఇనుగుర్తి